




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 212 పేజీలు: 8+4 వెల: 6.50













# వెలిగొండ జలసిరులు

# అభివృద్ధికి రెక్కలు

మూడు దశాబ్దాల ప్రజా స్వప్నం సాకారమైంది... మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం

## పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశకు నేడే శ్రీకారం



1996లో ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసింది చంద్రబాబు గారే

నేడు మొదటి ఫేజ్ ప్రారంభించి నీళ్లు ఇస్తున్నది ఆయనే...

5 మార్చి 1996




గౌII ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు

## శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు

**తేదీ :** ఆగస్టు 31, 2026 | **సమయం :** ఉదయం 11 గంటలకు

**స్థలం :** గంటవానిపల్లి గ్రామం, దోర్నాల మండలం, మార్కాపురం జిల్లా


మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,200 కోట్లు

వెలిగొండ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం **53.85 టీఎంసీలు**

48 రోజుల్లోనే నిర్వాసిత కుటుంబాలకు **రూ.762 కోట్ల పరిహారం పంపిణీ**

4.47 లక్షల ఎకరాలకు సాగునీరు... **23 లక్షల మందికి త్రాగునీరు**

**తొలి విడతగా**
1.19 లక్షల ఎకరాలకు సాగునీరు...
4 లక్షల మందికి త్రాగునీరు




జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


## చంద్రబాబు భగీరథ ప్రయత్నం... కరువు సీమలో జల వసంతం



వెలిగొండ ప్రాజెక్టుకు కాలువలో నీరు ప్రవహిస్తున్న దృశ్యం

# ట్రయల్ రన్ విజయవంతం

>> చంద్రబాబు వెలిగొండ నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కరువు కాటకాలతో తల్లడిల్లిపోయే మార్కాపురం జిల్లా వాసుల జీవితాల్లో వెలిగొండ జలసిరులు వెలుగులు నింపనున్నాయి. దోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ జంట సొరంగాల ద్వారా ఆదివారం కృష్ణా జలాల ట్రయల్ రన్ నిర్వహించారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు వద్ద ఏర్పాటు చేసిన హెడ్ రెగ్యులేటర్ గేట్లను 3.3 అడుగులు ఎత్తి కృష్ణా జలాలను వదిలారు. 18.8 కిలోమీటర్లు సొరంగాలను దాటుకుని కృష్ణా జలాలు మార్కాపురం జిల్లాలోకి ప్రవేశించాయి. ఫీడర్ కెనాల్ ద్వారా నల్లమల రిజర్వాయర్ కు సోమవారం ముఖ్యమంత్రి నీటిని విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఫీడర్ కెనాల్ మధ్యలో ఏర్పాటు చేసిన గేట్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎత్తి నల్లమల సాగర్ లోకి విడుదల చేసి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రానున్నారు.

# ఇక అంతా ఆనందమే

>>కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ్ణ వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# విశాఖలో ఎఐజి ఆస్పత్రి

>> 350 పడకల సామర్థ్యంతో రెండేళ్లలో పూర్తిచేయనున్నారు. ఔట్‌పేషెంట్ విభాగాన్ని రోజుకు సుమా రు 5వేల మంది రోగులకు సంప్రదింపులు అందించే విధంగా రూపొందించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎఐజి హాస్పిటల్స్ లో అందించే పూర్తిస్థాయి వైద్య సేవలను ప్రతిబింబించేలా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ లో 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలు ఉండనున్నాయి. ప్రత్యేక మాతా శిశు విభాగం ఏర్పాటుచేయనున్నారు. ప్రత్యేకంగా కేటాయించిన 2.5 ఎకరాల ప్రాంగణంలో నర్సింగ్ కళాశాల, నర్సింగ్ సిబ్బంది కోసం హాస్టల్ నిర్మించనున్నారు. అనుబంధ ఆరోగ్య సేవలు, సాంకేతిక సిబ్బందికి పారామెడిక్ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పనున్నారు. నిరంతర విద్యా కార్యకలాపాల కోసం 500 సీట్ల ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఐసియు సెంటర్ ఏర్పాటుచేయడం జరుగుతుంది. విజిటింగ్ ఫ్యాకల్టీ, డాక్టర్స్ కోసం వసతి, రోగుల సహాయకులు, బంధువుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి కల్పిస్తారు. ఆసుపత్రి పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత వెయ్యి మంది వైద్యులు సేవలందించనున్నారు. వైద్యరంగంలో ఎఐజి హాస్పిటల్స్‌కు 30 యేళ్లకు పైగా అనుభవం ఉంది. హైదరాబాద్‌లో 3 యూనిట్లు, 1,400కు పైగా పడకలు, 350కు పైగా ఐసియు పడకలు, 600కు పైగా వైద్యులు, హెల్త్ కేర్ నిపుణులు ఉన్నారు. ఇప్పటివరకు 10 లక్షలకు పైగా రోగులకు చికిత్స అందించారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌కు ఎఐజి హాస్పిటల్స్ నిలయంగా ఉంది.

## కడప రైతు వరదరాజ్‌పై ప్రధాని ప్రశంసలు

>> ఒక ఉదాహరణ. ఆయన చాలా సంవత్సరాలుగా తన పొలాల్లో టమోటాలు, అరటిపండ్లు పండిస్తూ వచ్చారు. ఒకరోజు ఆయన తన స్నేహితుడి పొలంలో అవకాడో పంటను చూశారు. ఆ తర్వాత ఆయన యూట్యూబ్ నుండి దాని గురించి సమాచారం సేకరించారు. ఇప్పటివరకు ఆయన సుమారు 4 టన్నుల అవకాడోను పండించారు. ఈనాడు ఆయన దానిని నేరుగా స్థానిక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కొత్త పంట, శాస్త్రీయ సలహాలు, ప్రత్యక్ష మార్కెటింగ్‌తో ఆయన చిన్న పొలం ఆదాయం పూర్తిగా మారిపోయింది. తమిళనాడులోని కొడైకెనాల్‌కు చెందిన రైతు చంద్రశేఖరన్ గారు అర హెక్టారు భూమిలో అవకాడో పండించడం ప్రారంభించారు. ఆయనకు దానికి మంచి ధరలు లభిస్తున్నాయి. ఆయన ఆదాయం కూడా పెరిగింది. కర్ణాటకలోని చిక్కమగళూరుకు చెందిన కొందరు రైతు సోదర సోదరీమణులు తమ కాఫీ తోటల మధ్యలో అవకాడోను పండించారు. దీనివల్ల వారికి కాఫీ, నల్ల మిరియాలతో పాటు అదనపు ఆదాయం కూడా లభిస్తోంది. నగరాల్లోని రెస్టారెంట్లలో అవకాడో టోస్ట్ గురించి తరచుగా వింటూ ఉంటాం. కానీ ఈ అవకాడో ద్వారానే మన సృజనాత్మక రైతులు ఆదాయం సంపాదించడానికి ఒక కొత్త మార్గాన్ని కనుగొన్నారు. అంటే మన దేశపు అవకాడో మీ టోస్ట్ రుచిని మెరుగుపరచడమే కాకుండా రైతుల ఆదాయాన్ని కూడా పెంచిందన్నమాట్ణ అని ప్రధాని మోడీ వివరించారు. సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఈ ఉదాహరణలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

# రూ.2,693.90 కోట్లు విడుదల

>>గా ఈ పింఛన్లను పంపిణీ చేస్తామని, కొత్తగా మంజూరైన 6,268 వితంతు లబ్ధిదారులకు సెప్టెంబర్ 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ.2.51 కోట్లను విడుదల చేసినట్టు కూడా మంత్రి తెలిపారు. భర్త మరణించిన అనంతరం అర్హత కలిగిన జీవిత భాగస్వామికి సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో స్పౌజ్ పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పింఛన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ.73,506 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# ఎపికి నౌకా రంగంలో భారీ ప్రాజెక్ట్

>> పెట్టుబడిలో 30శాతం రాయితీ ఇవ్వాలని ఆ సంస్థ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. రాయితీ కింద ఎంత మొత్తం అనుమతించాలనే విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశీలిస్తోంది. దుగరాజపట్నంలో పోర్టు అభివృద్ధికి అవసరమైన కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అయ్యే ఖర్చును కేంద్రమే భరించనుంది. ఎపి సర్కార్ తన వాటా కింద పోర్టు, షిప్‌బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధికి అవసరమైన భూములను అందిస్తుంది. పోర్టు, షిప్‌యార్డు నిర్మాణానికి వీలుగా 2200 ఎకరాలు సేకరించేందుకు ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు కార్యాచరణ చేపట్టింది. షిప్‌యార్డుకు 1000 ఎకరాలు, అనుబంధ పరిశ్రమల కోసం 1350 ఎకరాలు కేటాయించాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఎపి మారిటైం బోర్డు, విశాఖపట్నం పోర్టు అథారిటీలు దుగరాజపట్నం పోర్టు, షిప్‌బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధిని పర్యవేక్షించనున్నాయి.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు జనసేన సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు30:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన పార్టీ తెలంగాణలోనూ పోటీకి సిద్ధమవుతోంది. వచ్చే ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నామని జనసేన అధికార ప్రతినిధి తళ్లూరి రామ్ వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీ బలంగా పోటీ చేస్తుందని ఆదివారం ఆయన మీడియా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలోనూ పోటీకి సిద్ధమవుతున్న జనసేన పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ బలంగా పోటీ చేస్తుందని ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ స్పష్టం చేశారు. కాగా, జనసేన కార్యాలయంలో ఆదివారం జనసేన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా. ఎన్నికల్లో పోటీకి జనసేన శ్రేణులు సిద్ధమవ్వాలని, జనసేన పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తళ్లూరి రామ్ సూచించారు.

# నేడే వెలిగొండ పండుగ

>> వైవిధ్యీకరణకు అవకాశం ఏర్పడుతుంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు ఉద్యానవనం, అగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు పెరుగుతాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి, వలసలకు అడ్డుకట్ట పడనుంది.

**30 యేళ్ల ప్రయాణం... సంకల్పం నుంచి సాకారం వరకు:** 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది. టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలో నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లింపులు జరపడం ద్వారా పనులకు వేగం తీసుకువచ్చింది. అంతేకాకుండా గెజిట్, జాబితాలో పేర్లు లేని వారికోసం మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్ల నిండిని వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అన్న అరుదైన చారిత్రక ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవుతుండటం మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.15 గంటలకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతారు. ఉదయం 10.25 గంటలకు రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10.35 గంటల నుంచి 11.20గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను ప్రారంభించి వెలిగొండకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు గంటవానిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ప్రజావేదిక సభలో ముఖ్య మంత్రి ప్రసంగిస్తారు. సభ అనంతరం మధ్యాహ్నం 1.30గంటలకు తిరుగు ప్రయాణమై మధ్యాహ్నం 2.15గం.లకు ఉండవల్లికి చేరుకుంటారు.

# పల్లె సీమల అభివృద్ధిపై డి.సిఎం పవన్ దృష్టి

>> మద్దతుగా ఉద్యాన సాగు, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో ఉప ముఖ్యమంత్రి దార్శనికతతో విశేష ఫలితాలు సాధించారు. రాయలసీమ వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుని పవన్ కల్యాణ్ తన శాఖల పరిధిలో కేటాయింపులు, పనుల అమలులో ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించిన వెంటనే చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమం 13,326 పంచాయతీల్లో ఏకకాలంలో గ్రామసభల నిర్వహణ. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం మైసూరువారిపల్లి గ్రామాన్ని వేదికగా చేసుకున్నారు. ఫారం పాండ్స్ (పంట కుంటలు) రాష్ట్రవ్యాప్త నిర్మాణ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పుడిచెర్ల గ్రామంలో శ్రీకారం చుట్టారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వీబీజీరాంజీ జాతీయ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా రాయలసీమ ప్రాంతాన్నే వేదికగా ఎంచుకుని ఆ ప్రాంతం పట్ల తన దృక్పథాన్ని చాటుకున్నారు. అభివృద్ధి పనుల విషయానికి వస్తే, ఒక్క ఫారం పాండ్ల నిర్మాణం ద్వారానే రాయలసీమ వ్యాప్తంగా అదనంగా 50 వేలకు పైగా ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. రైతులకు సుమారు రూ.55 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. రాయలసీమలో జలసిరులు పారిస్తూ పవన్ కల్యాణ్ పంటల సాగుకు అనుకూల పరిస్థితులను కల్పించారు. ఎనిమిది జిల్లాల పరిధిలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డిడబ్ల్యుఎంఎ) ఆధ్వర్యంలో గ్రామీణ మౌలిక సదుపాయాలు, నీటి సంరక్షణ, జీవనోపాధిని మెరుగుపరచే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార కింద మూడు మెగా వాటర్ స్కీమ్ పథకాలను ముందుకు తీసుకువెళ్తున్నారు.

బీటలు వారిన నేలలతో ఉన్న రాయలసీమకు కొత్త జీవం పోస్తూ వేల సంఖ్యలో ఫారం పాండ్లు నిర్మించి, వేలాది ఎకరాల భూమిని సాగుకు అనుకూలంగా మార్చారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఓర్వకల్లు మండలం పుడిచర్ల గ్రామంలో ఫారం పాండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి దశలో రాయలసీమ ఎనిమిది జిల్లాల పరిధిలో రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో 40,837 పంట కుంటలు నిర్మించాలన్న లక్ష్యాన్ని అధిగమించారు. రూ.166.46 కోట్లు వెచ్చించి 41,614 వ్యవసాయ చెరువులు నిర్మించి లక్ష్యాన్ని మించి సాధించారు. రెండో దశలో ఇప్పటికే 29,902 ఫార్మ్ పాండ్లు మంజూరై వివిధ దశల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. రెండు దశల ఫారం పాండ్ల నిర్మాణంతో రాయలసీమ ప్రాంతంలో అదనంగా 50 వేలకు పైగా ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. గడచిన రెండేళ్లలో సుమారు 15 వేల మినీ గోకులాలు (వ్యక్తిగత పశువుల షెడ్లు) నిర్మించారు. మరో 3 వేల గోకులాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అందులో మొదటి దశలోనే లక్ష్యాన్ని అధిగమించి 9,708 మినీ గోకులాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కార్యక్రమాల్లో కలిపి కేవలం వ్యక్తిగత పశువుల షెడ్ల నిర్మాణానికే రూ.170 కోట్లకు పైగా వ్యయం చేశారు. రెండు దశల్లో సుమారు 62 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగుకు రూ.200 కోట్లకు పైగా ఖర్చు చేశారు. నిరుపేద రైతులకు అండగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఎకరాకు ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం లభిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా రాయలసీమ ప్రాంతంలో 28 వేల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరింది.

ముసలమడుగులో కుంకీల స్థావరం: అటవీశాఖ ద్వారా రాయలసీమ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను డి.సిఎం పవన్ కల్యాణ్ ముందుకు తీసుకువెళ్తున్నారు. ముఖ్యంగా చిత్తూరు, అన్నమయ్య తదితర రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో అడవి ఏనుగుల సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు కర్ణాటక నుంచి తీసుకొచ్చిన కుంకీ ఏనుగులకు పలమనేరు నియోజకవర్గం పరిధిలోని ముసలమడుగులో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముసలమడుగు శిబిరం నుంచే కుంకీలు దాదాపు 15 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశాయి. కుంకీల రాకతో మానవఏనుగుల ఘర్షణలు 75 శాతం తగ్గాయి. పంటల నష్టం కూడా 50 శాతం తగ్గింది.

పట్టణాలకు పచ్చని ఊపిరితిత్తులుగా పేరుగాంచిన నగర వనాలను రాయలసీమ ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే రూ.26 కోట్లతో 13 నగర వనాల నిర్మాణం పూర్తి చేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, పుట్టపర్తి సత్యసాయి ఎకో పార్క్, బద్వేల్, తిరుపతి కైలాసగిరి, అన్నమయ్య జిల్లాలో కోడూరు, నంద్యాల జిల్లా పరిధిలో డోన్ తదితర ప్రాంతాల్లో నగర వనాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

పురోగతిలో రూ. 2,782 కోట్ల జెజెఎం-అమరజీవి జలధార పనులు: నిత్యం దాహార్తితో అల్లాడే రాయలసీమ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి జెజెఎం- అమరజీవి జలధార పథకాల పనులను ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకువెళ్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న పులివెందుల మల్టీ విలేజ్ వాటర్ స్కీమ్ పనులను రూ.280 కోట్లు వెచ్చించి పూర్తి చేస్తున్నారు. రూ.480 కోట్లతో ప్రారంభమైన ఈ వాటర్ స్కీమ్ గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైంది. 2024 నాటికి జల్ జీవన్ మిషన్ గడువు ముగియడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పవన్ కల్యాణ్ కూటమి పెద్దలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి జల్ జీవన్ మిషన్ గడువును మరో నాలుగేళ్లపాటు పొడిగించడంతో పులివెందుల తాగునీటి పథకం పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. డోన్ మల్టీ విలేజ్ స్కీమ్‌ను కూడా గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలి వెళ్లగా, ఉప ముఖ్యమంత్రి రూ. 132 కోట్లతో పనులు చేపట్టారు. ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఈ పథకం ద్వారా మూడున్నర లక్షల మందికి తాగునీరు అందనుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ.2,370 కోట్లతో చిత్తూరు మెగా వాటర్ గ్రిడ్ పథకానికి శ్రీకారం చుట్టారు. వచ్చే 30యేళ్లలో దాదాపు 25 లక్షల మందికి పైగా ప్రజల దాహార్తి తీర్చే ఈ పథకం పనులు వేగంగా సాగుతున్నాయి.

రాయలసీమ వ్యాప్తంగా ఎనిమిది జిల్లాల పరిధిలో గ్రామాల్లో అంతర్గత రహదారులు, గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0, సాస్కి తదితర పథకాల ద్వారా రూ.4,523 కోట్ల అంచనా వ్యయంతో 23,000కు పైగా రోడ్ల పనులు చేపట్టారు. అందులో 4,630 కిలోమీటర్లు బిటి, 3,067 కిలోమీటర్ల సిసి రోడ్లు ఉన్నాయి. మంజూరైన వాటిలో 2,582 కిలోమీటర్ల బిటి, 2,655 కిలోమీటర్ల సిసి రోడ్ల నిర్మాణం కూడా పూర్తయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. అందులో అత్యధికంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు రూ.876 కోట్లు మంజూరు కాగా, అనంతపురం జిల్లాకు రూ. 691 కోట్లు, తిరుపతి జిల్లాకు రూ.521 కోట్లు, అన్నమయ్య జిల్లాలకు రూ.518 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు రూ.483 కోట్లు కేటాయించారు. ఇందులో పల్లెపండుగ ద్వారా నిర్మించిన రోడ్లు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పల్లెపండుగ 2.0, సాస్కి తదితర పథకాల ద్వారా చేపట్టిన రోడ్లలో సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆ జిల్లాలో రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లు అదనపు నిధులు మంజూరు చేశారు. పుట్టపర్తికి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు వీలుగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ అభివృద్దికి కట్టుబడి ముందుకు వెళ్తుంది.

# ప్రధాని మోడీకి ఉజ్బెక్ అత్యున్నత పురస్కారం


>>షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారంతో, ప్రధాని మోడీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆయన 30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం బింటాంగ్ ఆదిపుర్నను మోడీకి బహూకరించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోడీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోడీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోడీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోడీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం. కాగా గతంలో ఉజ్బెకిస్తాన్‌అత్యున్నత పురస్కారాన్ని చైనా అధినేత జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు కూడా అందుకున్నారు. వీరితోపాటు అజర్‌బైజాంఇల్హమ్ అలీవ్, తుర్క్‌మెనిస్తాన్ సెర్దార్ బెర్దిముహమెదోవ్, కాస్సిమ్ జోమార్ట్ టోకాయెవ్ కజకిస్తాన్ అందుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య ఉన్నత స్థాయి దౌత్య చర్చలు పూర్తయ్యాయి. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తృతం చేసుకోవడానికి అనువైన మార్గాలపై ఇరు దేశాల అధినేతలు సుదీర్ఘంగా చర్చించారు.

## భారత్ ఉజ్బెకిస్థాన్‌ల మధ్య ఐదు బిలియన్ డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం

### ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు..30 రోజులు వీసాఫ్రీ అరైవల్

**తాష్కెంట్, ఆగస్టు 30:** భారత పౌరులకు 30 రోజుల పాటు వీసా లేకుండానే ఉజ్బెకిస్తాన్ దేశంలోకి ప్రవేశించే అవకాశం కల్పించింది. ప్రధాని మోడీ ఉజ్బెకిస్థాన్ పర్యటన సందర్భంగా ఈ నిర్ణయం వెలువడింది. ఈ చర్యతో పర్యాటకం, వ్యాపార సంబంధాలు, ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ తెలిపారు. ఆదివారం తాష్కెంట్‌లో ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్ మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాలని నిర్ణయించారు. అలాగే 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026లో భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 15 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలకు మరింత విస్తృతమైన, ప్రతిష్టాత్మకమైన రూపాన్ని కల్పిస్తున్నామని మోడీ తెలిపారు. గత ఏడాది భారత్‌ఉజ్బెకిస్థాన్



మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం తొలిసారిగా 1 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిందని మిర్జియోయెవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య జాయింట్ వెంచర్ల సంఖ్య కూడా ఇటీవలి సంవత్సరాల్లో ఏకంగా ఏడు రెట్లు పెరిగిందని చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అంతరిక్షం, అణు ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. భారత్‌ఉజ్బెకిస్థాన్ చర్చల్లో అణు ఇంధన రంగం కూడా కీలకంగా నిలిచింది. ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసే ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు మోడీ ప్రకటించారు. రక్షణ, భద్రతా సహకారంపైనా ఇరు దేశాల నేతలు చర్చించారు. రక్షణ రంగాల్లో ప్రత్యక్షభాగస్వామ్యం, ఉమ్మడి ఉత్పత్తి, సంయుక్త అభివృద్ధిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం ప్రాంతానికి తీవ్రమైన సవాళ్లని వీటిని ఎదుర్కోవడంలో భారత్, ఉజ్బెకిస్థాన్ కలిసి పనిచేయాలని మోడీ అన్నారు. ఇంధనం, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, ఆభరణాలు, సంస్కృతి వంటి రంగాల్లోనూ సహకారాన్ని పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనున్నారు. భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య ప్రస్తుతం వారానికి 14 నేరుగా విమాన సర్వీసులు నడుస్తున్నాయని మిర్జియోయెవ్ తెలిపారు. కొత్త వీసా రహిత విధానంతో పర్యాటకులు, వ్యాపార ప్రయాణికుల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఉజ్బెకిస్థాన్‌లో యోగా కూడా వేగంగా ప్రజాదరణ పొందుతోందని చెప్పారు. 2018 నుంచి ఆ దేశంలో ప్రత్యేక యోగా ఫెడరేషన్ పనిచేస్తోంది. జూన్‌లో దేశవ్యాప్తంగా యోగా ఫెస్టివల్‌ను కూడా నిర్వహించారు. దేశాల మధ్య సంబంధాలను స్థానిక స్థాయిలోనూ విస్తరించేందుకు మూడు సిస్టర్ సిటీ, సిస్టర్ స్టేట్ ఒప్పందాలు చేసుకోవాలని భారత్, ఉజ్బెకిస్థాన్ నిర్ణయించాయి. ఉజ్బెకిస్థాన్ నిర్మిస్తున్న న్యూ తాష్కెంట్ ప్రాజెక్టు, గుజరాత్‌లోని భారత గిఫ్ట్ సిటీ మధ్య సహకారానికి అవకాశాలున్నాయని మోడీ తెలిపారు. గిఫ్ట్ సిటీ అభివృద్ధిలో ఉపయోగించిన సాంకేతికత, ప్రణాళికలు, ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకు ఉజ్బెక్ ప్రతినిధి బృందాన్ని భారత్‌కు ఆహ్వానించారు. భారత్, ఉజ్బెకిస్థాన్ 1992లో దౌత్య సంబంధాలను ఏర్పరచుకున్నాయి. 2011లో ఇరు దేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరాయి. మోడీ తాజా పర్యటన ఉజ్బెకిస్థాన్‌కు ఆయన నాలుగో పర్యటన.

## వారం - వర్జ్యం

31-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బకార్తె
తి.తదియ ఉ.8.50
న.రేవతి రా.3.22
వ.మ.3.33-సా.5.06
దు1.మ.12.32-మ.1.22
దు2. మ.3.01-మ.3.51
రాహు. ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యంగా రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వాహన సౌఖ్యం కలదు.

**వృషభం :** వ్యాపారంలో రొటేషన్స్ బాగుంటాయి. కార్యాలయంలో మీ స్థాయి యధాతధంగా ఉంటుంది. దేవాలయ దర్శనం.

**మిథునం :** ప్రముఖ వ్యక్తి ద్వారా మీకు అనుకూలంగా వ్రాయబడిన సిఫార్స్ లేఖ చేరవలసిన చోటుకు చేరుతుంది.

**కర్కాటకం :** ఇంటా బయటా అనుకూలమైన పరిస్థితులు ఉంటాయి. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**సింహం :** జీవిత భాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. ఆరోగ్య, వాహనాల విషయంలో మెలుకువ అవసరం.

**కన్య :** వృత్తిలో మీరు ఆశించిన లాభాలు వుండకపోవచ్చు. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం వలన సంతృప్తి చెందుతారు. నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురు అవుతాయి.

**వృశ్చికం :** కుటుంబ సభ్యుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పనులలో జాప్యం జరిగిన పూర్తి చేస్తారు.

**ధనుస్సు :** క్రమశిక్షణ లేని అత్యంత సన్నిహితులవలన ఇబ్బందులు వస్తాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుతాయి.

**మకరం :** మీ ప్రమేయం లేకుండానే వివాదాలలోకి లాగబడతారు. క్రీడలలో వేడుకలలో పాల్గొంటారు. ధన లాభం.

**కుంభం :** సహోదర, సహోదరీ వర్గం యొక్క యోగక్షేమాలను విచారిస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. వస్త్ర లాభం.

**మీనం :** విధినిర్వహణలలో మీ విలక్షణమైన శైలితో అందరినీ ఆకట్టుకుంటారు. వ్యాపార పరంగా సాధారణంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 212 పేజీలు: 8+4 వెల: 6.50

ఆచూకీ కోసం 'పెద్ద రెస్క్యూ' 7లో
ఉక్రెయిన్‌పై రష్యా వైమానిక దాడుల బీభత్సం


ప్రధాని మోడీకి 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో సత్కరిస్తున్న ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్

# ప్రధాని మోడీకి ఉజ్బెక్ అత్యున్నత పురస్కారం

### తాష్కెంట్‌లో ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్

**తాష్కెంట్, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన ఓలియ్ దరాజలీ దోస్తిలిక్ ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు >>2

భారత్ ఉజ్బెకిస్థాన్‌ల మధ్య ఐదు బిలియన్ డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం 2లో

# నేడే వెలిగొండ పండుగ




### ప్రాజెక్టు ఫేజ్-1 ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు
### 30యేళ్ల కల సాకారంతో ప్రజల్లో హర్షాతిరేకం
### 'వెలిగొండ జలసిరులు- అభివృద్ధికి రెక్కల్లు' పేరుతో వేడుక

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి ప్రారంభించి, నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం లభించనుంది. ముఖ్యంగా 30యేళ్ల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించడం చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు- అభివృద్ధికి రెక్కల్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.

**కరవు నేలకు కృష్ణమ్మ జలాలు:** తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్యలు, సాగునీటి కొరతతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు మాత్రమే కాదు... ఆ ప్రాంత భవిష్యత్తును మార్చే జీవనాధార ప్రాజెక్టు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేసి, ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేలా రూపొందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 30 మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో సహా 23లక్షల మందికి తాగునీటి ప్రయోజనం చేకూరనుంది.

**తొలిదశతో కొత్త అధ్యాయం:** తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టిఎంసిల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. తొలి విడతలో సుమారు 1.19లక్షల ఎకరాలకు సాగునీరు, 4లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెలిగొండ జలాలు అందుబాటులోకి రావడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. సాగునీటి భద్రత పెరగడంతో పంటలపై అనిశ్చితి తగ్గి, పంటల >>2

# ట్రయల్ రన్ విజయవంతం

**మార్కాపురం, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** వెలిగొండ నీటి విడుదల ట్రయల్ రన్ విజయం కావడం పట్ల అధికారుల హర్షం వ్యక్తం చేశారు. సైరన్ మోగించి అధికారులు ముందుగా అప్రమత్తం చేశారు. తరువా తకొల్లం వాగు వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు నీటి విడుదల చారిత్రాత్మక ఘట్టానికి ముందడుగు పడింది. మరికొద్ది గంటల్లో మూడు దశాబ్దాల కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమ వారం ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. సీఎం >>2



# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర ఇక అంతా ఆనందమే

### నేడు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం
### సిఎం చంద్రబాబు భావోద్వేగంతో ట్వీట్
### నల్లమల కొండల గుండా సాగర్‌లోకి కృష్ణా జలాలు
### తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని 'ఎక్స్' వేదికగా సిఎం వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు >>2

# కడప రైతు వరదరాజ్‌పై ప్రధాని ప్రశంసలు

### మన్‌కీ బాత్ ప్రసంగంలో అవకాడో సాగు
### సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయండి
### రైతులు కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రధాని పిలుపు

**కడప, ఆగస్టు 30 ప్రభాతవార్త:** అవకాడో సాగుకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను, వివిధ ప్రాంతాల రైతులు అవకాడో సాగు ద్వారా లబ్ధి పొందుతున్న విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 'మన్‌కీ బాత్' ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన రైతు వరదరాజ్ విజయగాథను ప్రధాని మోడీ ప్రస్తావించారు. మన్‌కీ బాత్ 137వ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ, "ఈ రోజుల్లో అవకాడో పండుకు విపరీతమైన గిరాకీ ఉంది. గతంలో ఈ పండు గురించి చాలా తక్కువ మందికి తెలిసేది. దీని విలువ, డిమాండ్ రెండూ తక్కువగా ఉండేవి. కానీ ఈ రోజుల్లో ఇది డైనింగ్ టెబుళ్లపై విరివిగా కనిపిస్తోంది. నేడు ఇది ఆరోగ్య, ప్రీమియం మార్కెట్లలో అత్యంత ఇష్టమైనదిగా మారింది. ఇది మన రైతు సోదర సోదరీమణులకు కూడా చాలా సహాయకారిగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన వరదరాజ్ ఇందుకు >>2



# విశాఖలో ఎఐజి ఆస్పత్రి

### రూ.2 వేల కోట్లతో 9 ఎకరాల్లో నిర్మాణం
### 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాల
### ప్రపంచస్థాయి హెల్త్ కేర్, అకడమిక్ అండ్ రీసెర్చ్ హబ్
### 9వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు
### నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్



**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాప్రభుత్వ పాలనలో విశాఖపట్నం అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకుం టోంది. విశాఖలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖకు ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఎఐజి ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. విశాఖలోని ఎండాడ ప్రాంతంలో ఎఐజి హాస్పిటల్స్ నిర్మాణానికి విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఆస్పత్రి ఏర్పాటు ద్వారా ఎపి వాసులు ఇకపై హైదరాబాద్ వెళ్లే పనిలేకుండానే మెరుగైన వైద్యం రాష్ట్రంలోనే అందుబాటులోకి రానుంది. విశాఖలో నెలకొల్పనున్న ఎఐజి ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. ఓపిడి సేవలు రోజుకు 5వేలు ఉండనున్నాయి. హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీకి చెందిన ఎఐజి హాస్పిటల్స్ విశాఖలో 9 ఎకరాల్లో ఆస్పత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటుచేయనుంది. ఒకే క్యాంపస్‌లో వైద్య సేవలు, శిక్షణ, పరిశోధన, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన కంప్లీట్ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను నెలకొల్పనుంది. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి పూర్తిచేయనున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని >>2



# ఎపికి నౌకా రంగంలో భారీ ప్రాజెక్ట్

### రూ.26 వేల కోట్లతో షిప్ బిల్డింగ్ క్లస్టర్
### దుగ్గరాజపట్నంలో ఏర్పాటుకు ఎండిఎల్ సంసిద్ధత
### డిపిఆర్ తయారీకి టెక్నికల్ కన్సల్టెంట్ నియామకానికి ఎపి ఇఒఐ ప్రకటన
### పోర్టు, షిప్‌యార్డు నిర్మాణానికి వీలుగా 2200 ఎకరాలు సేకరణకు కసరత్తు
### ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు కార్యాచరణ
### షిప్‌యార్డుకు 1000 ఎకరాలు, అనుబంధ పరిశ్రమల కోసం 1350 ఎకరాలు కేటాయింపు

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపికి మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ రాబోతోంది. దుగరాజపట్నంలో ప్రతిపాదించిన షిప్ బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధికి ఎండిఎల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనపై ఎండిఎల్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఇటీవల చర్చలు జరిపారు. నౌకా నిర్మాణ రంగంలో కీలకంగా వ్యవహరిస్తున్న రక్షణరంగ సంస్థ మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండిఎల్) రాష్ట్రంలో తయారీ యూనిట్ ఏర్పాటుకు సిద్ధమైంది. నవరత్న కంపెనీగా పరిగణిస్తున్న ఎండిఎల్ షిప్ బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధికి సుమారు రూ.26,000 కోట్ల పెట్టుబడి పెట్టే అవకాశం ఉందని అధికారుల ప్రాథమిక అంచనా. ఈ పెట్టుబడులను విదేశాల నుంచి సమీకరించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో నిర్దేశించిన ప్రకారం కేంద్ర సహకారంతో దుగ్గరాజపట్నంలో పోర్టును అభివృద్ధి చేయాల్సి ఉంది. భారత నౌకాదళం, తీర రక్షక దళం కోసం విధ్వంసక నౌకలు, స్టెల్త్‌ఫ్రిగేట్లు, కార్వెట్లు (చిన్న యుద్ధనౌకలు), పెట్రోలింగ్ నౌకలు, జలాంతర్గాముల నిర్మాణంలో ఎండిఎల్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సంస్థ వాణిజ్య నౌకలనూ నిర్మిస్తోంది. ఇటీవల దుగరాజపట్నం, షిప్‌బిల్డింగ్, నౌకల మరమ్మతుల క్లస్టర్ అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్) తయారు చేసేందుకు టెక్నికల్ కన్సల్టెంట్‌ను నియమించేందుకు ఎపి సర్కార్ ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) ప్రకటన ఇచ్చింది. దీనికి స్పందించి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి డిపిఆర్ తయారీకి సంస్థను సెలక్ట్ చేస్తారు. షిప్‌యార్డు లేఅవుట్ సహా పోర్టు, షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌కు మాస్టర్‌ప్లాన్‌తో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చేపట్టాల్సిన పనులకూ డిపిఆర్ తయారీ సంస్థ అంచనాలు రూపొందించనుంది. ఈ క్రమంలో షిప్ బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధికి ఎండిఎల్ ముందుకు వచ్చింది. ఎండిఎల్‌ను 1934లో ఏర్పాటు చేశారు. దీన్ని 1960లో కేంద్రం టేకోవర్ చేసింది. కొన్ని దశాబ్దాలుగా షిప్‌బిల్డింగ్ రంగంలో ఈ సంస్థ కీలకంగా ఉంది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కావడంతో ఎపి సర్కార్ కూడా దుగరాజపట్నం షిప్‌యార్డు నిర్మాణానికి ఎండిఎల్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చల సందర్భంగా మూలధన >>2

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు
# రూ.2,693.90 కోట్లు విడుదల

### రేపు 61.92 లక్షల మందికి పంపిణీ
### కొత్తగా 6,268 మందికి స్పౌజ్ పెన్షన్లు:
### మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో 61,92,396 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,693.90 కోట్లను విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తం >>2



# పల్లె సీమల అభివృద్ధిపై డి.సిఎం పవన్ దృష్టి

### రూ.8,022 కోట్లతో గ్రామాలు, అటవీ అభివృద్ధి ప్రణాళికలు, రూ.4,523 కోట్లతో 23,000కు పైగా రోడ్ల పనులు
### 5,238 కిలోమీటర్ల మేర బిటి, సిసిరోడ్ల నిర్మాణం పూర్తి, జల సంరక్షణ చర్యలతో సీమ సస్యశ్యామలం

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్- అమరజీవి జలధార పథకాలతో సీమ గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. గడచిన రెండేళ్లలో సుమారు రూ.8,022 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టారు. జల సంరక్షణ, రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, రైతులకు అండగా ఉపాధి కల్పన, పాడి రైతులకు గోకులాల భరోసా, పండ్ల తోటల రైతులకు >>2



వార్త

చాలా మంది యువకులు యుద్ధం గురించి చాలా గొప్పగా ఆలోచిస్తారు. కానీ నిజానికి అదొక నరకం.

- జనరల్ విలియం షెర్మన్


# చిన్నబోయిన 'న్యాయ' మీమాంస!

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరు అత్యంత పారదర్శకంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. కక్షిదారులకు న్యాయం చేయడం ఎంతముఖ్యమో, వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించడమూ అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థ పారదర్శకతపై ఇటీవల కాలంలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీటిపై బయటివారు, కక్షిదారులో విమర్శించే విషయాల కన్నా ఆ వ్యవస్థలోని వారినుంచే కొన్ని వ్యాఖ్యలు చర్చల్లోకి వచ్చాయి. ప్రధానంగా న్యాయస్థానాల పనితీరు, సమాచారం లభ్యత,జవాబుదారీతనం, నియామక ప్రక్రియలు, తీర్పుల లభ్యత, పరిపాలనా పారదర్శకత అనే అంశాలు పరిశీలనలోకొస్తాయి. ఒకప్పుడుకేసుల కేటాయింపుల అంశంలో సుప్రీం న్యాయమూర్తులేప్రధాన న్యాయమూర్తి వైఖరి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేసిన విషయం విదితమే. అదేదో సంక్షోభమని చెప్పలేం కానీ అంతర్గత అసంతృప్తి నుంచి రాజుకున్న విమర్శలే. న్యాయవ్యవస్థలో పారదర్శకత పేరిట బయటకురాకూడదని విషయాలు బహిర్గతమవడంతోనే వచ్చినతంటా అది. తాజాగా అలాంటి సందర్భాలే తలెత్తాయి. న్యాయ వ్యవస్థలో అదేమిటి, ఇదేమిటి, అలా జరిగిందేమిటి? ఇలా జరిగి ఉండవచ్చుకదా! అనే స్వేచ్ఛాభావాల వ్యక్తీకరణ కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. జస్టిస్ ఉజ్వల్ భుయాన్ చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం విషయమే కాకుండా కొలీజియం వ్యవస్థపై మళ్లీ చర్చను తెరపైకి తెచ్చాయి. తమ కేసులు విచారణాధికారిగా ఉన్న న్యాయమూర్తులు ఎవరు, వారి పనితీరు, నియామక అర్హతల గురించి తెలుసుకోగలిగితేనే వారి మీద నమ్మకం ఏర్పడుతుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. అందుకే న్యాయ వ్యవస్థలోని సంస్థాగత విశ్వసనీయత కూడా అవసరమేనని హితవు చెబుతున్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సాధారణమైనవిగా చూడలేము. 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను 5 హైకోర్టులు మాత్రమే తమ వెబ్‌సైట్‌లలో ప్రచురించాయి. మిగిలిన కోర్టులు అలాంటి ప్రయత్నమేమీ చేయలేదు. 813మంది హైకోర్టు న్యాయమూర్తుల్లో కేవలం 87మంది మాత్రమే తమ ఆస్తులవిషయాలను ప్రకటించారు. అందరూ తమకు సంబంధించిన వివరాలను ప్రకటించడంద్వారా పారదర్శకతను పెంచవచ్చునన్నది అభిప్రాయం ఎల్లెడలా చర్చించుకుంటున్న విషయం న్యాయవ్యవస్థ తీరుతెన్నులను అందులోనివారే ప్రశ్నించేపరిస్థితిని నమ్మాల్సిందే. అందుకే ఇలాంటి అంశాలపై మారిన కాలమాన పరిస్థితుల రీత్యా విస్తృత చర్చలోకి రావడాన్ని అభ్యంతరపెట్టలేం. న్యాయ వ్యవస్థలోని ప్రతి ఒక్కరూ వారి వారి స్థాయిలతో సంబంధం లేకుండా న్యాయపీఠ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీను. ప్రధానంగా కేసుల పెండింగ్, న్యాయమూర్తుల నియామక కొలీజియమ్ వ్యవస్థ, నిర్ణయాలు తరచు బాగావిమర్శలకు గురవుతున్న అంశాలు. ఆవ్యవస్థ ఉండరాదని కేంద్రప్రభుత్వం భావిస్తోంటే స్వతంత్ర్య వ్యవస్థ అవసరమేనన్న ఆవశ్యకతను సుప్రీం న్యాయమూర్తులు, న్యాయకోవిదులు తగిన వేదికల మీద చెబుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ విధి విధానాలపై సమతుల్యత విషయంలో వస్తున్న అంతరాలపై ఎప్పటి నుంచో బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్గంతగానూకొంత సంక్షోభం ఉంది. తాజాగా న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే పారదర్శకత అత్యంత ముఖ్యమన్న సుప్రీంకోర్టున్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీసింది. జడ్జిల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియమ్ పనితీరును ఆయనప్రశ్నించారు. బదిలీలు, నియామకాలకు సంబంధిత సిఫార్సుల్లో ఈ మధ్యకాలంలో సరైనకారణాలను వెల్లడించకపోవడంప్రతిభావంతులైన న్యాయమూర్తులకు అన్యాయం చేకూరుతుందని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయమూర్తుల ఎంపిక వెనుక వారిప్రతిభ, వగైరా కారణాలను వెల్లడించడానికి ఆయన తీవ్రంగాతప్పుపట్టారు. ఎన్నో సున్నితమైన వ్యాఖ్యలు చేశారు. 2025నాటి పదోన్నతిసిఫార్సులకు సంబంధించినగత మూడు కొలీజియం తీర్మానాల్లోను నియామక ఎంపిక కారణాలను వివరించకపోవడాన్ని ఆయన లోపభూయిష్టంగా పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తివిరుద్ధమైన వ్యాఖ్యలు చేసే వ్యక్తులున్యాయ వ్యవస్థలోకి ప్రవేశించడానికి పరోక్ష అవకాశం ఇచ్చినట్లవుతుందని భుయాన్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో 'విధి' సెంటర్ ఫర్‌లీగల్ పాలిసీకి చెందిన (జెడ్ఎఎల్‌డిఐ) న్యాయ మేధోమదన సంస్థ ఆధ్వర్యంలో జ్యుడిషియల్ ట్రాన్స్‌పరెన్సీ ఇండెక్స్ ప్రారంభోత్సవ సభలో జరిగిన ప్యానల్ చర్చలో ఆయన పాల్గొన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఉద్దేశించిన వ్యాఖ్యలు కాకపోయినా తరచి చూస్తే భుయాన్ ఎంతో నిబద్ధతతో చేసిన స్వేచ్ఛా వ్యాఖ్య వ్యవస్థలోని మంచిచెడులకు జవాబుదారీ ఏదనే ఆలో చనలో మాట్లాడారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నో ఉదంతాలు, సంఘటనలు ఆయన వ్యాఖ్యలకు కారణమై ఉండొచ్చునన్నారు. గతంలో కొలీజియం నిర్ణయాల సందర్భంలో కొన్నిసార్లు సిఫార్సులు మొక్కుబడిగా ఉన్నాయని, మరికొన్ని సార్లు మాత్రమే కారణాలు బయటికి వచ్చేవి. ఇప్పుడా పారదర్శకత పద్ధతి కూడా కనిపించకపోవడాన్ని తిరోగమనంగా ప్రజల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వం అసలు కొలీజియం వ్యవస్థే అవసరం లేదని భావిస్తోంది. వ్యవస్థ అభిప్రాయమున్నా ప్రస్తుత అంశం కొలీజియం తీరుతెన్నులపై చర్చను రాజేస్తోంది. న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడేందుకే ఆయన విమర్శలు సాగినందున తప్పు పట్టాల్సిన అభిప్రాయం. పారదర్శకత ద్వారానే ఇలాంటివి సాధ్యం.



సుఖ దుఃఖాలను సమంగా చూసేవారే విశ్వరహస్యాన్ని తెలుసుకోగలరు.

గురునానక్



రచయిత మేధావిలా ఆలోచించాలి కాని, సగటు మనిషికి అర్థమయ్యేంత సులువుగా రాయాలి.

అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### ధరలను నియంత్రించాలి!

అమెరికా,ఇరాన్‌ల మధ్యజరిగిన యుద్ధం ఇంధనం, ఎల్.పి.జి కొరతకు కారణమైంది. దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలుపెరిగి, సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈసాకుతో హోటల్ యజమానులు అల్పాహారం, భోజనం, కాఫీ, టీధరలను హడావిడిగా పెంచేశారు. కొన్ని హోటళ్లు గ్యాస్‌ధరలకు విడివిడిగా కూడా బిల్లును వేశాయి. హోటళ్లపై ఆధారపడిన ప్రజలు తప్పనిసరిగా కష్టాలు పడ్డారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. పరిస్థితులు దాదాపు సాధారణ స్థితికి వచ్చాయి. ఎల్.పి.జి సిలిండర్ల కొరత లేదు. దాని ధర కూడా కొంచెం తగ్గింది. బ్లాక్‌మార్కెట్‌లో సిలిండర్లను అమ్మేపరిస్థితి ఇప్పుడు లేదు. ఇదంతా హోటల్ యజమానుల దృష్టికి తెలియకుండా పోదు. రాకెట్ వేగంతో పెంచిన ధరలను అంతే వేగంగా తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలి.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్లపాలెం

### మంచు కొండంత విషాదం

నేపాల్‌లో ఆకస్మిక వరద ప్రవాహం బారినపడి రెండు జిల్లాలు దాదాపు తుడుచుపెట్టుకుపోవడం వేల మంది గల్లంతు కావడం పెను విషాదం. ఇప్పటికి 400 మంది మృతులుగా తేలినా వేలమంది ఆచూకీ కానరాకపోవడం అందులో భారత్ సహా 35దేశాల నుండి వచ్చిన పర్యాటకులు ఉండడం గుండెల్ని కలిచివేస్తుంది. పట్టణాలకు పట్టణాలేబురదలో కూరుకుపోయినప్పుడు, గ్రామాల ఆచూకీ కూడా తుడిచిపెట్టుకుపోయినప్పుడు, నలభై కిలోమీటర్ల దాకా హైవేలు, పదుల సంఖ్యలో హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులు, వంతెనలు కొట్టుకుపోయినప్పుడు, వేలకొద్దీ ఇళ్లు నేలమట్టంఅయినప్పుడు, మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టం లెక్కలు ఇప్పుడే తేలవు. నేపాల్ కష్టానికి వెంటనే భారత్ స్పందించి సహాయ చర్యలు చేపట్టింది కానీ వారి కష్టం, నష్టం, బాధ తీర్చలేనివి.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### ఒంటరి జీవితాన్ని అలవర్చుకోవాలి

మానవ జీవితంలో ఎన్నో పరిచయాలు ఏర్పడతాయి. అందులో స్నేహితులు, బంధువులు, మిగతా రకరకాల మిత్రులు పరిచయం అవుతూ ఎనలేని సంబంధాలుగా మారతాయి. కానీ ఒక్కొక్కప్పుడు ఒంటరిగా జీవించడం కూడా నేర్చుకోవాలి. కొన్ని సమయాల్లో ఎవరు రారు. ఒంటరిగా జీవించడానికి అలవాటుపడాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### కఠిన చర్యలతో నకిలీలను అరికట్టాలి

'వైద్యో నారాయణోహరి'వైద్యులనునారాయణునితో పోల్చారు. అంత పవిత్రమైన శబ్దాన్ని నకిలీలు అపవిత్రం చేసారు. సాక్షాత్ నారాయణునిఅవతారంలో నకిలీలెందరో? అందరూ ప్రజల ఆరోగ్యంతో ఆట్లాడుకుంటున్న నకిలీవైద్యులే. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో టాస్క్‌ఫోర్స్ డి.సి.పి. నాయకత్వంలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట విస్తృతంగా తనిఖీలు చేసిన పోలీసులు నకిలీలను చూసి విస్తుపోయారు. అరెస్టు చేసారు. ఈ నకిలీ నారాయణులు ఆపరేషన్లు కూడా చేసేసారట. వీరిలో చాలామంది గతంలో నర్సులుగా, కంపౌండర్లుగా లేదా మెడికల్ షాపుల్లో పనిచేశారు. ఎలాంటి అధికారిక వైద్య విద్య, అర్హతలు లేకపోయినా నకిలీసర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తూ, ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. నకిలీలను అరికట్టాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### సైన్స్‌ను ప్రమోట్ చెయ్యాలి

నేపాల్‌లో జరిగిన ప్రమాదం లాంటిది మనదేశంలో జరిగితే? నియంత్రించే శక్తి మనదేశాకికి ఉన్నదా! అందుకే సైన్స్‌ను ప్రమోట్ చెయ్యాలి. సైన్స్ సెంటర్లను ఎక్కువగా ఏర్పాటు చెయ్యాలి. దేవుళ్ళను మతాన్ని కాదు. ఆవు మూత్రానికి, ఆవు పేడకు పవిత్రతను అంటగట్టడం మానుకోవాలి. శాస్త్రీయ సమాజం కొరకు పనిచేయాలి. అది జరగాలంటే విద్యార్థులకు ప్రాథమిక విద్యనుండి శాస్త్రీయ విద్యను అందించాలి. పుక్కిటి పురాణాలను, గాయత్రి మంత్రం, బూత వైద్యం, వాస్తు జ్యోతిష్యం ఇలాంటి కల్పితమైన వాటిని తొలగించి శాస్త్రీయ విద్యను అందించాలి. ప్రజలలో శాస్త్రీయ ఆలోచన పెంచే విధంగా మనందరం కృషి చెయ్యాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### స్థిరమైన ఆదాయం కల్పించాలి

దేశవ్యాప్తంగా సంక్షేమం పైన సంక్షేమంపేరుతో కోట్లకు కోట్లు ఖర్చు పెడుతున్నారు అని చర్చజరుగుతుంది. నిజానికి పేదల సంఖ్యను తగ్గించడానికి పేదల జీవితాలకు సుస్థిరమైన ఆదాయం కల్పించే మార్గాలువెతకాలి. అప్పుడు పేదరికం గురించి సంక్షేమం గురించి చర్చ అంతగా ఉండదు. అయితే పేదరిక నిర్మూలనకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పెద్దసంఖ్యలో పథకాల అమలు జరిపినప్పటికీ స్థిరమైన ఆదాయం కల్పించినప్పుడే శాశ్వతమైన పేదరికం నుండి విముక్తి కలుగుతుంది. లబ్ధిదారునికి అందే సాయం స్థిరమైనదిగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కృష్ణా జలాలపై వివాదం ఇంకెన్నాళ్లు?

**కృష్ణా జలాల విషయంలో తుది పరిష్కారానికి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న వేళ, తాత్కాలిక నిర్వహణలో ఇరు రాష్ట్రాలూ సంయమనం పాటించడం మరింత అవసరం. ఎందుకంటే ఒక రాష్ట్రం విజయం అంటే మరో రాష్ట్రం ఓటమి కాదు. రెండు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు అందడం, రైతులకు నమ్మకమైన నీటి ప్రణాళిక లభించడం, ప్రతి నీటి చుక్క సమర్థంగా వినియోగించడం అదే నిజమైన విజయం. కృష్ణా నీటిని పంచుకోవడం ఒక చట్టపరమైన అవసరం మాత్రమే కాదు, అది రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరిపక్వతకు పరీక్ష. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, ప్రజల సంక్షేమాన్ని ముందుంచి, న్యాయబద్ధత- పారదర్శకత- సహకారం అనే మూడు సూత్రాలతో ముందుకు సాగితే కృష్ణా వివాదం శాశ్వత ఘర్షణగా మిగలదు. కృష్ణా జలాలు రెండు రాష్ట్రాల మధ్య గీత గీయడానికి కాదు. రెండు రాష్ట్రాల ప్రజల భవిష్యత్తును భద్రపరచడానికి ఉపయోగపడాలి.**

సి.హెచ్.ప్రతాప్

కృష్ణా జలాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు కేవలం నదీ జలాలు కావు. కోట్లాది ప్రజల తాగునీరు, లక్ష లాది రైతుల సాగునీరు, పరిశ్రమల అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి వీటి వెనుక కృష్ణా ప్రవాహం ఉంది. అందుకే నీటి లభ్యత తగ్గిన సమయంలో ఇరు రాష్ట్రాల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడం కొత్త విషయం కాదు. కానీ అవి పరస్పర ఆరోపణలకు, ప్రాజెక్టుల వద్ద ఉద్రిక్తతలకు దారితీయకుండా రాజ కీయ విభేదాలను పక్కనపెట్టి సంస్థాగత పరిష్కారాల వైపు వెళ్లడం ఇప్పుడు అత్యవసరం. ఆగస్టు 26న నాగార్జున సాగర్ వద్ద మరోసారి నీటి విడుదలపై ఉద్రిక్తత ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ అధికారులు కుడి కాలువకు సుమారు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, తెలంగాణఅధికారులు కూడా ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. రెండు రాష్ట్రాలు తాగునీటి అవసరాలను కారణంగా చూపాయి. ఈ పరిణామం నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. అంతకుముందు ఆగస్టు 24న జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై ఏకాభిప్రాయం రాకపోవడంతో తదుపరి చర్చను సెప్టెంబర్ 4కు వాయిదా వేశారు. ఈ పరిణామాన్ని ఏ రాష్ట్రం తప్పు, ఏ రాష్ట్రం ఒప్పు అనే కోణంలో చూడటం సమస్యను మరింతసంక్లిష్టం చేస్తుంది. ముందుగా తాగునీటి అవసరాలు, తర్వాత సాగు నీటి అవసరాలు. వాటి మధ్య సమతుల్యతను శాస్త్రీయ లెక్కలతో నిర్ణయించడం ముఖ్యం. నీటి విడుదలకు సంబంధించిన ప్రతి నిర్ణయం అందుబాటులో ఉన్న నిల్వలు, ప్రవాహాలు, రాబోయే వర్షపాతం అంచనాలు, తాగునీటి అవసరాలు, గత వినియోగం వంటి అంశాల ఆధారంగా ఉండాలి. కృష్ణా జల వివాదానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1969లో ఏర్పాటైన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-ఈ (బచావత్ ట్రిబ్యునల్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కేటాయింపు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ కేటాయింపును తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఎలా పంచుకోవాలన్నది ప్రధాన అంశంగా మారింది. తాత్కాలికంగా 512: 299 నిష్పత్తి ప్రాతిపదికన నీటి వినియోగం కొనసాగుతున్నప్పటికీ, ఇది తుది అంతర్రాష్ట్ర పంపిణీ పరిష్కారం కాదు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కృష్ణా నదీ యాజమాన్య బోర్డును ఏర్పాటు చేసింది. అదే చట్టంలోని సెక్షన్ 89 కింద, ఇంతకుముందు నిర్ణయించని చోట ప్రాజెక్టు వారీగా కేటాయింపులు,లోటు ప్రవాహాల సమయంలో నీటి విడుదలకు కార్యాచరణ విధానాన్ని రూపొందించే అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-ఇఇ పరిధిలోకి వచ్చాయి. 2023లో కేంద్రం ట్రిబ్యునల్-ఇఇకి తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య మిగిలిన పంపిణీ అంశాలపై అదనపు టెరంస్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చింది. అంటే ప్రస్తుత వివాదానికి



న్యాయపరమైన వేదిక ఇప్పటికే ఉంది. అందువల్లప్రాజెక్టుల వద్ద పరస్పర ప్రతిఘటన కంటే ట్రిబ్యునల్,కృష్ణా నదీ యాజమాన్య బోర్డు వంటి సంస్థాగత మార్గాలనే బలోపేతం చేయడం సమర్థవంతమైన పద్ధతి. మొదటగా శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ఉమ్మడి ప్రయోజనాల ప్రాజెక్టుల విషయంలో రియల్‌టైమ్ డేటా ఆధారిత నీటి నిర్వహణ వ్యవస్థ రావాలి. నిల్వలు, ఇన్‌ఫ్లోలు, అవుట్‌ఫ్లోలు, కాలువల వారీ విడుదలలు, తాగునీటి అవసరాలు వంటి వివరాలు ఇరు రాష్ట్రాలకు ఒకే సమయంలో అందుబాటులో ఉండాలి. ఒకే డేటాను ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకుంటే అనుమానాలకు, అపోహలకు అవకాశం తగ్గుతుంది. రెండోది సాధారణ వర్షపాతం, లోటు వర్షపాతం, తీవ్ర నీటి కొరత వంటి పరిస్థితులకు ముందుగానే ప్రత్యేక నీటి విడుదల ప్రోటోకాల్స్ రూపొందించాలి. తాగునీటికి అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఏ విధంగా నీరు విడుదల చేయాలి? రెండు రాష్ట్రాల అవసరాలు ఒకేసారి పెరిగితే ప్రాధాన్యత ఎలా నిర్ణయించాలి? నిర్ణయం తీసుకునే గడువు ఎంత? ఇలాంటి ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు ఉండాలి. మూడోది రెండు రాష్ట్రాలూ కృష్ణాపై ఆధారపడే అవసరాన్ని తగ్గించుకోవాలి. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ సేద్యం, తక్కువ నీటితో సాగు, పట్టణ మురుగునీటి శుద్ధి-పునర్వినియోగం వంటి చర్యలు దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి. నీటి సమస్యను రాజకీ యంగా ప్రస్తావించడం ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ ప్రజల తాగునీరు, రైతుల పంటలు, భవిష్యత్ నీటి భద్రత రాజకీయ భేదాల కంటే పెద్దవి. రెండు రాష్ట్రాల ప్రభుత్వా లు పరస్పరం విమర్శించుకోవడం ద్వారా తక్షణ రాజకీయ ప్రయోజనం పొందవచ్చేమో కానీ, దాని వల్ల నదిలో ఒక్క చుక్క నీరు పెరగదు. ఇంకా ముఖ్యంగా, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల వద్ద అధికారులు పరస్పరం ఎదురుపడే పరిస్థితి పునరావృతం కాకుండా స్పష్టమైన సమన్వయ వ్యవస్థ అవసరం. నీటి విడుదలపై భిన్నాభిప్రాయం ఉంటే అది అధికారుల మధ్య ఘర్షణగా కాకుండా, బోర్డు ముందు సాంకేతిక చర్చగా పరిష్కారం కావాలి. కృష్ణా జలాల విషయంలో తుది పరిష్కారానికి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న వేళ, తాత్కాలిక నిర్వహణలో ఇరు రాష్ట్రాలూ సంయమనం పాటించడం మరింత అవసరం. ఎందుకంటే ఒక రాష్ట్రం విజయం అంటే మరో రాష్ట్రం ఓటమి కాదు. రెండు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు అందడం, రైతు లకు నమ్మకమైన నీటి ప్రణాళిక లభించడం, ప్రతి నీటి చుక్క సమర్థంగా వినియోగించడం అదే నిజమైన విజయం. కృష్ణా నీటిని పంచుకోవడం ఒక చట్టపరమైన అవసరం మాత్రమే కాదు,అది రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరి పక్వతకు పరీక్ష. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, ప్రజల సంక్షేమాన్ని ముందుంచి, న్యాయబద్ధత- పారదర్శకత- సహకారం అనే మూడు సూత్రాలతో ముందుకు సాగితే కృష్ణా వివాదం శాశ్వత ఘర్షణగా మిగలదు. కృష్ణా జలాలు రెండు రాష్ట్రాల మధ్య గీత గీయడానికి కాదు. రెండు రాష్ట్రాల ప్రజల భవిష్యత్తును భద్రపరచడానికి ఉపయోగపడాలి. ●

# ఫీజు బకాయిల్లో విద్యార్థుల భవిష్యత్తు!

డా.మోటె చిరంజీవి

విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నేడు అనేకప్రశ్నలను ఎదుర్కొంటోంది. 2020-21 నుంచి 2024-25 విద్యా సంవత్సరాల వరకు బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఈ పథకం ఎంతో కీలకం. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజులు సకాలంలో అందకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇది అదనపు ఆర్థికభారంగా మారుతోంది. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం మొత్తం బకాయిలు రూ.8 వేల కోట్లకు పైగానే ఉన్నాయని ప్రభుత్వం చెబుతుండగా, 2025-26 వరకు కలిపితే రూ.10 వేల కోట్లకు పైగా ఉంటాయని కళాశాలల వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రభుత్వం కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాలపై నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, గత బకాయిల పరిస్థితి మాత్రం స్పష్టంగా తేలాల్సి ఉంది. పాత బకాయిలను పూర్తిగా పరిష్కరించకుండా కొత్త విధానాలను ప్రకటించడం వల్ల సమస్య మరింత క్లిష్టమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే బకాయిల చెల్లింపుల కోసం భారీ మొత్తాలను విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ, విద్యార్థుల ఖాతాలు, కళాశాలల బకాయిల స్థాయిలో పూర్తి పారదర్శకత అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ప్రభుత్వ ఆర్థిక పథకం కాదు. వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సామాజిక బాధ్యత. బకాయిల కార



ణంగా విద్యార్థుల చదువుల మధ్యలో ఆగకుండాప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అలాగే కళాశాలల వారీగా బకాయిలను గుర్తించి, దశలవారీగా కాకుండా నిర్ణీత కాల పట్టికతో చెల్లింపులు పూర్తి చేయాలి. బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆ ప్రభావం చివరకు విద్యార్థులపైనే పడుతోంది. ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి సమస్యలతో చదువు పూర్తిచేసిన విద్యార్థులు కూడా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం 2026-27 నుంచి ప్రతి విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులను అదే ఏడాదిలో విడుదలచేసి, ఇకపై బకాయిలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. నెలకు రూ.200 కోట్ల చొప్పున విడుదల చేసే కొత్తవిధానాన్ని కూడా ప్రకటించింది. భవిష్యత్తులో ఇలాంటి బకాయిలు పేరుకుపోకుండా ప్రతి విద్యాసంవత్సరం ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, నిధుల విడుదలకు పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలి. విద్యార్థుల చదువువారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ఆధారపడకూడదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్కలు స్పష్టమై, బకాయిలు పూర్తిగా తీరినప్పుడే ఈ పథ కానికి నిజమైన అర్థం చేకూరుతుంది. ప్రభుత్వం ఇకనైనా కాలయాపనకు తావులేకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలి. అర్హులైన విద్యార్థుల బకాయిలను తక్షణమే చెల్లించాలి. ఏ విద్యార్థి సర్టిఫికెట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఆగిపోకుండా విద్యార్థులకు అవసరమైనప్పుడు వారికి ఇచ్చేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడకుండా భవిష్యత్తులో ప్రతి ఏడాది ఫీజురీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేలా ప్రత్యేకనిధి, పారదర్శక చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పేద విద్యార్థుల భవిష్యత్తు బకాయిల లెక్కల్లో చిక్కుకోకుండా చూడటమే ప్రభుత్వానికి ముందున్న అసలు బాధ్యత. ●

# 'దిమాగీ నక్సల్స్'పై ఆగ్రహం ఎందుకు?

నందూరి రవిశంకర్

పదాలు కూర్చి ప్రయోగించటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిట్ట. ఆయనకు పొగడ్తలు తప్ప విమర్శలు నచ్చవు. ప్రజలు తమ బాధల గూర్చి, హక్కుల గూర్చి మాట్లాడటం అసలే గిట్టదు. పెట్టుబడి దారులకు పరమ మిత్రుడు, రైతులు, కార్మికులకు బద్ధ వ్యతిరేకి. గిట్టుబాటు ధరలకోసం నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్న పంజాబ్ హర్యానా రైతులు నిరసన తెలిపేందుకు దేశ రాజధానికి రాకుండా సరిహద్దుల్లోనే అణచివేత, నిర్బంధం. రైతులు ముందుకు రాకుండా రహదారిపై మేకులు కొట్టించిన తొలి ప్రభుత్వం మోడీ జీ దే. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి మూడు రైతు వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకున్నాక కూడా ఆయనలో రైతుల పట్ల సానుభూతి పెరగలేదు. ఢిల్లీ వస్తున్న రైతులను పంజాబ్ సరిహద్దులలో పోలీసులు అడ్డుకున్నారు. పెట్టుబడిదారుల లాభాల కోసం వ్యాపారాలు సులభతరం విధానం అమలు చేస్తున్న ప్రధాని మోడీ కార్మికుల సంఘటిత శక్తిని, ఆ శక్తితో సాధించుకున్న హక్కులను హరించేందుకు 29 చట్టాలు రద్దుచేసి నాలుగు సంహితలను (కోడ్‌లు) చట్టాలుగా కూర్చారు. వాటికి వ్యతిరేకంగా నాలుగేళ్లుగా 10కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు నిర్విరామ ఆందోళన చేస్తున్నా, పలుమార్లు సార్వత్రిక సమ్మె చేసినా ఆయనకు చీమకుట్టినట్లు లేదు. జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను హిందూత్వ సిద్ధాంతంలో పొదిగారు. విద్య కేంద్రీకరణ, పోటీ పరీక్షలు కేంద్రీకరణ. పరీక్షల నిర్వహణలో తప్పులు, అవకతవకలు, అక్రమాలు, అవినీతి కేంద్రీకరణ. మరోవైపున మావోయిస్టులను (నక్సలైట్‌లకు) భౌతికంగా ఏరివేశామన్న ఉత్సాహంలో ఉన్న ప్రధాని మోదీ, ఆయన అనుంగుశిష్యుడు హోంమంత్రి అమిత్ షాలను అనూహ్యమైన దెబ్బకొట్టారు కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆన్‌లైన్ పిలుపుపై జెన్ జీ యువత ఈ నేపథ్యంలో, ఎర్రకోటనుంచి 80వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో ప్రధానమంత్రి యువతకు ప్రకటించిన కొన్ని వరాలనుచూస్తే ఆశ్చర్యం కలుగకమానదు. అదే సమయంలో 'దిమాగీ నక్సలైట్' లు అని కొత్త పదం ఉపయోగించారు. దీని అర్థం ఏమిటి మహాశయా అని దేశంలోని రాజకీయ స్పృహ కలిగిన విద్యావంతులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు. మోదీజీ సామాన్యంగా వ్యర్థ పదాలు (రాజకీయ సభల్లో తప్ప) ఉపయోగించరు. అడవుల్లోని నక్సలైట్లను ఏరివేస్తున్నాం పట్టణాల్లో నక్సలైట్‌లు మరీ ప్రమాదకారులని గత సంవత్సరం హెచ్చరించిన మోదీ, ఇప్పుడు అడవుల్లోని నక్సలైట్లను ఏరివేశాం అని ఘనంగా చెప్పుకుంటూ, దిమాగీ (మేధావులు, విద్యావంతులని అర్థం)నక్సలైట్ల ప్రస్తావన చేశారు. వీరు ఇన్నాళ్లదాకా ప్రభుత్వంలో సలహాదారులుగా మావోయిస్టు భావజాలంతో విధానాలను ప్రభావితంచేశారు! ఇప్పుడు సమాజాన్ని ప్రభావితం చేయటం కొనసాగిస్తున్నారని వారు మన చుట్టూ ఉన్నారు, గుర్తించి ఏకాకులను చేయాల్సి అన్నారు. వామపక్ష మేధావుల గూర్చి ప్రధాని ఈ పదం వాడారన్నది స్పష్టం. ఆ భావజాలం పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటున్నారంటే, ఇటీవల యువత, రైతులు, కార్మికుల ఆందోళనల వెనుక ఆ మేధావులు ఉన్నారనేఅన్యాపదేశంగా స్ఫురిస్తుంది. వామపక్ష భావజాలాన్ని అణచివేసే పేరుతో యూనివర్శిటీల్లో హింసాత్మక దాడులు ప్రేరేపించటం, అందుకు ఆర్ఎస్ఎస్, ఎబివిపిలను ప్రోత్సహించటం చూశాం, చూస్తున్నాం. బయట వామపక్ష మేధావులకు మావోయిస్టులు, అర్బన్ నక్సల్స్ అనే ముద్రవేసి దేశద్రో



హం, ప్రధాని హత్యకు కుట్ర వంటి ఆరోపణలు బనాయించి బెయిలుకు అవకాశంలేని జాతీయ భద్రత, ఉపా చట్టాల కింద అరెస్టు చేశారు. ఇది అసమ్మతిపై, భిన్నాభిప్రాయంపై దాడి. మానవ మేధస్సుకు, ప్రజాస్వామ్యానికీ విరుద్ధమైన శిలా సదృశ సమాజ నిర్మాణం ఆర్ఎస్ఎస్ వారి సిద్ధాంతం కదా! మత మార్గాల్లో దేశాన్ని విభజిస్తూ ఒకే ఆహార్యం, ఒకే భాష, శాకాహారం, సనాతన ఆచారాలు, నమ్మకాల ఆరాధన సిద్ధాంతం అసమ్మతిని, నిరసనను సహించక పోవచ్చు. కాని ఈ 21వ శతాబ్దంలో నిరసనను అణచాలను కోవటం అవివేకమే కాగలదు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం దిమాగీ నక్సల్‌గా ఉండటానికి నేను గర్విస్తాను" అని ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఎస్టాబ్లిష్‌మెంట్‌ను కలవరపరిచినట్లుంది. పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్ రిజిజు హడావిడిగా మేల్కొని (తన ప్రకటనలోని వరుస సంఖ్యల్లో 3 అంకె లేకపోవటం సైతం గమనించలేదు) ప్రధాని వ్యాఖ్య ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఉద్దేశించింది కాదని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానమంత్రి బుర్రలోకి దూరి ప్రధాని వ్యాఖ్యలు మావోయిస్టులను బలపరిచే వారికీ, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారికీ, వేర్పాటు వాదులను బలపరిచే వారికీ, ఆర్టికల్ 370ని బలపరిచేవారికీ, భారత్ నుండి ఈశాన్య రాష్ట్రాలను వేరుచేసేందుకు చికెన్ నెక్ ప్రాంతాన్ని వేరుచేయాలని కోరేవారికీ వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినట్లు వివరించారు. అయితే బిజెపి ఎంపి నిషికాంత్ దూబె, బిజెపి ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌లు చిదంబరంపై ఎదురుదాడికి దిగి అణుబాంబుపై గతంలో ఆయన ప్రకటన 'దిమాగీ నక్సల్' ప్రకటనగా ఉందని, యుపిఎ ప్రభుత్వంలో కాషాయ టెర్రరిజం ప్రాజెక్టుకు ఆయన కన్సల్టెంట్ అని నిందించారు. ప్రధాని ప్రకటన రాజకీయ ప్రత్యర్థులపై ఎక్కుపెట్టబడిందేనని వీరి వ్యాఖ్యలు చెబుతున్నాయి. జాతీయవాదులు, ప్రగతిశీలురు, వామపక్షవాదులు, నియంతృత్వ వ్యతిరేక ప్రజాస్వామ్యవాదులు ప్రధాని లేబుల్‌ను ముక్తకంఠంతో ఖండించాలి. విద్యారంగ సమస్యలపై మధ్యప్రదేశ్‌లో స్కూలు పిల్లలు సైతం తమంతటతాము ఉద్యమిస్తున్నారు. అది జన్ జీ జాతీయస్థాయి ఆందోళన తెచ్చిన చైతన్యం. దాన్ని ఆపటం ఎవరితరం కాదు అంటున్నారు. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించాం. 'దిమాగీ నక్సల్స్' మాత్రం మిగిలారు అంటూ ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కొత్త పార్టీ పుట్టుకురావాన్ని గమనించాలి. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరిట ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షల మంది, ఎక్స్‌లో 7వేలమంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో 'దిమాగీ నక్సల్ పార్టీ' అని, ఎక్స్‌లో దిమాగీ నక్సల్ జనతా పార్టీ అని ఖాతాలు తెరిచారు. తమ పార్టీ వ్యవస్థాపకుడు ఓ దిమాగీ ఇండియన్ అని చెప్పుకొన్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఎప్పుడు ఎలా సృష్టించారనేది స్పష్టత లేదు గానీ ఎక్స్ ఖాతాను మాత్రం ఈ నెలలోనే తెరిచారు. మరోవైపు, మోదీ తన రాజకీయ ప్రత్యర్థులను తొలుత 'అర్బన్ నక్సల్స్' అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అని అంటున్నారు. మోదీలోని 'నిరాశానిస్పృహలను' తెలియ చేసే ప్రస్తావన ఇది. అని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఎక్స్‌లో విమర్శించారు. అవును.. నేను దిమాగీ నక్సల్‌నేనని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం అన్నారు. నిజమైన దేశభక్తునిగా బీజేపీకి లొంగబోనని, దిమాగీ నక్సల్‌గా ఉండేందుకు గర్విస్తానని ఆప్ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, విద్యా సంస్కరణల కోసం ఉద్యమిస్తున్న జన్ జీ యువతకు యోగా గురువు బాబా రామ్‌దేవ్ మద్దతు ప్రకటించారు. విద్యా వ్యవస్థలో కుంభకోణంపై దృష్టిసారించండి. లేదంటే 'నేను సైతం ఉద్యమిస్తా'ననే ధోరణిలో ఆయన ముక్తాయింపునిచ్చారు. ●

# మాతృభూమి అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలి



**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త:** మాతృభూమి అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని రాష్ట్రసూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మలేషియాలోని పెనాంగ్‌లో ఆదివారం ఆసియా ఫసిఫిక్ తెలుగు ఫెడరేషన్(ఏపిటిఎఫ్) కాన్ఫరెన్స్-2026కు రాష్ట్రప్రభుత్వం తరుపున ముఖ్యఅతిధిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా వంటి విదేశాల్లో ఉన్న తెలుగువారిని ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ఏపిటిఎఫ్ ఏర్పాటు కావటం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని కోరారు. మాతృభూమిపై ఉన్న మమకారాన్ని అభివృద్ధి భాగస్వామ్యంగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్న తెలుగు పారిశ్రామిక వేత్తలు ఏపిలో పెట్టుబడులు పెట్టి ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కొండపల్లి కోరారు. విదేశాల్లోని ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి, వారి నైపుణ్యాలను రాష్ట్ర అభివృద్ధితో అనుసంధానం చేసేందుకు ఏపిఎన్ఆర్‌టి కృషి చేస్తుందన్నారు. మలేషియాలోని యువ తెలుగు కళాకారులు ప్రదర్శించిన ఉత్తరాంధ్ర శైలి కోలాట భజన తనను ఆకట్టుకుందని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఏపిటిఎఫ్ తాత్కాలిక అధ్యక్షులు డాక్టర్ ఎస్.వెంకటప్రతాప్, నిర్వహణ కమిటీ చైర్మన్ సత్యసుధా కరన్, తాత్కాలిక ప్రధానకార్యదర్శి శివ సూర్యనారాయణ, నటుడు, రచయిత తనికెళ్ళ భరణి, వివిధ దేశాల్లో ఉంటున్న తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

# అమరావతిలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఫెర్రిస్ వీల్ నిర్మాణం

- 250 మీటర్లకు పైబడి ఎత్తు
- దుబాయ్‌లోని ఐన్ దుబాయ్ కంటే ఎత్తుగా
- కృష్ణానది తీరంలో 'అమరావతి ఐ' పేరుతో ఏర్పాటుకు ప్రణాళికలు
- అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ టెండర్ ప్రకటన జారీ




**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఫెర్రిస్ వీల్‌ను ఏపి రాజధాని అమరావతిలో నిర్మించనున్నారు. కృష్ణా నది ఒడ్డున ఈ భారీ ఫెర్రిస్ వీల్‌ను నిర్మించనున్నారు. బ్రిటన్ రాజధాని లండన్‌లో థేమ్స్ నది తీరాన ఉన్న 'లండన్ ఐ' స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. అందుకే దీనికి 'అమరావతి ఐ' అని నామకరణం చేశారు. 'లండన్ ఐ' ఎత్తు 120 మీటర్లు. అయితే మన అమరావతి ఐ ఎత్తును మొదట 139 మీటర్లుగా ప్రతిపాదించారు. భవిష్యత్తులో ఇది రాజధాని నగరానికే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం దుబాయ్‌లోని ఎయిన్ దుబాయ్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఫెర్రిస్ వీల్. ఎత్తు 250మీటర్లు. అందులో 48 కాప్స్యూల్స్ ఉంటాయి. ఒకేసారి 1,750 మంది అందులో కూర్చోవచ్చు. ఆ తర్వాత అమెరికాలోని లాస్ వెగాస్‌లోని హై రోలర్ (167.6 మీటర్లు), సింగపూర్ ఫ్లయర్ (165 మీటర్లు) ఉన్నాయి. అయితే, 'అమరావతి ఐ'ని ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా నిర్మించాలని సిఎం చంద్రబాబు సూచించారు. అందుకే 250 మీటర్ల కంటే ఎత్తుగా నిర్మించేందుకు ఎవరైనా ముందుకొస్తే అవకాశం ఇచ్చేలా తాజా టెండర్లు రూపొందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు దీనికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీని నిర్మాణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎజిఐసిఎల్) తాజాగా టెండర్లను ఆహ్వానించింది. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా ఈ కట్టడాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. వీల్ వ్యాసాన్ని బట్టి నిర్మాణ గడువును కూడా అధికారులు నిర్ణయించారు. 128 మీటర్ల వ్యాసం ఉంటే 12 నెలలు, 128 నుంచి 175 మీటర్లకు 15 నెలలు గడువు ఇచ్చారు. 175-200 మీటర్లకు 18 నెలలు, 200 మీటర్లు దాటితే రెండేళ్ల (24 నెలలు) గడువు ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు బిడ్ల దాఖలు గడువు ఈ నెల 27వ తేదీతో ముగుస్తుంది. మొదట ప్రతిపాదించిన 139 మీటర్ల వీల్‌లో 28 ఏసీ కాప్స్యూల్స్ ఉంటాయి. ఒక్కో దానిలో 20 మంది చొప్పున ప్రయాణించే వీలుంటుంది. ఇక తాజా టెండర్ల ప్రకారం, ఎత్తును బట్టి మూడు క్యాటగిరీలుగా ప్రాజెక్టును విభజించారు. వీల్ నిర్మాణానికి గ్రీన్ జోన్‌లో 5 ఎకరాలు ఉమ్మడిగా కేటాయిస్తారు. 128- 175 మీటర్ల ఎత్తు ఉంటే వాణిజ్య ఒక ఎకరం ఇస్తారు. 175- 200 మీటర్ల ఎత్తు ఉంటే కమర్షియల్ స్థలాన్ని 3 ఎకరాలకు పెంచుతారు. 200-250 మీటర్లకు 4 ఎకరాలు కేటాయిస్తారు. ఒకవేళ 250 మీటర్ల కంటే ఎత్తు నిర్మిస్తే 5 ఎకరాల కమర్షియల్ స్థలం ఇస్తారు. కానీ, ఫెర్రిస్ వీల్ కనీస ఎత్తు 139 మీటర్లు, వ్యాసం 128 మీటర్ల కంటే తగ్గకూడదని స్పష్టం చేశారు. అంతకంటే తక్కువ కోట్ చేస్తే బిడ్‌ను తిరస్కరిస్తారు. వాస్తవానికి ఫెర్రిస్ వీల్ నిర్మాణం కోసం గతంలోనే ఎజిఐసిఎల్ టెండర్లు పిలిచింది. వీల్ కోసం 5 ఎకరాలు, కమర్షియల్ (వాణిజ్య) అవసరాలకు ఒక ఎకరం ఇస్తామని ప్రకటించింది. కానీ ఆ టెండర్లకు స్పందన రాలేదు. అమరావతి ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఈ క్రమంలో వాణిజ్య అవసరాలకు కేవలం ఒక ఎకరం ఇస్తే, ప్రాజెక్టు లాభదాయకంగా ఉండదని ప్రి బిడ్ మీటింగ్‌లో నిర్మాణ సంస్థలు తెలిపాయి. వాణిజ్య స్థలాన్ని మరింత పెంచాలని కోరాయి. వారి వినతుల నేపథ్యంలో నిబంధనలు సవరించి ఎజిఐసిఎల్ తాజాగా మళ్లీ టెండర్లు పిలిచింది.

# సెప్టెంబర్ 2న పిఠాపురంలో జనసేన యువజన విభాగం ఆవిష్కరణ

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ యువజన విభాగాన్ని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఆవిష్క రించనున్నారు. పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకి యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని జన సైనికులు, వీర మహిళలు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొం టారు. ఆ రోజు యువజన విభాగం లోగో, గీతాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆన్‌లైన్ ద్వారా పార్టీ శ్రేణులకు సందేశం ఇస్తారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం కేరళలో చికిత్స తీసుకొంటున్న సంగతి విదితమే. యువజన విభాగం ఏర్పాటు ఉద్దేశం, విభాగం లక్ష్యాలు, యువతలో రాజకీయ చైతన్యం తదితర అంశా లపై దిశానిర్దేశం చేస్తారు. యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో, తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో నిర్వహించేందుకు జనసేన నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

# అమరావతి ప్రభుత్వ భవన సముదాయాల కోసం అత్యాధునిక డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు

- అంచనా వ్యయం రూ.415 కోట్లు
- గ్లోబల్ టెండర్లకు సిఆర్‌డిఏ ఆహ్వానం




**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి రాజధాని అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యావరణ హిత నగరంగా నిర్మించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని భవన సముదాయాల కోసం అత్యాధునిక డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రక్రియను ఆరంభించింది. ఇందులో భాగంగా ఏపి సిఆర్‌డిఏ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. దీని అంచనా వ్యయం రూ.415 కోట్లుగా ఉంది. రాజధాని నిర్మాణ ప్రాజెక్టులను వేగవంతం చేసే క్రమంలో ఈ టెండర్ ప్రక్రియ మొదలు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

30,000 టన్నుల మేర కూలింగ్, రిఫ్రిజిరేషన్ సామర్థ్యంతో ఇది నిర్మితం కానుంది. బిల్ట్ డెవలప్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన దీన్ని చేపట్టాలని సిఆర్‌డిఏ ప్రాథమికంగా నిర్ణయించింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు లీజు రూపంలో దీని నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తుంది. ఏడాదిన్నర కాలంలో నిర్మాణం పూర్తి చేయడం, 30 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యతలను చూసుకునేలా టెండర్ క్లాజుల్లో పొందుపరిచారు. బిడ్స్ దాఖలు చేయడానికి సెప్టెంబరు 17 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంటుంది. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి గదికి లేదా విభాగానికి విడివిడిగా ఏసిలను అమర్చుకుంటుంటారు. దీని వల్ల విద్యుత్ ఖర్చు పెరగడం హానికారక గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల అవుతుంటాయి. ఈ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానంలో ఒకేచోట సెంట్రలైజ్డ్ రిఫ్రిజిరేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఇక్కడి నుంచే ఏసిని ప్రత్యేక పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని అన్ని ప్రభుత్వ భవనాలకు సరఫరా చేస్తారు. ఈ వ్యవస్థ వల్ల భారీ భవన సముదాయాల నిర్వహణ ఎంతో సులభతరమవుతుంది. వేర్వేరు ఏసిలు వాడటం కంటే ఈ సెంట్రలైజ్డ్ విధానం వల్ల దాదాపు 30 నుంచి 40శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పర్యావరణానికి నష్టం కలిగించే గ్రీన్‌హౌస్ వాయువుల తీవ్రతను ఇది సమర్థవంతంగా తగ్గిస్తుంది. ప్రస్తుతం సింగపూర్, దుబాయ్, దోహా, లండన్ వంటి అంతర్జాతీయ మెట్రోపాలిటన్ సిటీల్లో మాత్రమే ఇటువంటి అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఇప్పుడు అదే తరహాలో అమరావతిలోని సచివాలయం, శాసనసభ, హైకోర్టు వంటి ప్రభుత్వ కార్యాలయాలకు ఈ విధానాన్ని అమలు చేయాలనేది ప్రభుత్వం ఉద్దేశం.

# సంచార జాతుల అభివృద్ధి కోసం ప్రధాని మోడీ విశేష కృషి

- బిజెపి రాష్ట్ర చీఫ్ మాధవ్



**తిరుపతి, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో కేంద్ర లో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం సంచార జాతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని బిజెపి రాష్ట్ర చీఫ్ పివిఎన్ మాధవ్ చెప్పారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో సంచార అర్థ సంచార విముక్తి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో సంచార జాతులైన నక్కల, సుగాలికి చెందిన ప్రజలు, నేతలు పాల్గొన్నారు. ఒబిసి మోర్చా అధ్యర్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ డిటిఎన్‌బి సభ్యుడు ప్రవీణ్ గుగే పాల్గొన్నారు.

ప్రవీణ్ గుగే మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోడీ, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఒక పండుగగా ఘనంగా సంచార అర్థ సంచార విముక్తి దినోత్సవం తిరుపతిలో జరగడం ఎంతో ఆనందంగా ఉందని. బ్రిటిష్ కాలంలో వారిని దొంగల జాతి అని అవమానించారన్నారు. మన సంస్కృతిని సనాతన ధర్మాన్ని కాపాడటంలో సంచార జాతుల పాత్ర చాలా ఉంది, వారు సనాతన ధర్మానికి నిజమైన వారసులని తెలిపారు. చాలా సంవత్సరాలు వారికి ఆధార్ కార్డ్ కుల ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ఈ మధ్యకాలంలో వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందడటంలో బిజెపి పాత్ర చాలా ఉందని, పార్టీ చేపడుతున్న జనత వారధి కార్యక్రమంలో సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, బిజెపి నేతలు గుండాల గోపీనాధరెడ్డి, మునిసుబ్రమణ్యం, గోపి ఆచారి, రామదాసు, రామకృష్ణ, చంద్రశేఖర్, నాగయ్య, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ కొండేటి ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ధర్మానపై ప్రసాదరావు కేసు నమోదు

**శ్రీకాకుళం, ఆగస్టు 30 ప్రభాతవార్త:** హుద్‌హుద్ తుఫాన్ బాధితుల ఇళ్ల ప్రవేశాల వ్యవహారంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం కేసు నమోదైంది. తుఫాన్ బాధితుల ఇళ్ళ లబ్ధిదారుల ఆహ్వానం మేరకు 2026 మే 14న జరిగిన గృహ ప్రవేశాల ఘటనపై ఇచ్చిన నివేదిక ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనధి కారికంగా ఇళ్ల ప్రారంభోత్సవం చేయించారనే ఆరోపణపై విచారణ జరిపిన హౌసింగ్ అధికారులు పోలీసులకు నివేదిక అందించడంతో ఈ చర్యలు తీసుకున్నారు. విచారణలో భాగంగా అవసరాన్ని బట్టి మంత్రిని విచారణకు పిలిచే అవకాశం ఉందని దర్యాప్తు ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

# చెట్టును ఢీకొన్న బైక్: ముగ్గురు యువకులు మృతి

**నల్లమాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త:** ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదం బారినపడి కన్నవారికి కడుపుకోత మిగిల్చి వెళ్లారు. తమ వ్యక్తిగత పనుల మీద స్వగ్రామం నుండి ఒకే బైక్ పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆదివారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తనువు సాధించారు. నల్లమాడ ఎస్సై సతీష్ బాబు అందించిన వివరాల మేరకు పుట్టపర్తికి చెందిన అనిల్(28) కొత్తచెరువుకు చెందినఅర్జున్ (28) దీక్షిత్ (27)లు ద్విచక్ర వాహనంపై పుట్టపర్తి నుండి ఆదివారం రాత్రి నల్లమాడ వైపు బయలుదేరారు. మార్గమధ్యమైన అరవవాండ్లపల్లి సమీపంలోకి వేగంగా రాగానే బైక్ అదుపు తప్పింది. వేగాన్ని కంట్రోల్ చేయలేకపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న జీవి చెట్టుకు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. వారు ప్రయాణించే బైక్ దగ్ధం అయ్యింది. అగ్ని కీలల్లో పడి పూర్తిగా కాలిపోయింది. వారిని కన్న తల్లిదండ్రులకు తీరని శోకసంద్రంలో ముంచి కడుపుకోతను మిగిల్చారు.

స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లమాడ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న మృతుల బాధిత కుటుంబ సభ్యులు మృతదేహాలపై పడి గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కలిచి వేసింది. మృతదేహాలను అక్కడి నుండి పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై సతీష్ బాబు తెలిపారు.

# షార్‌లో జిఎస్ఎల్‌వి ఎఫ్-17 ప్రయోగ సన్నాహాలు

- సెప్టెంబర్ 4న ప్రయోగం



**సూళ్లూరుపేట, ఆగస్టు 30 ప్రభాతవార్త:** ఇస్రో అంతరిక్ష రంగంలో మరో మైలురాయిని అధికమించేందుకు సన్నద్ధమవుతుంది. ఇందులో భాగంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి జిఎస్ఎల్‌వి ఎఫ్-17 రాకెట్ ద్వారా ఇఒఎస్-05 అనే ఉపగ్రహాన్ని పక్షులకు ప్రవేశ పెట్టేందుకు సన్నాహాలు చేస్తుంది. ఇందుకు సెప్టెంబర్ 4వ తేదీన ముహూర్తంగా నిర్వహిం చారు. 4వ తేదీ వేకువజామున రెండు గంటల 55 నిమిషాలకు ఈ ప్రయోగం శ్రీహరికోటలోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి జరగనున్నది.

**జిఎస్ఎల్‌వి సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం**

గతంలో జిఎస్ఎల్‌వి ప్రయోగాల్లో ఎదురైన సాంకేతిక లోపాలను అధిగమించి ప్రస్తుత ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా ప్రయోగించి నున్న ఇఒఎస్ 05 ఉపగ్రహం సబ్ జియో సిం క్రోనోస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశ పెట్టనున్నారు. అక్కడ నుంచి ఉపగ్రహం భూ స్థిర కక్ష్యలోకి చేరుకుంటుంది. ఈ ప్రయోగం మూడు దశల్లో ఉంటుంది. మొదటి దశలో ఘన ఇంధనం కోర్ మోటార్, నాలుగు ద్రవ ఇంధన స్ట్రాప్ అండ్ పోస్టర్లు కలిగి ఉంటుంది. రెండవ దశలో వికాస్ ఇంజన్‌తో పనిచేసే ద్రవ ఇంధన దశ. మూడో దశలో స్వదేశీయంగా తయారైన క్రయోజనిక్ ఇంజన్‌ను ఈ రాకెట్‌లో అమర్చారు. 51.7 మీటర్ల ఎత్తు గల ఈ రాకెట్టు 420.5 టన్నుల బరువు ఉంటుంది. ఈ రాకెట్‌లో నూతనంగా ఉపగ్రహాన్ని రక్షించేందుకు నాలుగు మీటర్ల వ్యాసం కలిగిన ఓగివ్ కంపోజిట్ ఫెయిర్ రింగ్‌ను ప్రత్యేకంగా అమర్చారు. ఇందుకు సంబంధించి రాకెట్ అనుసంధాన పనులను పూర్తి చేసి రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేసి లాంచ్ పాడ్‌కు చేర్చారు. ఎంఆర్ఆర్ సమావేశం అనంతరం ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించి కౌంట్ డౌన్ ప్రక్రియ సమయాన్ని నిర్ణయిస్తారు. సెప్టెంబర్ 1వ తేదీన ఈ సమావేశం జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉన్న సమాచారాన్ని బట్టి 27గంటల కౌంట్ డౌన్ ఉండే అవకాశాలు ఉన్నాయి.

## AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-


| రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (రుణ ఖాతా సంఖ్య) 22630000044668, లక్కిశెట్టి రమేష్ (రుణగ్రహీత), లక్కిశెట్టి కళ్యాణి (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 రూ. 7,49,873/- రూ. ఏడు లక్షల నలభై తొమ్మిది వేల ఎనిమిది వందల డెబ్బై మూడు మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం, సీతానగరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి, చినకొండేపూడి గ్రామ పంచాయతీ, చినకొండేపూడి గ్రామం, R.S.No.543 నుండి ఉప-విభజన చేయబడిన Z.M.R.S.No. 543/1 లోని మొత్తం Ac.7-12 సెంట్ల విస్తీర్ణంలో, పడమర వైపు మధ్య భాగంలో ఉన్న 144 చదరపు గజాల లేదా 120.384 చదరపు మీటర్ల స్థలం. సరిహద్దులు మరియు కొలతలు: పైన పేర్కొన్న సరిహద్దుల మధ్య ఉన్న 144 చదరపు గజాల స్థలం, మరియు అందులోని సాధారణ దారులు, నీటి వనరులు, రాకపోకల మార్గాలు మరియు అన్ని సాధారణ మరియు అనుబంధ హక్కులతో సహా. **తూర్పు: గుండుబోగుల యేసు గారికి చెందిన 30 అడుగుల ఇల్లు, పడమర: రాయ లక్ష్మి మరియు ఇతరులకు చెందిన 27 అడుగుల ఇల్లు, ఉత్తరం: వెంకట లక్ష్మి, రమేష్ బాబు మరియు ఇతరులకు చెందిన 45.6 అడుగుల స్థలం, దక్షిణం: 45.6 అడుగుల 16 అడుగుల వెడల్పు గల రోడ్డు.** | | |
| (రుణ ఖాతా సంఖ్య) 25660001060775, బొమ్మోతు సుదర్శన రావు (రుణగ్రహీత), బొమ్మోతు చంద్ర లీల (సహ-రుణగ్రహీత) | 05-జనవరి-26 రూ. 7,28,645/- రూ. ఏడు లక్షల ఇరవై ఎనిమిది వేల ఆరు వందల నలభై ఐదు మాత్రమే 01-జనవరి-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** 155.55 చదరపు గజాల లేదా 130.66 చ.మీ. విస్తీర్ణం గల ఖాళీ స్థలం సర్వే నం. 224/1 మొత్తం విస్తీర్ణం ఎకరం 4.16 సెంట్లు లోని స్థలం; ఇది రాజానగరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని రాజానగరం మండలం, కలవచర్ల రెవెన్యూ గ్రామం, కలవచర్ల గ్రామ పంచాయతీ ప్రాంతంలో ఉంది. ఈ ఖాళీ స్థలం యొక్క కొలతలు మరియు సరిహద్దులు: పైన పేర్కొన్న సరిహద్దుల మధ్య 155.55 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు దానిలో సాధారణ దారులు, నీటి ప్రవాహ మార్గాలు, రాకపోకల మార్గాలు మరియు అన్ని సాధారణ అనుభోగ హక్కులు కలిగి ఉంది. **తూర్పున: 35.0 అడుగుల స్థలం జాలిం మునలయ్యకు చెందినది, పడమరన: 35.0 అడుగులు (గ్రామ పంచాయతీకి చెందిన 9 అడుగుల వెడల్పు గల సిమెంట్ రోడ్డు), ఉత్తరాన: 40.0 అడుగులు 9 అ. వెడల్పు గ్రామ పంచాయతీకి చెందిన సిమెంట్ రోడ్డు, దక్షిణాన: 40.0 అడుగుల స్థలం వెల్లి జాన్ కు చెందినది.** | | |
| (రుణ ఖాతా నం.) 25630000021396, తాడేపల్లి నాగ శివ (రుణగ్రహీత), తాడేపల్లి గంగా భవాని (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ. 5,16,776/- రూ. ఐదు లక్షల పదహారు వేల ఏడు వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** శ్రీ కోరుకొండ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని గోకవరం మండలం, రంపయర్రపాలెం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న పెంటపల్లి గ్రామం వద్ద సర్వే నంబర్ 348లో ఉన్న, 114 చదరపు గజాల స్థలం మరియు దాబా ఇల్లు డోర్ నంబర్ 11-15. ఈ ఆస్తిలో 114 చదరపు గజాల స్థలం మరియు అందులో ఉన్న డోర్ నంబర్ 11-15 గల RCC దాబా ఇల్లు తలుపులు, ద్వారబంధాలు, సీలింగ్, విద్యుత్ సదుపాయం, సాధారణ దారులు మరియు అన్ని సాధారణ అనుభోగ హక్కులతో సహా) ఉన్నాయి. సరిహద్దులు: **తూర్పున - 32-00 అడుగుల ఖాళీ స్థలం బచ్చల గంగాధర్ గారిది, పడమరన - 32-00 అడుగుల సి.సి. రోడ్డు, ఉత్తరాన - 32-00 అడుగుల ఇల్లు తాడేపల్లి దుర్గా ప్రసాద్ గారిది, దక్షిణాన - 32-00 అడుగుల సి.సి. రోడ్డు.** | | |
| (రుణ ఖాతా నం.) 24660000237652 & 23660000594870, కొండపాములూరి శ్యామలాంబ (రుణగ్రహీత), కొండపాములూరి ఉమామహేశ్వరరావు (సహ-రుణగ్రహీత) | 28-నవంబర్-25 రూ. 4,12,606/- నాలుగు లక్షల పన్నెండు వేల ఆరు వందల ఆరు రూపాయలు) మరియు రూ. 19,49,325/- పందొమ్మిది లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల ఇరవై ఐదు రూపాయలు 28-నవంబర్-25 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** స్థిరాస్తి: తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి అర్బన్, రాజమండ్రి జిల్లా రిజిస్ట్రార్ రాజమండ్రి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని రాజమండ్రి నగరంలో, సర్వే నంబర్ 52/5లో ఉన్న 182.55 చదరపు గజాల స్థలం మరియు దానిపై ఉన్న డోర్ నంబర్... 61-07-03, అసెస్‌మెంట్ నం. 1064022709, గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు భవనం గల స్థలం యొక్క సరిహద్దులు మరియు కొలతలు. పైన పేర్కొన్న సరిహద్దుల మధ్య 182.55 చదరపు గజాలు లేదా 152.635 చదరపు మీటర్ల స్థలం మరియు దానిలో ఉన్న సదరు డోర్ నంబర్ గల గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు భవనం; వీటితో పాటు తలుపులు, ద్వారబంధాలు, అల్మారాలు, కిటికీలు, సీలింగ్, ఎలక్ట్రికల్ సర్వీస్ నం. 1432044104150291, సాధారణ దారి, నీటి మరియు డ్రైనేజీ మార్గం మరియు అన్ని సాధారణ అనుభోగ హక్కులు కలిగి ఉంటాయి. **తూర్పున: బొగాది చంద్రమ్మ ఇల్లు, పడమరన: యెద్దు వీరస్వామి ఇల్లు, ఉత్తరాన: సాకల కొండమ్మ ఇల్లు, దక్షిణాన: రోడ్డు.** | | |
| (రుణ ఖాతా నం.) 23660000072803, నెకూరి రాజేష్ (రుణగ్రహీత), నెకూరి బేబీ రాణి (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 రూ. 6,73,231/- రూపాయలు ఆరు లక్షల డెబ్బై మూడు వేల రెండు వందల ముప్పై ఒకటి మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** స్థిరాస్తి: తూర్పు గోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కొవ్వూరు సబ్-రిజిస్ట్రార్ పరిధి, కొవ్వూరు మున్సిపల్ ఏరియా 16వ వార్డు, వేములూరు శివారు ఔరంగాబాద్ గ్రామంలోని స్థిరాస్తి, (ప్రస్తుత కొలతల ప్రకారం మొత్తం 418 చదరపు గజాల విస్తీర్ణంలో, మున్సిపల్ అసెస్‌మెంట్ నం. 1076003781, R.S. నం. 275/3B, D.నం. 16-7-8 కలిగి ఉండి, రెండు భాగాలుగా ఉన్న భవనం/ఇల్లు మరియు స్థలంలో తూర్పు వైపున 215 చదరపు గజాల విస్తీర్ణం కింద పేర్కొన్న సరిహద్దులు మరియు కొలతల పరిధిలో). ఈ సరిహద్దుల మధ్య 215.49 చదరపు గజాలు లేదా 179.797 చదరపు మీటర్ల స్థలం మరియు అందులోని భవనంలో వాటా, దీనితో పాటు తలుపులు, ద్వారబంధాలు, కిటికీలు, కప్‌బోర్డులు, సీలింగ్, విద్యుత్ సర్వీస్ నం. 97, సాధారణ దారి, నీటి మరియు డ్రైనేజీ మార్గాలు మరియు అన్ని రకాల అనుబంధ హక్కులు ఇందులో ఉన్నాయి. సరిహద్దులు: **తూర్పున 43.0 అడుగుల స్థలం మెరిపో వీర్రాజుకు చెందినది, పడమరన 43.9 అడుగులు ఈ ఇంటికి మరియు నేకూరు రవికుమార్ ఇంటికి మధ్య ఉన్న ఉమ్మడి గోడ, ఉత్తరాన 45.6 అడుగుల ఇంటి స్థలం జొన్నకూటి మునలయ్యకు చెందినది, దక్షిణాన 43.9 అడుగుల దారి.** | | |
| (రుణ ఖాతా నం.) 22660000452890 & 23660000976312, మడక పోసియ్య (రుణగ్రహీత), మడక మంగ తాయారు (సహ-రుణగ్రహీత) | 25-నవంబర్-25 రూ. 4,56,017/- నాలుగు లక్షల యాభై ఆరు వేల పదిహేడు రూపాయలు మాత్రమే & 24-నవంబర్-25 & 10-ఫిబ్రవరి-26 నాటికి రూ. 1,55,137/- ఒక లక్షా యాభై ఐదు వేల ఒక వంద ముప్పై ఏడు రూపాయలు మాత్రమే 09-ఫిబ్రవరి-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** తూర్పు గోదావరి జిల్లా, కోరుకొండ సబ్-రిజిస్ట్రీ పరిధి, కోరుకొండ మండలం, కోటి గ్రామ పంచాయతీ, కోటి గ్రామం, వార్డు సం. 3, సర్వే సం. 169, ఇంటి నం. 3-89 సమీపంలో ఉన్న 231 చదరపు గజాల = 193.13 చదరపు మీటర్ల స్థలం మరియు దానికి సంబంధించిన 231 చ.గ. = 193.13 చ.మీ. సాధారణ మరియు అనుబంధ హక్కులుతోసహా. సరిహద్దులు: **తూర్పున 33.0 అడుగుల రోడ్డు, పడమరన కొల్లు మేరీ గారి ఇల్లు 33.0 అడుగులు, ఉత్తరాన చాట్ల అప్పారావు గారి ఇల్లు 63.0 అడుగులు, దక్షిణాన కొల్లు వెంకటలక్ష్మి గారి ఇల్లు 63.0 అడుగులు.** | | |
| (రుణ ఖాతా నం.) 22630000061485, పట్నాల సతీష్ కుమార్ (రుణగ్రహీత), విన్నకోట దుర్గాదేవి (సహ-రుణగ్రహీత) | 23-డిసెంబర్-25 రూ. 9,22,050/- తొమ్మిది లక్షల ఇరవై రెండు వేల యాభై రూపాయలు మాత్రమే 22-డిసెంబర్-25 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** తూర్పు గోదావరి జిల్లా, పిడింగొయ్య సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి, కోరుకొండ మండలం, గాదాల గ్రామ పంచాయతీ, గాదాల రెవెన్యూ గ్రామం, జిరాయత్ మెరక భూమి ఆర్.ఎస్ నం. 416లో మొత్తం 2 ఎకరాల 76 సెంట్ల విస్తీర్ణం గల స్థలం; ఇందులో తూర్పు వైపున మధ్య భాగంలో 780 చదరపు గజాల స్థలం దానిలో దక్షిణ వైపున 483.88 చదరపు గజాల స్థలం. ఈ స్థలం యొక్క సరిహద్దులు మరియు కొలతలు: **తూర్పున 19-6 అడుగులు ఈ స్థలానికి అనుకుని ఉన్న అలయ భూమి, పడమరన 19-0 అడుగులు పంచాయతీ రోడ్డు, ఉత్తరాన 33-0 అడుగులు V.V.V. సుబ్రహ్మణ్యం గారి ఆస్తి, దక్షిణాన 33-0 అడుగులు క్షత్రియ రాధిక కొనుగోలు చేసిన ఆస్తి - సదరు సర్వే నంబరులో.** | | |
| (రుణ ఖాతా సంఖ్య) 24630000069157, గుడిమెట్ల గంగాధరం (రుణగ్రహీత), గుడిమెట్ల జ్యోతి కుమారి (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 రూ. 5,90,220/- ఐదు లక్షల తొంభై వేల రెండు వందల ఇరవై రూపాయలు మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా గతంలో తూర్పు గోదావరి జిల్లా, మండపేట మండలం, అనపర్తి సబ్-రిజిస్ట్రీ పరిధి, ద్వారపూడి శివారు వేములపల్లి అలియాస్ సీతయ్యపాలెం గ్రామ పంచాయతీ ప్రాంతం, వేములపల్లి అలియాస్ సీతయ్యపాలెం గ్రామం, ఆర్.ఎస్. నం. 292-1లో 66.63 చదరపు గజాల ఖాళీ స్థలం డోర్ నం. 16-264 సమీపంలో. (ఆస్తి అనపర్తి SRO పరిధిలో ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ రామచంద్రాపురం SRO వద్ద జరిగింది. అన్ని అనుబంధ హక్కులతో కూడిన ఈ ఆస్తి సరిహద్దులు: **తూర్పున మైదానం రవణమ్మ స్థలం 26-02, పడమరన పంచాయతీ రోడ్డు 26-02, ఉత్తరాన నీల సత్యనారాయణ స్థలం 22-11, దక్షిణాన గంటి మంగమ్మ స్థలం 22-11.** | | |
| (రుణ ఖాతా నం.) 23660000473468, కాకి శ్రీను (రుణగ్రహీత), కాకి జ్యోతి (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 నాటికి రూ. 6,96,478/- ఆరు లక్షల తొంభై ఆరు వేల నాలుగు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 26-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** తూర్పు గోదావరి జిల్లా, శ్రీ కడియం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి, రాజమహేంద్రవరం రూరల్ మండలం, ధవళేశ్వరం గ్రామ పంచాయతీ, ధవళేశ్వరం గ్రామం, ఆర్.ఎస్. నం. 75/3లో 63.33 చదరపు గజాల స్థలం మరియు అందులో డోర్ నం. 101-16-276/1 గల దాబా ఇల్లు. పైన పేర్కొన్న సరిహద్దుల మధ్య 63.33 చదరపు గజాల లేదా 52.95 చదరపు మీటర్ల స్థలం మరియు అందులో డోర్ నం. 101-16-279/1 (అసెస్మెంట్ నం. 8994) గల దాబా ఇల్లు తలుపులు, ద్వారబంధాలు, సీలింగ్, విద్యుత్ సదుపాయం, సాధారణ దారులు, నీటి మార్గాలు మరియు అన్ని సాధారణ అనుబంధ హక్కులతో సహా. **తూర్పున: 15-0 అడుగుల జోసార్ ఖాళీ స్థలం, పడమర: 15-0 అడుగుల 10 అడుగుల వెడల్పు గల ఉమ్మడి దారి; ఉత్తరం: 38-0 అడుగుల మేర దుబాసి శ్రీనుకు చెందిన ఆస్తి; దక్షిణం: 38-0 అడుగుల వానపల్లి రామలక్ష్మికి చెందిన ఆస్తి.** | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు [చట్టం 2002లి సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది" ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీక AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 29/08/2026
స్థలం : రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్

అధీకృత అధికారి
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# సీఎం పర్యటనలో ఆసక్తికర సన్నివేశాలు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. సీఎం చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని మధ్యాహ్నం అనంతపురంకి వచ్చి టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుమార్తెకు జరిగిన వివాహ కార్యక్రమానికి సీఎం హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనంతపురం శివారులోని శిల్పారామం వద్ద సీఎం రాకకోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మంత్రి పయ్యావుల కేశవ్‌తో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు హెలీ ప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో కూర్చుని ఎదురు చూశారు. ఈ సమయంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ రావు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వద్దకు వచ్చి భాగున్నావా మామా అని పలకరించగా ప్రభాకర్ చౌదరి ఏ విధంగానూ స్పందించకుండా మౌనంగా ఉండిపోయినట్లు తెలియవచ్చింది. అదే సమయంలో హెలీ ప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితో చాలా సేపు విడిగా ముచ్చటించినట్లు తెలిసింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య ఇటీవల కాలంలో తీవ్ర స్థాయిలో విబేధాలు వచ్చిన విషయం పాఠకులకు విదితమే. మంత్రి పయ్యావుల, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య జరిగిన సంభాషణ తెలియరావడం లేదు.

**భాగున్నావా ప్రభాకర్ అంటూ సీఎం సంబోధ :** హెలీ ప్యాడ్‌లో అందరి నాయకులను పలకరిస్తూ వస్తున్న సందర్భంలో అనంతపురంమాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పుష్పగుచ్చం ఇచ్చేందుకు ప్రయత్నించగా భాగున్నావా ప్రభాకర్ అంటూ సీఎం సంబోధించినట్లు తెలియవచ్చింది. ఈ సమయంలో మీ అపాయింట్ మెంట్ కావాలని, మీతో కొన్ని విషయాలు మాట్లాడాలని అని ప్రభాకర్ చౌదరి ప్రత్యేకంగా సీఎంని అడుగగా, నాకు అన్ని విషయాలు తెలుసు వెయిట్ చేయ్.. అపాయింట్ మెంట్ ఇస్తానంటూ సీఎం ప్రభాకర్ చౌదరికి తెలిపినట్లు సమాచారం. ప్రభాకర్ చౌదరి ఏదో చెబుతుంటే చంద్రబాబు వారిస్తూ ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తోంది. పార్టీ అంతర్గత విషయాలు బయట మాట్లాడ వద్దు, కలిసి మాట్లాడదామని సీఎం చెప్పినట్లు తెలియవచ్చింది.

**జెసి ప్రభాకర్‌రెడ్డిని ఆరోగ్యాన్ని బాగా చూసుకోవాలని చెప్పిన సీఎం చంద్రబాబు:** హెలిప్యాడ్‌లో తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డికి సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. జెసి ప్రభాకర్‌రెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చే సమయంలో ఆరోగ్యం ఎలా ఉంది, ఆరోగ్యం ఎలా ఉంది నీ ఆరోగ్యాన్ని బాగా చూసుకో ప్రభాకర్ అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించగా మీ ఆరోగ్యం భాగుంటే మాఆరోగ్యం బాగుంటుందంటూ సీఎంతో జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలియవచ్చింది.

**ప్రభాకర్ చౌదరిని ఆలింగనం చేసుకున్న జెసి ప్రభాకర్‌రెడ్డి:** శిల్పా రామం వద్ద ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్‌లో సీఎం కోసం ఎదురు చూస్తున్న సమయంలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి చొరవతో భాగున్నావా ప్రభాకర్ అంటూ ఆలింగనం చేసుకుని ఇద్దరు కొద్దిసేపు మాట్లాడుకోవడం అక్కడున్నవారు ఆసక్తిగా చూడటం కనిపించింది. గతంలో అనంతపురం నగరంలో రోడ్ల వెడల్పు, ఇతర విషయాల్లో ప్రభాకర్‌చౌదరి, జెసి సోదరులమధ్య మాటల యుద్ధం చోటు చేసుకోగా వారి మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్న నేపధ్యంలో ఈ సంఘటన ఆసక్తి కరంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి జిల్లా పర్యటన ముగించుకొని మధ్యాహ్నం అనంతపురం చేరుకొని వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడు శివ చరణ్ వివాహ మహోత్సవానికి సిఎం చంద్రబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు, వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేదికపై పదినిమిషాలు సిఎం గడిపారు. ఇరు కుటుంబాలకు చెందిన వారిని సిఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఎమ్మెల్యే, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ కుటుంబీకులు, అభిమానంతో సిఎంతో ఫోటోలు తీయించుకున్నారు. సిఎం ప్రత్యేకంగా తమ పిల్లల వివాహానికి హాజరు కావడం, దాదాపు పది నిమిషాల సేపు వివాహ వేదికపై గడపటం పట్ల గుమ్మనూరు, పూల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. తొలుత సిఎం చంద్రబాబు అనంతపురం జిల్లా కేంద్రంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద మధ్యాహ్నం 2.24 గంటలకు చేరుకున్నారు. అక్కడ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు సిఎంకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బళ్లారి రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌కు మధ్యాహ్నం 02:59 గంటలకు చేరుకుని అక్కడ నూతన దంపతులను ఆశీర్వదించి, 3:10 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.సిఎం పర్యటనలో మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెస్ రాజు, జెసి అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి, పల్లె సింధూర రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఎడిసిసి బ్యాంక్ అధ్యక్షుడు ముంటిమడుగు కేశవరెడ్డి, శ్రీధర్ చౌదరి, ప్రకాష్ నాయుడు తదితరులతోపాటు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్చలు విఫలమైతేనే ఉద్యమం

ఏపి జెఏసి చైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కెవిఎస్‌ఎస్ ప్రసాద్

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపి జెఏసి) తన భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సమావేశంలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఏ బకాయిలు సహా ఇతర డిమాండ్లపై చర్చించి, తదుపరి కార్యాచరణను ఖరారు చేయనున్నారు. ఆదివారంనాడిక్కడ జెఏసి చైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కెవిఎస్‌ఎస్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి చర్చలు, సంప్రదింపులకే తాము తొలి ప్రాధాన్యం ఇస్తామని, అవి విఫలమైతేనే ఉద్యమ కార్యాచరణ అనివార్యమని స్పష్టం చేశారు. మంత్రుల బృందం ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణం నెలకొందని వారు పేర్కొన్నారు. పిఆర్‌సి, పెండింగ్ డిఏలు, ఇతర ఆర్థిక బకాయిల చెల్లింపుల్లో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.22 వేల కోట్ల బకాయిలు చెల్లించడం, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు పంపిణీ చేయడం, 11 వేల మందికి ఓపిఎస్ వర్తింపజేయడం, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం వంటి సానుకూల నిర్ణయాలు తీసుకుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ, కీలకమైన ఆర్థిక అంశాలపై ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన కొరవడిందని జెఏసి నేతలు అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 5న జరిగే సమావేశంలో వీటిపైనే ప్రధానంగా చర్చించి, ప్రభుత్వం సానుకూలంగా స్పందించనపక్షంలో తదుపరి ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.

## వైసిపికి కర్త, కర్మ, క్రియ వైఎస్ జగనే!



**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయసాయి రెడ్డి సొంత కారణాలతోనే వైసిపిని వీడారని, ఆయన పార్టీని ఎందుకు విడిచిపెట్టారో ఎవరికీ తెలియదని వైసిపి సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తాను వ్యక్తిగత కారణాలతో పార్టీ నుంచి బయటకు వెళ్తున్నట్లు విజయసాయే చెప్పారని గుర్తుచేశారు. పార్టీని వీడిన వారి గురించి వైఎస్ జగన్ ఎప్పుడూ నెగిటివ్‌గా మాట్లాడలేదని స్పష్టం చేశారు. జగన్‌పై, వైసిపిపై విమర్శలు చేయడానికి ప్రస్తుతం పాత్రలు మాత్రమే మారుతున్నాయని, జగన్ నాయకత్వాన్ని టార్గెట్ చేసి దాడి చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. 40ఏళ్లుగా జగన్ వెంట ఉన్న వ్యక్తిగా విజయసాయి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైసిపి అంటే ఒక కోటరీ అనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని సజ్జల అన్నారు. విజయసాయి ఆరోపణల వల్ల పార్టీలో అభిప్రాయాలు ఏర్పడే అవకాశం ఉన్నందున వాటిని తొలగించేందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. విజయసాయికి జగన్ పార్టీలో నంబర్2 స్థానం కల్పించారని, వైసిపిలో ఆయనకు వచ్చినన్ని పదవులు మరెవరికీ రాలేదని పేర్కొన్నారు. జగన్ నంబర్2, సజ్జల నంబర్1 అని విజయసాయి చెప్పడం సరికాదన్నారు. వైసిపికి కర్త, కర్మ, క్రియ వైఎస్ జగనేనని, పార్టీలో జగన్ ఒక్కరే నేత, మిగతా వారంతా కార్యకర్తలేనని స్పష్టం చేశారు. తనపై వచ్చే ఆరోపణలను తాను ఎప్పుడూ పట్టించుకోలేదని, పదవులు కాదని, జగన్‌తో ఉన్న అనుబంధమే తన అదృష్టమని సజ్జల పేర్కొన్నారు.

## మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్1 ఉచిత శిక్షణ

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రూప్-1 పరీక్షలకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవల్‌పమెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ఎపి ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఉచిత శిక్షణకు అభ్యర్థులను రాష్ట్రవ్యాప్త ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మైనార్టీ అభ్యర్థులందరూ తమ వివరాలను 'సిఇడిఎంఎపి' అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్ శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు పొంది, తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాలవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ శిక్షణకు మాత్రం పై నిబంధన వర్తించదని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌లో లేదా 08645 297535, 73867 89966 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 31వ తేదీన ప్రారంభమై సెప్టెంబరు 10వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. పూర్తి వివరాలు సిఇడిఎంఎపి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు వెల్లడించారు. త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే గ్రూప్-2కు కూడా ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు.

## శ్రీకాళహస్తిలో సీఎంకు ఘనస్వాగతం



శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలు అందిస్తున్న ఎమ్మెల్యే, ఇఒ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు శ్రీకాళహస్తిలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారథ్యంలో ఘనస్వాగతం పలికారు. శాప్ మాజీ చైర్మన్, ఎన్‌టిఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితులు పిఆర్ మోహన్ కుమార్తె డింపుల్ వివాహానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెలికాప్టర్‌లో ఆయన రాగా హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బరాయుడులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, నెలవల జయశ్రీ, గాలి భానుప్రకాష్‌రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, తిరుపతి నగరపాలక సంస్థ చైర్మన్ జయకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఎస్‌విబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు సంబంధిత అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒ బికె వెంకటేశులు, ఆలయ వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మహిళలు, పిఆర్ మోహన్ కుటుంబ సభ్యులతో ఎంతో ఆత్మీయంగా పలుకరిస్తూ మహిళలతో ఫొటోలు దిగారు. డింపుల్, రాజేష్ దంపతులను ఆశీర్వదించి బహుమతిని అందించారు.

## అవనిగడ్డలో దారుణం

- మైనర్‌పై ఆర్‌ఎంపి వైద్యుడు లైంగిక దాడి
- నిందితుడు అరెస్ట్, పోక్సో కేసు నమోదు

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 8వ తరగతి చదువుతున్న బాలికపై ఆర్‌ఎంపి వైద్యుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. బాలిక తొమ్మిది నెలల గర్భంతో పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. అనంతరం ఆమెను ఆస్పత్రికి తరలించగా అక్కడ బాలిక ప్రసవించినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన ఆర్‌ఎంపి వైద్యుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు అవనిగడ్డ సిఐ యువకుమార్ తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుమల సమాచారం

## ప్రపంచ నలుమూలలకూ భారతదేశ వైభవం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆకాంక్ష



**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం నుండి దేశవ్యాప్తంగా "సేవా సంకల్ప్ మహోత్సవ్" పేరుతో ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వెల్లడించారు. తిరుమల శ్రీవారి కరుణాకటాక్షాలతో భారతదేశ వైభవం ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలుస్తుందనిఆయన ఆకాంక్షించారు.దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, దేశ ప్రజలకు శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మాధవ్ ప్రార్థించారు. భారత రాజ్యాంగ పరిపాలనలో వరుసగా 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా మొత్తం 25 సంవత్సరాల సుపరిపాలన ప్రస్థానం కొనసాగుతున్నదన్నారు. నాలుగు రోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం బిజెపి అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్ర మాధవ్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి ప్రోటోకాల్ బ్రేక్ సమయంలో శ్రీవారి ప్రత్యేక సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనానంతరం వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట టిటిడి పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సి.దివాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, కేతినేని సురేంద్ర నాయుడు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా ఒబిసి మోర్చా ఉపాధ్యక్షుడు కుర్రకాల్వ వేణు, రేణిగుంట మండల ఉపాధ్యక్షుడు రాజా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## కారీరిష్టి యాగం వరుణజపంకు అంకురార్పణ



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురవాలని కలియుగ ప్రత్యక్షదైవాన్ని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో టిటిడి చేపట్టిన కారీరిష్టి యాగం, వరుణజపం పర్జన్యశాంతి హోమాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్త హోమం అంకురార్పణ చేపట్టారు. సెప్టెంబర్ 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ యాగ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చివరి రోజు మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞన పీఠం ప్రిన్సిపాల కెఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో ఈ యాగ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## సహాజ జీవనమే ఆరోగ్యానికి శాశ్వత పునాది

ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతికి అనుగుణంగా జీవించడం, సహజ ఆహారం తీసుకోవడం తగినంత విశ్రాంతి, స్వచ్ఛమైన నీరు గాలిని అలవాటుగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయుష్, టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన 'యోగ, ప్రకృతి వైద్యంతో ఆరోగ్య పరిరక్షణ' అవగాహన కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, తగినంత విశ్రాంతి లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సహజ ఆహారం, స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి, తగినంత విశ్రాంతి ఆరోగ్య సంజీవినిలోని నాలుగు ముఖ్య అంశాలని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ముందుగానే శ్రద్ధ వహించి మంచి జీవన అలవాట్లు పాటిస్తే అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. బెటర్ లివింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డిజిటల్ వెల్‌నెస్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు భావోద్వేగ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, కోపం, నిరాశ వంటి భావోద్వేగాలను సమతుల్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. సానుకూల ఆలోచనలు ప్రశాంతమైన మనసు, ఆనందమయ జీవితంకు బలమైన పునాదులని చెప్పారు. ప్రతిరోజూ కొంత సమయం యోగా, ధ్యానం, వ్యాయామానికి కేటాయించడంతో పాటు ప్రకృతితో మమేకం కావాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆప్యాయంగా గడపాలని సూచించారు. సమస్యలను చూసి ఆందోళన చెందకుండా పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టడం ద్వారా ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని తెలిపారు. అవసరానికి మించి డిజిటల్ పరికరాలకు సమయం కేటాయించకుండా కుటుంబం, ప్రకృతి, వ్యాయామం, ఆధ్యాత్మిక చింతనకు సమయం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, ఎస్వీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఇతర అధికారులు, టిటిడి ఉద్యోగులు, పాల్గొన్నారు.

## తిరుమల అడవుల్లో ఏనుగుల గుంపు

- భక్తులను అప్రమత్తం చేసిన అటవీశాఖ



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాకాలం ఆరంభమైనా వాన చినుకు లేకపోవడంతో శేషాచలం అడవుల్లో కుంటలు ఎండిపోయి తాగు నీటికి వన్యప్రాణులు అడవిని వదలి జనసంచారంలోకి వచ్చేస్తున్నాయి. తాజాగా ఆదివారం ఉదయం శేషాచలం అడవిలో ఏనుగుల కదలికలు, గుంపులను అటవీశాఖ డ్రోన్ కెమెరాల్లో గుర్తించింది. మొత్తం 35 ఏనుగుల మంద రెండు భాగాలుగా విడిపోయి, భాకరాపేట, దిగువూరు వైపు నుండి 13 ఏనుగుల గుంపు చంద్రగిరి వైపు వెళ్ళడాన్ని డ్రోన్‌తో చిత్రీకరించారు. ఇక మరో 22 ఏనుగుల గుంపు అటవీ మార్గంలో తిరుమల వైపు వచ్చినట్లు కనుగొన్నారు. అటవీ శాఖ అధికారులు డ్రోన్ల ద్వారా ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చంద్రగిరి, తిరుమల, కాలినడక మార్గాలు, తిరుమల ఘాట్ రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని స్థానికులకు సూచించారు. తరచూ శేషాచలం అటవీప్రాంతంలో ఏనుగుల గుంపులు ఇబ్బందులు పెడుతున్నాయి. పంటలను నాశనం చేయడగామేగాక తిరుమల ఘాట్‌రోడ్డులో భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాల రైతులు ఆందోళన చేస్తుండటంతో అటవీ శాఖ అధికారులు ఈ ఏనుగుల గుంపుపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో నిరంతరం అటవీ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## సెప్టెంబర్ 4న గోకులాష్టమి ఆస్థానం

**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడుగా ఆనాడు తన జన్మదినాన్ని గోపికలు,ద్వారకవాసుల మధ్య వేడుకగా జరుపుకున్నట్లు, కలియుగవైకుంఠం తిరుమలలో వేంకటేశ్వరస్వామి చెంత గోకులాష్టమి ఆస్థానం అత్యంత కన్నులపండువగా జరగనుంది. సెప్టెంబర్ 4వ తేదీ శుక్రవారం శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. గోగర్భమ్ డ్యామ్ సమీపంలోని ఉద్యానవనంలో కాళీయమర్ధనుడికి విశేష అభిషేకాలు జరిపిస్తారు. అదేరోజు రాత్రి వెంకన్న ఆలయంలోని బంగారువాకిలిలో ముఖమండపంలో రాత్రి 8గంటల నుండి 10గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆరోజు బంగారుసర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపుచేసి నివేదనలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవిభూదేవి అమ్మవార్లకు శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేస్తారు. **5న ఉట్లోత్సవం:** గోకులాష్టమి మరుసటిరోజు ఉట్లోత్సవం అత్యంత వేడుకగా జరిపిస్తారు. ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఉట్లను ఏర్పాటుచేస్తారు. స్థానికులతోబాటు ఆలయ అర్చకులు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి వేర్వేరు తిరుచ్చిలపై తిరుమాఢవీధుల్లో విహారిస్తారు. యువకులు ఎంతో ఉత్సాహంతో సెప్టెంబర్ 5వ తేదీ శనివారం సాయంత్రం ఉట్లను కొడుతూ స్వామికి ఆనందం కలిగిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఆర్జితసేవలు ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

## శ్రీవారి సేవకుల సేవల పరిధి మరింత విస్తరణ



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సేవ సేవకుల సేవల పరిధిని మరింతగా విస్తరించాలని టిటిడి నిర్ణయించింది. భక్తులకు ఇప్పటి వరకు ఇతోదిక సేవలందిస్తున్న ఈ సేవా విధానంలో కీలక మార్పులు చేస్తోంది. ఇంకా కొన్ని రంగాలలో ఉచిత సేవలకుగాను నిపుణులైన వారికి అవకాశం కల్పించాలని టిటిడి భావించింది. రెండున్నరదశాబ్దాల కాలంపైగా తిరుమలలో శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. భక్తులకు వసతి, భోజన సేవలకే పరిమితమైన ఈ కార్యక్రమంలో ఇప్పటికే వైద్యులు వంటి వృత్తి నిపుణులకు వైద్యసేవలో అవకాశం కల్పించారు. ఈ సేవ కోసం భారీ స్పందన వచ్చింది. జూన్ 5న పైలట్ ప్రాజెక్టుగా శ్రీవారి వైద్యసేవ ప్రారంభమైంది. స్విమ్స్, బర్డ్, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, సెంట్రల్ హాస్పిటల్, అశ్విని హాస్పిటల్, ఆయుర్వేద ఆసుపత్రులు, గోశాలల్లో సేవలందించే అవకాశం కల్పించారు. స్పెషలిస్ట్ వైద్యులు కనీసం మూడు రోజులు, ఎంబిబిఎస్ వైద్యులు ఏడు రోజుల సేవా స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వైద్యసేవ ప్రారంభమైన 83 రోజుల్లోనే 723 మంది వైద్యులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా 586 దరఖాస్తులను టిటిడి ఆమోదించింది. ఇప్పటికే 109 మంది వైద్యులు సేవలు అందించారు. మూడు రోజుల సేవ పూర్తి చేసిన స్పెషలిస్ట్ వైద్యులకు శ్రీవారి బ్రేక్ దర్శనం కల్పిస్తుండగా, ఏడు రోజుల సేవ చేసిన ఎంబిబిఎస్ వైద్యులకు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉచిత దర్శనం అవకాశం ఇస్తున్నారు. హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్యులు టిటిడెవస్థానమ్స్. ఎపి.జివొవి. ఇన్/శ్రీవారిసేవ/ఇన్‌స్ట్రక్షన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసి, ఇష్టమైన ఆసుపత్రి, సేవా స్లాట్‌ను ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత టిటిడి ఆమోదంతో విధుల్లో చేరి రోజుకు ఆరు గంటల పాటు సేవలందించాలన్నారు.

## కూటమి సిఎం అభ్యర్థిగా పవన్‌ను ప్రకటించాలి

**తిరుపతి, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** 2029 ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్డీఏ కూటమి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను ప్రకటించాలని వీర బలిజ శంఖారావం తీర్మానించింది. అలాగే బలిజ నేతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభ డిమాండ్ చేసింది. వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభ ఆదివారంతిరుపతిలో జరిగింది. దక్షణ భారత దేశం, శ్రీలంకను పాలించిన బలిజ చక్రవర్తుల వారసులను సభ సన్మానించింది. ముఖ్యంగా శ్రీలంక కు చెందిన క్యాండీ రాజుల వారసులు, కళ్యాణదుర్గం బలిజ సంఘం అధ్యక్షుడు బుట్న తిమ్మరాజు సతీమణి ఛాయాదేవి రాజ సింఘే అలియాస్ లక్ష్మీ, బుట్న తిమ్మరాజు ను రాజా నవనీత, రాయదుర్గంకు చెందిన పురుషోత్తం రాజాలను సన్మానించారు. ఇకపై జరిగే ప్రతి సభలోనూ బలిజ పాలకుల వారసులను సన్మానించనునట్లు సభ ప్రకటించింది. ఈ శంఖారావంలో ఏడు తీర్మాణాలను ఆమోదించారు. బలిజ, కాపులు శతాబ్దాలుగా ధర్మానికి కట్టుబడి జీవనం సాగించారని, ప్రస్తుత భవిష్యత్ తరాలు సనాతన ధర్మపరిరక్షకులుగా కొనసాగాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త ఆముదాల ప్రభాకర్,క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు వసంతం శ్రీనివాసులు,చింతకాయల కృష్ణయ్య,చిన్నంగారి రమణ,మాజీ ఎమ్మెల్యే మోహన్ పాల్గొన్నారు.

# ఆచూకీ కోసం 'పెద్ద రెస్క్యూ'



**ఆకస్మిక వరద అనంతరం విపత్కర పరిస్థితుల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు**

**జలవిద్యుత్ సొరంగాల్లో చిక్కుకున్న వందలాది మంది**

**గుర్తుతెలియని మృతదేహాలకు సామూహిక ఖననాలు**

**టిబెట్‌లో గల్లంతైన విదేశీయుల జాబితాలో నేపాల్, భారత్, లాత్వియా వాసులు అత్యధికులు**

**చిత్వాన్/బీజింగ్, ఆగస్టు 30:** హిమానీనదం కూలిపోవడంతో హిమాలయాల్లో వినాశకరమైన బురద ప్రవాహం విరుచుకుపడింది. ఈ ఘటనలో గల్లంతైన వేలాది మందిని కనుగొనేందుకు నేపాల్, చైనాలలో సహాయక బృందాలు ఆదివారం తీవ్రంగా ప్రయత్నించాయి. సవాలుతో కూడిన వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న నీటిమట్టాలను ఎదుర్కొన్నారు. బుధవారం పర్వత లోయలు, నదుల గుండా మంచు, రాళ్లు, బురద, శిథిలాల ప్రవాహం ఉధృతంగా ప్రవహించి, విస్తృతమైన విధ్వంసం సృష్టించడంతో, నేపాల్- చైనా సరిహద్దుకు ఇరువైపులా 3,000 మందికి పైగా గల్లంతయ్యారని, ఆదివారం ఉదయం నాటికి మృతుల సంఖ్య 750కి పెరిగిందని అధికారులు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం వల్లే ఈ విపత్తు సంభవించిందని చైనా పేర్కొంది. ఈ విపత్తు కారణంగా 90,000 మందికి పైగా ప్రజలు ప్రభావితమై ఉండవచ్చుని రెడ్ క్రాస్ అంచనా వేసింది. శనివారం జరిగిన టెలిఫోన్ సంభాషణలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తన నేపాల్ సహచర మంత్రితో మాట్లాడుతూ, ఇటీవలి సంవత్సరాలలో తాము ఎదుర్కొన్న "అత్యంత తీవ్రమైన సరిహద్దు విపత్తు ఇదేనని, సహాయక చర్యలు అపూర్వమైన క్లిష్టతకు, సంక్లిష్టతకు చేరుకున్నాయని పేర్కొన్నారు. నేపాల్ విపత్తుల శాఖ 734 మంది మరణించారని, 2,498 మంది గల్లంతయ్యారని, 7,514 మందిని రక్షి ంచారని తెలిపింది. చైనా వైపున, గిరాంగ్ కౌంటీలో 16 మంది మరణిం చారని, 546 మంది గల్లంతయ్యారని అధి కారులు తెలిపారు.

నేపాల్‌తో ఉన్న కీలక సరిహద్దు దాటే ప్రదేశానికి సమీపంలో ఉన్న టిబెట్‌లో 23 దేశాలకు చెందిన 261 మంది విదేశీయుల ఆచూకీ తెలియడం లేదని బీజింగ్ తెలిపింది. ఈ విపత్తు తీవ్రత, కఠినమైన హిమాలయ పర్వత ప్రాంతాలలో సహాయక చర్యలను మరింత క్లిష్టతరం చేసింది. తాజా వర్షాల కారణంగా గత కొన్ని గంటలుగా త్రిశూలి నది నీటిమట్టం పెరగడంతో, అదనపు వరదల భయాలు నెలకొన్నాయి. దీంతో నివాసితులు, సహాయక సిబ్బంది ఎత్తయిన ప్రదేశాలకు తరలివెళ్లారని నేపాల్‌లోని స్థానిక పోలీసులు తెలిపారు. ప్రతికూల వాతావరణం, అలాగే ఈ విపత్తు కారణంగా నేపాల్- చైనా



సరిహద్దుకు ఆవలి వైపున ఏర్పడిన సరస్సు పొంగిపొర్లి నేపాల్‌లోని లెండే ఖోలా, త్రిశూలి నదులలోకి ప్రవహించడం వల్ల మళ్లీ వరదలు సంభవించవచ్చునే ఆందోళనల కారణంగా శుక్రవారం నుంచి సహాయక చర్యలను పలు మార్లు నిలిపివేశారు. దిగువ ప్రాంతాలను ముంచెత్తుతున్న సరస్సును శనివారం సాయంత్రాని కల్లా చాలా వరకు ఖాళీ చేశారని అధికారులు తెలిపారు. కానీ, శనివారం రాత్రి ఆలస్యంగా, సరస్సుకు 2.8 కిలోమీటర్ల (1.7 మైళ్ల) దిగువన కొండచరియ విరిగిపడటాన్ని డ్రోన్లు గుర్తించాయి. దీనివల్ల ఒక కొత్త ఆనకట్ట ఏర్పడి, తాజాగా నీటి మడుగు ఏర్పడింది.

నేపాల్‌లో, వరదల వల్ల దెబ్బతిన్న జలవిద్యుత్ కేంద్రాల వద్ద సొరంగాలలో చిక్కుకుపోయారని భావిస్తున్న వందలాది మందిపై సహాయక చర్యలు మరింతగా కేంద్రీకరించబడ్డాయి. సొరంగాలలో చిక్కుకున్న వారిని రక్షి ంచే చర్యలు, డిఎన్‌ఏ పరీక్షలు, మృతదేహాలను శీతలీకరించిన నిల్వ, కుళ్ళిపోయిన అవశేషాల ఫోరెన్సిక్ గుర్తిం పు వంటి ప్రత్యేక రంగాలలో నేపాల్‌కు అం తర్జాతీయ సహాయం అవసరమని



నేపాల్ విదే శాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లోక్ బహదూర్ ఛెత్రి తెలిపారు. సొరంగాలను తెరవడానికి, సహా యకచర్యలకు మద్దతు ఇవ్వడానికి భారత, చైనా నిపుణులు ఇప్పటికే పనిచేస్తున్నారని ఛెత్రి చెప్పారు.

**కుళ్లిపోతున్న మృతదేహాలకు సామూహిక ఖననాలు:** తమ వారి కోసం నిస్సహాయ బంధువులు ఆసుపత్రులు, శవగారాలు, సహాయక కేంద్రాల మధ్య తిరిగిన కొన్ని రోజుల తర్వాత, కుళ్లిపోవడం ప్రారంభమైన వందలాది గుర్తుతెలియని బాధితుల మృతదేహాలకు నేపాల్ అధికారులు సామూహిక ఖననాలను ప్రారంభించారు. విపత్తు ప్రత్యక్ష ప్రభావం నుండి తప్పించుకున్న చిత్వాన్ జిల్లాలో, వరద ప్రభావిత రసువా ప్రాంతం నుండి ప్రవాహానికి కొట్టుకువచ్చిన మృతదేహాలు నదీ ప్రవాహంతో నారాయణి నదిలో కలిశాయి. ఖననం తర్వాత కుటుంబాలు తమ బంధువులను గుర్తించగలరేమో నన్న ఆశతో అధికారులు మృతదేహాలను ఫొటోలు తీస్తున్నారు, డిఎన్‌ఎ నమూనాలను సేకరిస్తున్నారు. గుర్తింపు వివరాలను నమోదు చేస్తున్నారు. "తాము ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాలలో సగానికి పైగా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి" అని పోలీసు అధికారి అనిల్ థాపా తెలిపారు. "చాలా వాటికి ముఖాలు కనిపించడం లేదు. కొన్ని సందర్భాల్లో, చేతులు లేదా కాళ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరికొన్నింటిలో, శరీరంలోని భాగాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. అనేక సందర్భాల్లో, తలలో సగానికి పైగా లేద్దు" అని వివరించారు. శనివారం 100కు పైగా గుర్తుతెలియని మృతదేహాలకు ఖననం చేసిన తర్వాత, అధికారులు ఆదివారం మరో వందకు పైగా మృతదేహాలను సామూహిక ఖననం చేశారు.

**వాతావరణ మార్పులతోనే..:** "గ్లోబల్ వార్మింగ్ దీర్ఘకాలిక ప్రభావాల కింద హిమానీనదాల అస్థిరత కారణంగాన్నే" ఈ వరద సంభవించిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. టిబెటన్ పీఠభూమిపై ఇది "క్రయోస్ఫియర్ విపత్తుల ఒక కొత్త, ప్రముఖ లక్షణన్ను" అని పేర్కొన్నారు. నేపాల్ వైపు నుండి వచ్చిన ఈ కొండచరియలు గిరాంగ్ సరిహద్దు దాటే ప్రదేశా నికి చేరుకోవడానికి ఆరు నుండి ఏడు నిమిషాలు పట్టిందని చైనా శాస్త్రవేత్తలు వివరించారు.

# డిఫరెంట్ లుక్‌లో ప్రధాని మోడీ

**తాష్కెంట్, ఆగస్టు 30:** ప్రధాని మోడీ తన తాష్కెంట్ పర్యటనలో ఆదివారం డిఫరెంట్ లుక్‌లో కనిపించారు. టీ షర్ట్, ట్రాక్ ప్యాంట్ ధరించారు. ముదురు నీలం రంగు జిమ్ టీ షర్ట్, ట్రాక్ ప్యాంట్, దానికి తగ్గ షూస్ ధరించారు. సాధారణంగా అధికారిక పర్యటనల్లో సూట్ తో కనిపిస్తుంటారాయన. ఇది యోగా సెషన్ కావడం వల్ల క్యాజువల్ దుస్తులనే వేసుకున్నారు. యోగా సెషన్‌లో కలియదిరిగారు. ఆసనాలను స్వయంగా తిలకించారు. వారికి కొన్ని చిట్కాలు చెప్పారు. యోగా విశిష్టత గురించి వివరించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి, ప్రశాంతతను సాధించ డానికి యోగా సాధన ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ఉజ్బెకిస్తాన్‌నుంచి కూడా యోగ అభ్యాసకకులు విరివిగా పాల్గొన్నారు. వీరిలో ఎంపికచేసిన కొందరు యువతులు యోగా నిర్వహించి ప్రధాని మోడీని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ నిత్యజీవనంలో యోగా బాగం కావాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం అని చెప్పారు. ఈసందర్భంగా యోగా కార్యాచరణలో కొన్ని మెళకువలను కూడా వారికి సూచించారు.



# ఉక్రెయిన్‌పై రష్యా దాడుల బీభత్సం

## 27 మంది పౌరులు మృతి

**కీవ్, ఆగస్టు 30:** ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగర శివార్లలో రష్యా సైన్యం దారుణ మారణహోమానికి పాల్పడింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు కీవ్ సమీపంలోని ఓ భారీ గోదామును ఢీకొట్టడంతో భయంకరమైన పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం 27 మంది అమాయక పౌరులు కోల్పోగా, వంద మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. అర్ధరాత్రి జరిగిన ఈ దాడితో ఆ ప్రాంతమంతా అగ్నిగుండంగా మారింది. ఆకాశాన్ని తాకేలా మంటలు చెలరేగడంతో స్థానికులు ప్రాణభయంతో వణికిపోయారు. శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని కీవ్ సైనిక పరిపాలన విభాగం అధిపతి తైమూర్ తకచెంకో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడితో కీవ్ పరిసర ప్రాంతాలు శ్మశానాన్ని తలపిస్తున్నాయి.

విచారణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదేశం ఈ భయానక ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. డ్రోన్ దాడులతోపాటు గోదాములో పేలుడు సంభవించడానికి గల కారణాలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జనావాసాలకు దగ్గరగా ముందుగుండు సామగ్రిని నిల్వ చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాల మధ్యలో ఇలాంటి ప్రమాదకర ఆయుధాలను ఉంచడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**డ్రోన్ల తయారీ కేంద్రమే లక్ష్యం:** ఈ దాడులపై రష్యా రక్షణ శాఖ భిన్నమైన వాదనను వినిపిం చింది. తాము కేవలం సైనిక స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని స్పష్టం చేసింది. ఉక్రెయిన్ సైన్యం డ్రోన్ల తయారీ కోసం ఉపయోగిస్తున్న పరికరాలను నిల్వ చేసిన ఆయుధా గారంపైనే తమ బలగాలు దాడి చేసినట్లు రష్యా ప్రకటించింది. ఉక్రెయిన్ చెబుతున్నట్లుగా అది సాధారణ గోదాము కాదని బదులిచ్చింది.



**కొనసాగుతున్న బీభత్సం**

రష్యా, ఉక్రెయిన్ మధ్య దాదాపు రెండున్నరేళ్లుగా భీకర యుద్ధం సాగుతూనే ఉంది. ఈ పోరులో ఇరు దేశాలు డ్రోన్ దాడులను తీవ్రం చేశాయి. తాజా దాడి కీవ్ పరిసరాల్లో జరిగిన అత్యంత దారుణమైన మారణకాండల్లో ఒకటిగా నిలిచింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చల ప్రస్తావన వస్తున్న సమయంలోనే రష్యా ఈ స్థాయి దాడికి పాల్పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# నషాముక్త్ భారత్ లక్ష్యాన్ని యువత సాకారం చేయాలి

## మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** వికసిత్ భారత్ లక్ష్యం సాకారమయ్యేందుకు దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం 137వ ఎపిసోడ్‌లో నేడు ప్రధాని మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారత దేశ భవితను కాపాడుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇటీవల ప్రారంభమైన నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ప్రధాని మోడీ అన్నారు. భారీ సంఖ్యలో యువత ఈ కార్యక్రమంలో పాల్గొంటోందని చెప్పారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కంటెంట్ క్రియేటర్లు తమ తమ భాషల్లో ప్రచారం చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ వ్యసనం కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు యువత ఎందుకు దూరంగా ఉండాలో విశదీకరించాలని కంటెంట్ క్రియేటర్లకు సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న వారిని, ఈ వ్యసనానికి బానిసలైన వారికి సాయం చేసే వారిని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంలో ఈ సంవత్సరం భారతీయులందరికీ ఎంతో ప్రత్యేకమైనదని కూడా ప్రధాని చెప్పారు. సూర్యపథ్ తిరంగా కార్యక్రమం ద్వారా ఈ ఏడాది మువ్వన్నెల జెండా యావత్ ప్రపంచాన్ని చుట్టొచ్చిందని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పీఎం స్వనిధి యోజన గురించి ప్రధాని మాట్లాడారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించగలిగారని అన్నారు. పరిశరాల పరిశుభ్రతపై నిరంతరం దృష్టి పెట్టాలని కూడా పిలుపునిచ్చారు. స్థానిక ఉత్పత్తులకు భారతీయులు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు. పీఎం స్వనిధి పథకం ద్వారా లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు కొత్త శక్తిని పొందుతున్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన ఈ అంశంపై జరగాల్సినంత చర్చ జరగడం లేదని మోడీ అన్నారు.పీఎం స్వనిధి పథకం లబ్ధిదారుల్లో దాదాపు 46 శాతం మంది మహిళలేనని, అంటే దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ పథకంతో అనుసంధానమయ్యారని ప్రధాని తెలిపారు.కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక ఇబ్బందులతో దెబ్బతిన్న వీధి వ్యాపారులు తిరిగి తమ వ్యాపారాలను ప్రారంభించుకునేందుకు సహాయం చేయాలనే ఉద్దేశంతో 2020 జూన్‌లో పీఎం స్వనిధి పథకాన్ని ప్రారంభించారు.పథకం ప్రారంభమైనప్పటి నుంచి వీధి వ్యాపారులకు ఇది కేవలం ఆర్థిక సహాయంగా మాత్రమే కాకుండా వారి ఆర్థిక కార్యకలాపాలకు గుర్తింపు, అధికారిక గుర్తింపు కల్పించే సాధనంగా కూడా మారిందని ప్రభుత్వం పేర్కొంటోంది.

తొలుత 2024 డిసెంబర్ 31 వరకు అమలు చేయాలని నిర్ణయించిన ఈ పథకాన్ని తాజాగా 2030మార్చి 31 వరకు పొడిగించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ ఉజ్బెకిస్తాన్‌లో అధికారిక పర్యటనలో ఉన్నారు. మన్ కీ బాత్‌రేడియో కార్యక్రమాన్ని సాధారణంగా కొన్ని రోజుల ముందుగానే రికార్డు చేసి ప్రతినెల చివరి ఆదివారం ప్రసారం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వరదరాజ్ కథే దీనికి సరైన ఉదాహరణ. ఏళ్ల తరబడి తన పొలంలో టమోటాలు, అరటి పంటలే వేసేవారు.


# హెచ్4 ఎడి రద్దుకు ట్రంప్ సర్కార్ కసరత్తు

**వాషింగ్టన్, ఆగస్టు 30:** అమెరికాలో హెచ్1బీ వీసాదారుల భాగస్వాములకు జారీ చేసే వర్క్ పర్మిట్లు హెచ్4 ఈఏడీ రద్దు చేసేందుకు ట్రంప్ యంత్రాంగం మరోసారి ప్రయత్నాలు మొదలు పెట్టింది. దశాబ్దకాలంగా అమల్లో ఉన్న ఈ విధానాన్ని వెనక్కి తీసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ పరిణామం అమెరికాలో స్థిరపడిన వేలాది భారతీయ కుటుంబాల్లో ఆందోళన నింపింది. ఈ మార్పు తక్షణమే అమలులోకి రావడం లేదని, ప్రస్తుత నిబంధనలు యథాతథంగా కొనసాగుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డీహెచ్ఎస్ తన 2026 యూనిఫైడ్ ఎజెండాలో రిన్1615-ఎడి14 పేరిటఈ ప్రతిపాదనను చేర్చింది. 2015లో ఒబామా హయాంలో తీసుకొచ్చిన నిబంధనను రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# వరదల్లో.. 1600 మంది విద్యార్థుల ప్రాణాలు కాపాడిన ప్రిన్సిపాల్

**ఖాట్మండు, ఆగస్టు 30:** ఒక టీచర్ సమయస్ఫూర్తితో తీసుకున్న ఒక నిర్ణయం వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. విధి సవాల్ విసిరిన వేళ ఒక సాధారణ ఉపాధ్యాయుడు అసాధారణ హీరోగా నిలిచాడు. నేపాల్‌లో ఆకస్మిక వరదలు పాఠశాలను ముంచెత్తడానికి కేవలం కొద్ది నిమిషాల ముందు, 1643 మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించి వారి ప్రాణాలను కాపాడారు ఓ ప్రిన్సిపల్. ఆయన చూపిన ధైర్యం, కర్తవ్య నిరతిపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నేపాల్‌లోని నువాకోట్ జిల్లా, త్రిశూలి లోయలో ఉన్న త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 26 ఉదయం సుమారు 9:20 గంటలకు పాఠశాల ప్రిన్సిపల్, 47 ఏళ్ల ఇంగ్లీష్ టీచర్ అయిన రాజేంద్ర దవాడీకి తన స్నేహితుడి నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. సమీపంలోని ఒక గ్రామం పూర్తిగా వరదలో కొట్టుకుపోయిందని, వెంటనే అక్కడి నుంచి పారిపొమ్మని ఆ స్నేహితుడు హెచ్చరించాడు. అదే సమయంలో ఓ విద్యార్థి తండ్రి పరుగెత్తుకుంటూ వచ్చి నీటి మట్టం వేగంగా పెరుగుతోందని చెప్పాడు. పరిస్థితి తీవ్రతను క్షణాల్లో అర్థం చేసుకున్న రాజేంద్ర దవాడీ ఏమాత్రం ఆలస్యం చేయలేదు. వెంటనే పాఠశాల గంటను మోగించారు. తరగతి గదుల్లోని విద్యార్థులందరినీ బయటకు తీసుకురావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్ బస్ డ్రైవర్లకు ఫోన్ చేసి వెనక్కి తిరిగి వెళ్లి పోవాలని సూచించారు. ఆయన హెచ్చరికతో విద్యార్థులంతా సమీపంలోని ఎత్తైన ప్రదేశానికి పరుగులు తీశారు. అందరూ ఓ బోధి వృక్షం కింద తలదాచుకున్నారు. వారు అలా వెళ్లిన కొద్ది నిమిషాలకే, పెను ప్రవాహంతో వచ్చిన వరద నీరు మూడు అంతస్తుల కాంక్రీట్ పాఠ శాల భవనాలను పేకమేడల్లా కూల్చేసింది. ప్రిన్సిపల్ సత్వర నిర్ణయం వల్ల 1643 మంది విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. ఉపాధ్యాయ సిబ్బందిలో చాలామంది సురక్షితంగా బయటపడగా, దురదృష్టవశాత్తు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నది ఒడ్డున ఉన్న తన గదికి వెళ్లిన 32 ఏళ్ల సోషల్ హిస్టరీ టీచర్ సంతోష్ పరియార్, పాఠశాల జానిటర్ సుల్తాన్ లామా వరద ఉధృతికి కొట్టుకుపోయి మరణించారు. అయితే, తనపై వస్తున్న ప్రశంసలపై రాజేంద్ర దవాడీ ఎంతో వినమ్రంగా స్పందించారు. ఆ సమయంలో నేను చేయగలిగింది ఇంకేముందని ఆయన వ్యాఖ్యానించారు.






మాడిసన్‌స్క్వేర్ సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

# ప్రవాసభారతీయులు కర్మభూమితోపాటు జన్మభూమిని గుర్తుంచుకోవాలి

**న్యూయార్కు, ఆగస్టు 30:** ప్రవాస భారతీయులు వారు నివసిస్తున్న, పనిచేస్తున్న దేశానికే సంపూర్ణ విధేయతతో ఉండాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. అయితే కర్మభూమికి విధేయంగా ఉంటూనే జన్మభూమిని కూడా గుర్తుంచుకోవాలని, మరిచిపోవద్దని న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి భగవత్ మాట్లాడుతూ మీరు అమెరికాలో ఉన్నారు. ఇక్కడే జీవిస్తున్నారు, ఇక్కడే సంపాదిస్తున్నారు. కాబట్టి మీరు అమెరికాకు నిజాయతీగా మెలగాలని స్పష్టంచేశారు. అదే సమయంలో భారత్ వారి జన్మభూమి అని గుర్తుచేశారు. కర్మభూమిపట్ల తమ బాధ్యతలను నెరవేర్చిన తర్వాత, జన్మభూమి అయిన భారత్‌కు సేవ చేసేందుకు వారికి అవకాశం ఉందని, అది నిషిద్ధం కాదని చెప్పారు. ఈ విధంగా ప్రవాసులు తమ విధేయత, బాధ్యతలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతీయుల డీఎన్ఏలోనే ఉందని భగవత్ అన్నారు. అమెరికాను ప్రస్తావించినప్పుడు బహుళత్వం అనే పదం వస్తుందని, అదే భారత్ గురించి మాట్లాడితే భిన్నత్వంలో ఏకత్వం అనే మాట వినిపిస్తుందని చెప్పారు. ఈ ఏకత్వం, భిన్నత్వం రెండూ భారత ప్రజల రక్తంలోనే ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. భిన్నత్వం కారణంగానే ఏకత్వం మరింత శోభాయమానంగా ఉంటుందని, కాబట్టి దానిని మనం ఉత్సవంలా జరుపుకోవాలని అన్నారు. స్వామి వివేకానంద చెప్పిన మాటలను ఉటంకిస్తూ, భిన్నత్వంలో ఏకత్వం అనే సూత్రాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే భారత్ విధి అని తెలిపారు. తన ప్రసంగంలో భగవత్ పలు తాత్విక అంశాలను కూడా ప్రస్తావించారు. భౌతిక సుఖాలు తాత్కాలికమని, అవి శాశ్వతమైన సంతృప్తిని ఇవ్వలేవని అన్నారు. డోనట్స్ తినే ఉదాహరణను చెబుతూ ఒక దశలో ఎక్కువగా తిన్న తర్వాత వాటిపై ఆసక్తి పోతుందని, కానీ మళ్లీ కొంతకాలానికి తినాలనిపిస్తుందని వివరించారు. భౌతిక ఆనందం మితిమీరితే సంతృప్తినివ్వడంలో విఫలమవుతుందని చెప్పారు. దేహాలు, వస్త్రధారణ, పూజా విధానాలు వేరైనా మానవులంతా ఒకే ఆధ్యాత్మిక సూత్రంతో ముడిపడి ఉన్నారని అన్నారు. డబ్బు సంపాదన, భౌతిక విజయాలే జీవితంలో అంతిమ లక్ష్యాలు కాదని హితవు పలికారు.

# సంక్షిప్త వార్తలు

## పంజాబ్ ఆప్ నేత దారుణ హత్య



**అమృత్‌సర్, ఆగస్టు 30:** పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. ఫిరోజ్‌పూర్ జిల్లా మమ్‌దోత్ పట్టణంలో గుర్‌ప్రీత్‌సింగ్ గోపి అనే నేతను దుండగులు కాల్చి చంపారు. నిన్న చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రాజకీయ కక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. గుర్‌ప్రీత్ సింగ్ తన స్నేహితుడు హార్‌ప్రీత్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, కారులో వచ్చిన దుండగులు, గుర్‌ప్రీత్ బైక్‌ను వెంబడించి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన గుర్‌ప్రీత్ అక్కడికక్కడే మృతి చెందారు.

## మృత్యుంజయి ఆరేళ్ల బాలిక

**ఖాట్మండు, ఆగస్టు 30:** నేపాల్‌లో సంభవించిన ఘోర వరదల్లో ఒక అద్భుతం చోటుచేసుకుంది. హిమాలయ దేశాన్ని అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల కారణంగా 650 మందికి పైగా మరణించిన విషయం తెలిసిందే. ఈ విపత్తు జరిగిన మూడు రోజుల తర్వాత, రసూవా జిల్లాలో మట్టి,శిథిలాల కింద చిక్కుకున్న ఆరేళ్ల బాలికను రెస్క్యూ సిబ్బంది ప్రాణాలతో కాపాడారు. రసూవా జిల్లాలోని టిమురే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. భోటే కోశి నదికి వచ్చిన వరదల వల్ల గల్లంతైన వారి కోసం ఆర్మ్‌డ్ పోలీస్‌ఫోర్స్ బృందం శుక్రవారం గాలిస్తుండగా, శిథిలాల కింద నుంచి చిన్నారిఏడుపులు వినిపించాయి. వెంటనే ఆ బాలికను సురక్షితంగా బయటకు తీశాయి.



## హర్మూజ్‌లో ఇప్పటికీ కదలని నౌకలు

**టెహ్రాన్,ఆగస్టు 30:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హార్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400నౌకలు, వాటిలోని దాదాపు 6వేల మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ వెల్లడించింది. ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు.

## రేవ్‌పార్టీపై కాల్పులు..ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు



**జ్యూరిచ్, ఆగస్టు 30:** స్విట్జర్లాండ్లో దారుణం జరిగింది. ఒక రేవ్ పార్టీపై కాల్పులు జరపడంతో ఒకరు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన నార్తర్న్ స్విట్జర్లాండ్‌లోని అరావు ప్రాంతంలో ఆదివారం వేకువఝామున జరిగింది. ఆరావు ప్రాంతంలోని ఒక రేస్ కోర్సులో అరావు రేవ్ వాల్యూమ్ 7 పేరుతో ఒక స్విట్జర్లాండ్ ఈవెంట్ కంపెనీ రేవ్ పార్టీ ఏర్పాటు చేసింది. దీనికి దాదాపు 3,500 మంది వరకు హాజరయ్యారు. అయితే, ఒక గుర్తు తెలియన వ్యక్తి వేకువఝామున ఈవెంట్‌లో పాల్గొన్న వ్యక్తులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఒక వ్యక్తి అక్కడే మరణించాడు.



## మెస్సీ అభిమానులకు సువేందు ఊరట

**కోల్‌కత్తా, ఆగస్టు 30:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ కార్యక్రమానికి హాజరై తీవ్రనిరాశకు గురైన అభిమానులకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి భారీ ఊరట కల్పించారు. గతేడాది గందరగోళం మధ్య జరిగిన ఈవెంట్‌కు టికెట్లు కొనుగోలు చేసిన సుమారు 33,000 మంది అభిమానులకు వారి డబ్బును తిరిగి చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర క్రీడా బడ్జెట్ నుంచి ఈ నిధులను వాపస్ ఇచ్చే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్టు సీఎం వెల్లడించారు.

## రష్యాకు ముడిచమురు ఎగుమతిచేస్తున్న భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** అంతర్జాతీయ ఇంధనమార్కెట్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడిచమురుకోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని చమురు రిఫైనరీలు తీవ్రంగా దెబ్బతినడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఏర్పడిన తీవ్రమైన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా, భారత్ నుంచి పెట్రోల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వోర్టెక్సా నివేదిక ప్రకారం గతరెండు నెలల్లో రష్యా రిఫైనరీలపై సుమారు 32 సార్లు డ్రోన్ దాడులు జరిగాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్ ఉత్పత్తి ఏకంగా 70 పడిపోయింది. ఫలితంగా రష్యాలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి.

ఆట

### ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో
# ఛాంపియన్‌గా తన్వి పత్రి

**ఇండోనేషియా:** భారత్‌కు చెందిన వర్ధమాన టీనేజర్ తన్వి పత్రి ఆదివారం ఇండోనేషియాలో జరిగిన పొంటియానాక్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో తన తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్‌ను కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. 15 ఏళ్ల ఈ బాలిక మహిళల సింగిల్స్ ఫైనల్‌లో తన దక్షిణ కొరియా ప్రత్యర్థి మిన్ సన్ కిమ్‌ను కేవలం 32 నిమిషాల్లోనే 21-5, 21-6 తేడాతో చిత్తుగా ఓడించి, తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకుంది. ఇక మాజీ ఆసియా అండర్15 ఛాంపియన్



ఈ ఏడాది కొన్ని మంచి ఫలితాలు సాధించింది. ఛాలెంజర్ సర్క్యూట్‌లో నాలుగు ఫైనల్స్‌కు చేరుకుని, ఇప్పుడు ఇండోనేషియాలో ఒక టైటిల్‌ను గెలుచుకుంది. ఈ ఏడాది ఆమె ఇండియన్ నేషనల్స్ ఫైనల్‌కు కూడా చేరుకుని, సూర్య తమిరి చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయి, భారతదేశపు అత్యంత పిన్న వయస్కురాలైన జాతీయ ఛాంపియన్‌గా నిలిచే అవకాశాన్ని కోల్పోయింది. అయితే, భారత బ్యాడ్మింటన్ సమాజంలో ఆమె ప్రతిభకు విస్తృత గుర్తింపు లభించింది. అంతేకాక సీనియర్ క్రీడాకారిణి పీవీ సింధు కూడా తన కొన్ని సోషల్ మీడియా పోస్టులలో ఆమెను భారత బ్యాడ్మింటన్ భవిష్యత్తు అని అభివర్ణించారు. మరోవైపు, పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో స్వదేశీ ఆటగాడైన రిచీ రిచర్డ్ చేతిలో 22-24, 19 -21 తేడాతో ఓడిపోయిన భారత ఆటగాడు గిన్‌పాల్ సోన్నా రన్నరప్‌గా నిలిచాడు.

# స్క్వాష్ ఛాలెంజర్‌లో అభయ్‌కు టైటిల్

**మలేసియా:** భారత నంబర్ 1 అభయ్ సింగ్ ఆదివారం మలేషియాలోని నెగెరి సెంబిలాన్‌లో ఆదివారం జరిగిన తువాంకు ముహ్రిజ్ ట్రోఫీలో విజయం సాధించడం ద్వారా పిఎస్‌ఎ సర్క్యూట్‌లో తన కెరీర్‌లో 13వ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. టాప్ సీడెడ్ అభయ్ తన



మంచి ఫామ్‌ను కొనసాగిస్తూ, హాంగ్ కాంగ్‌కు చెందిన హెన్రీ లువాంగ్‌ను ఐదు గేమ్‌లలో 11-7, 6-11, 3-11, 11-5, 12-10 తేడాతో ఓడించి, ఈ 15కె పిఎస్‌ఎ ఛాలెంజర్ టైటిల్‌ను సాధించాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో 1-2తో వెనుకబడిన భారత స్టార్, చివరి రెండు గేమ్‌లను గెలిచి మలేషియాలో విజయం సాధించి, తన కెరీర్‌లో మరో ఘనతను చేర్చుకున్నాడు. టాప్ సీడ్ అయినప్పటికీ, అభయ్ టోర్నమెంట్ అంతటా తీవ్రమైన సవాలును ఎదుర్కొన్నాడు. ఫైనల్‌కు చేరే క్రమంలో అతను మూడు కఠినమైన మ్యాచ్‌లు ఆడాడు. వాటిలో హెన్రీ అతడిని చివరి వరకు తీవ్రంగా శ్రమించేలా చేశాడు. అతను మలేషియాకు చెందిన లో వా సెర్న్, మహమ్మద్ షఫిక్ కమల్‌లపై నాలుగు గేమ్‌ల చొప్పున రెండు విజయాలతో తన ప్రచారాన్ని ప్రారంభించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో, అతను మరో మలేషియన్ ప్రత్యర్థి అమీషెన్‌రాజ్ చందరన్‌తో జరిగిన 72 నిమిషాల సుదీర్ఘ మ్యాచ్‌లో గెలిచి, తృటిలో గట్టెక్కాడు. ప్రపంచ 24వ ర్యాంకర్ అయిన అభయ్‌కి రెండు నెలల తర్వాత ఇది మొదటి ఈవెంట్.



### ఆసియా రగ్బీ సెవెన్స్
# టాప్6లో భారత్ మహిళలు
### చివరి స్థానంలో పురుషుల జట్టు

**చైనా:** ఆసియా రగ్బీ సెవెన్స్‌లో భారత మహిళలు వరుసగా మూడోసారి టాప్6లో స్థానం దక్కించుకున్నారు. ఆదివారం చైనాలో జరిగిన 2026 ఆసియా రగ్బీ సెవెన్స్ సిరీస్ సీజన్ ఆరంభ టోర్నమెంట్ మొదటి దశలో భారత మహిళల రగ్బీ సెవెన్స్ జట్టు 6వ స్థానంలో నిలిచింది. ఐదవ స్థానం కోసం జరిగిన హోరాహోరీ ప్లేఆఫ్ మ్యాచ్‌లో కజకిస్తాన్ చేతిలో 12-17 తేడాతో ఓడిపోయిన భారత్, ఈ టోర్నమెంట్‌లో తమ అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకునే అవకాశాన్ని కోల్పోయింది. మొత్తం మీద, గత సంవత్సరం ఈ ఈవెంట్‌కు ప్రమోట్ అయినఅమ్మాయిలు స్థిరమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. గత సంవత్సరం రెండుసార్లు 6వ స్థానంలో నిలిచిన తర్వాత, ఇప్పుడు ఈ సిరీస్‌లో వరుసగా మూడవసారి టాప్‌సిక్స్‌లో స్థానం సంపాదించారు. అయితే, ఈ మూడు మ్యాచ్‌లలోనూ భారత్ అనుభవజ్ఞులైన కజఖ్ జట్టును అధిగమించడంలో విఫలమై, అదే 5వ స్థానం కోసం జరిగిన ప్లేఆఫ్ మ్యాచ్‌లలో వారి చేతిలో ఓడిపోయింది. భారత జట్టు ఇప్పుడు అక్టోబర్‌లో శ్రీలంకలో జరిగే రెండో దశలో మరియు వచ్చే నెల జపాన్‌లో జరిగే ఆసియా క్రీడలలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. ఇదిలా ఉండగా, 16 ఏళ్ల తర్వాత ఈ ఏడాది అగ్రశ్రేణిలోకి తిరిగి వచ్చిన భారత పురుషుల జట్టుకు ఆరంభం కష్టంగా సాగి, 12 జట్ల పురుషుల పోటీలో చివరి స్థానంలో నిలిచింది. వారు సింగపూర్‌తో జరిగిన 9 నుండి 12వ స్థానం కోసం జరిగిన చివరి అర్హత మ్యాచ్‌లో తమ మొదటి మరియు ఏకైక విజయాన్ని నమోదు చేసుకున్నారు, కానీ ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన ముఖాముఖి రికార్డులో వెనుకబడటం వల్ల చివరి స్థానంలో నిలిచారు.

# 7 పరుగులకే ఆలౌట్

### 10 రన్స్‌కే కుప్పకూలిన జట్లు
### టీ20 చరిత్రలోనే అత్యంత దారుణ స్కోర్లు




**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ అనగానే మనకు గుర్తొచ్చేవి ధనాధన్ సిక్సర్లు, మెరుపు అర్ధశతకాలు, ఫోర్ల వర్షం. కానీ, ఈ ఫాస్ట్ ఫార్మాట్లో బ్యాటర్ల వీరబాదుడు మాత్రమే కాదు, ఒక్కోసారి ఊహించని స్థాయిలో టీమ్‌లు కుప్పకూలుతుంటాయి. భారీ షాట్లతో విరుచుకుపడదామని మైదానం లోకి అడుగుపెట్టిన జట్లు, పరుగుల వేట పక్కనబెట్టి క్రీజులో నిలదొక్కుకోవడానికే అష్టకష్టాలు పడిన అత్యల్ప స్కోర్లకే ఆలౌటై దారుణమైన రికార్డులను మూటగట్టుకున్నాయి. ఈ జాబితాలో అందరికంటే అగ్రస్థానంలో నిలిచి అత్యంత దారుణమైన రికార్డును తన పేరిట లిఖించుకుంది ఐవరీ కోస్ట్. 2024 నవంబర్ 24న నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్యఛేధనకు దిగిన ఐవరీ కోస్ట్ బ్యాటర్లు కనీసం దశాంశం దాటలేకపోయారు. ప్రత్యర్థి బౌలర్ల దాటికి కేవలం 7.3 ఓవర్లలోనే చేతులెత్తేసి 7 పరుగులకే ఆలౌట్ అయ్యారు. 0.93 సగటు రన్ రేట్తో నమోదైన ఈ స్కోరు, అంతర్జాతీయ టీ20 చరిత్రలోనే అత్యల్ప టీమ్ స్కోరుగా మిగిలిపోయింది. ఇకరెండో అత్యల్ప స్కోరురికార్డును ఇద్దరు పంచుకున్నారు. అందులో ఒకటి మంగోలియా కాగా, మరొకటి ఐల్ ఆఫ్ మ్యాన్. 2024 సెప్టెంబర్ 5న సింగపూర్‌తో జరిగిన మ్యాచ్లో టాస్ గెలిచి తొలి బ్యాటింగ్ చేసిన మంగోలియా, ప్రత్యర్థి బౌలింగ్ ధాటికి నిలవలేక 10 ఓవర్లలో సరిగ్గా 10 పరుగులకే కుప్పకూలింది. ఇలాంటి ఘటనే 2023 ఫిబ్రవరి 26న స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ పునరావృతమైంది. స్పెయిన్ సంచలన బౌలింగ్‌కు ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు క్యూ కట్టింది. 8.4 ఓవర్లలో కేవలం 10 పరుగులకే ఆలౌట్ కాగా, ఆ చిన్న లక్ష్యాన్ని స్పెయిన్ అత్యంత సులువుగా ఛేదించింది. మంగోలియాకు టీ20 ప్రయాణం అస్సలు కలిసిరావడం లేదనడానికి ఈ జాబితాలో ఆ జట్టు మరోసారి కనిపించడమే నిదర్శనం. 2024 మే 8న జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన మంగోలియా, 8.2 ఓవర్లలో కేవలం 12 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

అటు ఐవరీ కోస్ట్ కూడా మరోసారి ఈ దారుణ రికార్డుల జాబితాలో తన పేరు నమోదు చేసుకుంది. 2026 మే 24న రువాండాతో జరిగిన పోరులో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఐవరీ కోస్ట్, ఒక్కో పరుగు కోసం అల్లాడిపోయింది. 15.2 ఓవర్ల పాటు పోరాడినప్పటికీ బోర్డుపై కేవలం 17 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో రువాండా ఏకపక్షంగా విజయాన్ని అందుకుంది.




### ఎమ్‌ఎల్‌ఎస్ లీగ్‌లో ఇంటర్ మయామి
# ఘన విజయం
### మాంట్రియల్ 7-1తో ఓటమి


**మయామి:** లియోనెల్ మెస్సీ రెండవ అర్ధభాగంలో మూడు గోల్స్ చేసి, ఎమ్‌ఎల్‌ఎస్ లీగ్‌లో తన తొలి నాలుగు గోల్స్ ప్రదర్శనను పూర్తి చేయడంతో పాటు, ఒక అసిస్ట్ కూడా అందించాడు. దీంతో ఇంటర్ మయామి, ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా చేసే అవకాశం ఇవ్వకుండా ఆరు గోల్స్ చేసి, సిఎఫ్ మాంట్రియల్ పై 7-1 తేడాతో ఘన విజయం సాధించింది. 40వ నిమిషంలో మెస్సీ ఫ్రీ కిక్ ద్వారా 15వ సారి గోల్ చేసి, 1-1తో ఉన్న స్కోరును అధిగమించాడు. ప్రస్తుత గోల్డెన్ బూట్ అవార్డు విజేత, లీగ్ ఎమ్‌విపి అయిన అతను 52వ నిమిషంలో గోల్ చేసి 3-1 ఆధిక్యాన్ని అందించాడు. ఈ సీజన్లో అతని 17వ, 18వ గోల్స్‌ను అతను 83వ నిమిషంలో, స్టాపేజ్ టైమ్లోని ఆరవ నిమిషంలో సాధించాడు. చివరి గోల్ కూడా ఫ్రీ కిక్ ద్వారానే వచ్చింది. గోల్స్ రేసులో మెస్సీ, ఎఫ్‌సి డల్లాస్‌కు చెందిన పెటార్ మూసా కంటే రెండు గోల్స్ వెనుకబడి ప్రారంభించాడు. 20వ నిమిషంలో టెలాస్కో సెగోవియా ఇచ్చిన కార్నర్ కిక్‌ను కార్లోస్ కాసిమిరో హెడర్తో గోల్‌గా మలిచి ఇంటర్ మయామికి 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ సీజన్లో ఫాబియన్ హెర్బర్స్ చేసిన మొదటి గోల్తో, 37వ నిమిషంలో మాంట్రియల్ స్కోరును సమం చేసింది.

80వ నిమిషంలో మెస్సీ అందించిన 10వ అసిస్ట్తో లూయిస్ సువారెజ్ తన 11వ గోల్ చేసి స్కోరును 4-1కి చేర్చాడు. ఆ తర్వాత, 18 ఏళ్ల కొత్త ఆటగాడు అలెగ్జాండర్ షా, మూడు మ్యాచ్‌లో 37 నిమిషాలు ఆడిన తర్వాత తన మొదటి గోల్ను 89వ నిమిషంలో సాధించి స్కోరును 6-1కి చేర్చాడు. ఇంటర్ మయామి తరఫున డేన్ సెయింట్ క్లెయిర్ మూడు సేవ్స్‌తో ముగించాడు. 81వ నిమిషంలో పెనాల్టీ కిక్తో సువారెజ్ ఆ విజయాన్ని అందించాడు.

# దేశీయ స్టాక్ మార్కెట్లో కీలక పరిణామాలు!
### ఇన్వెస్టర్లు మరింత అప్రమత్తం




**ముంబయి, ఆగస్టు 30:** దేశీయ, అంతర్జాతీయ స్థూల ఆర్థిక గణాంకాలు, ప్రైమరీ మార్కెట్ పరిణామాలు, కంపెనీల కార్పొరేట్ చర్యలు, ప్రపంచ మార్కెట్ల సంకేతాల నేపథ్యంలో వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది. ముఖ్యంగా నెలవారీ ఆటో విక్రయాల గణాంకాలు ఆయా ఆటో కంపెనీల షేర్లపై ప్రభావం చూపనున్నాయి. అమెరికా, ఆసియా మార్కెట్లలోని పరిణామాలు వివిధ రంగాల షేర్ల కదలికలను నిర్దేశించనున్నాయి. కంపెనీల బోర్డురూమ్‌ల నుంచి వెలువడే కార్పొరేట్ పరిణామాలు కూడా కొన్ని నిర్దిష్ట షేర్లలో ట్రేడింగ్ వాల్యూమ్‌లను ప్రభావితం చేయవచ్చు. మరోవైపు అమెరికాఇరాన్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మధ్యప్రాచ్య పరిణామాలు అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలపై ప్రభావం చూపడం కొనసాగించవచ్చు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల ట్రేడింగ్ కార్యకలాపాలు కూడా మార్కెట్ మొత్తం దిశను ప్రభావితం చేయనున్నాయి. దేశీయ మార్కెట్ పరిస్థితిశుక్రవారం దేశీయ ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలుసెన్సెక్స్, నిఫ్టీ50 స్వల్పంగా లాభపడ్డాయి. కొత్త క్లోజింగ్‌ఆక్షన్ విధానంపై ఆందోళనల కారణంగా వరుసగా మూడో వారాన్నినష్టాలతో ముగించాయి. 5నెలల్లో ఇదేఅత్యంత సుదీర్ఘమైన వారపు నష్టాల పరంపర. శుక్రవారం నిఫ్టీ 50 0.35 శాతం పెరిగి 24,175.65 పాయింట్లవద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 0.43% లాభపడి 77,264. 51 పాయింట్ల వద్ద స్థిరపడింది. అమెరికా చిప్ తయారీ సంస్థ ఎన్విడియా త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడంతో ఐటీ షేర్లకు మద్దతు లభించింది. దీంతో నిఫ్టీ ఐటీ సూచీ 3.5 శాతం ఎగబాకింది. మొత్తం వారాన్ని పరిశీలిస్తే నిఫ్టీ, సెన్సెక్స్ వరుసగా 0.3%, 0.4% నష్టపోయాయి. మరోవైపు దేశీయ చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లు ఒక్కొక్కటి 0.5 శాతం చొప్పున లాభపడ్డాయి. కంపెనీల మెరుగైన ఆర్థిక ఫలితాలు, క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం, దేశీయ ఇన్వెస్టర్ల నుంచి కొనసాగుతున్న పెట్టుబడులు వీటికి మద్దతుగా నిలిచాయి. వచ్చే వారం దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు, ఆటో విక్రయాలు, అంతర్జాతీయ మార్కెట్ల పరిణామాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు డీస్ట్రీట్‌పై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.




**ముంబయి,ఆగస్టు 30:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త ఎండిసిఇఒ పోస్టుకు ఇద్దరు అంతర్గత అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. బ్యాంక్ సీనియర్ అధికారులు కైజాద్ భరూచా, జిమ్మీ టాటా పేర్లను పరిశీలిస్తున్నట్లు తేలింది. బ్యాంక్ నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు అవసరమైతే బయటి అభ్యర్థులను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ ఇద్దరు అంతర్గత అభ్యర్థుల పేర్లను బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి తెలియజేసి ంది. అయితే ఈ విషయంపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. కైజాద్ భరూచా గత 12 ఏళ్లుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డులో కొనసాగుతున్నారు. బ్యాంకింగ్ నియంత్రణ నిబంధనల ప్రకారం ఒక డైరెక్టర్ బ్యాంక్ బోర్డులో గరిష్ఠంగా 15 ఏళ్ల వరకు మాత్రమే కొనసాగవచ్చు. దీంతో సీఈఓగా భరూచాను నియమించేందుకు ఆర్‌బీఐ నుంచి ప్రత్యేక అనుమతి అవసరం కావచ్చని తెలుస్తోంది. మరోవైపు జిమ్మీ టాటా ఇటీవల బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్‌గా తన పదవీకాలాన్ని పొడిగించు కున్నారు. ఆయన 1994 నుంచి వివిధ హోదాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. అక్టోబర్ 26న తప్పుకోనున్న జగదీశన్‌ప్రస్తుత ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ మరోసారి పదవిలో కొనసాగేందుకు ఆసక్తి చూపకపోవడంతో తదుపరి సీఈఓ ఎంపిక ప్రక్రియను బ్యాంక్ బోర్డు వేగవంతం చేసింది. జగదీశన్ అక్టోబర్ 26న తన పదవి నుంచి తప్పుకోనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. తనను మరోసారి ఎండీసీఈఓగా నియమించాలన్న ప్రతిపాదనను పరిశీలించవద్దని జగదీశన్ నిర్ణయించుకున్నారని బ్యాంక్ తెలిపింది. ఈ ఏడాది మార్చిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అటాను చక్రవర్తి అనూహ్యంగా రాజీనామా చేయడం ఈ చర్చలకు మరింత ఊతమిచ్చింది. బ్యాంక్‌లో నైతికత, పాలన (గవర్నెన్స్)కు సంబంధించిన ఆందోళనలను కారణాలుగా పేర్కొంటూ చక్రవర్తి తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామం నేపథ్యంలో తదుపరి సీఈఓ ఎంపికపై బ్యాంకింగ్ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# టిమ్‌కుక్ హయాంలో 28 రెట్లు యాపిల్‌షేర్లు ర్యాలీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** యాపిల్ కేవలం మార్కెట్ విలువలోనే కాకుండా వాల్‌స్ట్రీట్ ట్రేడర్ల దృష్టిలోనూ మరింత బలమైన స్థానాన్ని సంపాదించుకుంది. సంస్థ ప్రస్తుత సీఈఓ టిమ్ కుక్ పదవీకాలంలో యాపిల్ షేరు విలువ ఏకంగా 28 రెట్లకు పైగా పెరిగింది. 2011 ఆగస్టులో యాపిల్ షేరు ధర సుమారు 1114 డాలర్ల మధ్య ఉండేది. అప్పట్లో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 293 బిలియన్ డాలర్లుగా ఉంది. అయితే ఆ సమయంలో యాపిల్ పలు సవాళ్లను ఎదుర్కొంది. ముఖ్యంగా ఐఫోన్ 6, ఐఫోన్ 6 ప్లస్ ఫోన్లు ఎక్కువ ఒత్తిడికి గురైతే వంగిపోతున్నాయంటూ వెలుగులోకి వచ్చిన బెండ్‌గేట్ వివాదం కంపెనీకి పెద్ద ఇబ్బందిగా మారింది. పలుచటి అల్యూమినియం బాడీ కారణంగా బిగుతైన ప్యాంటు జేబులో ఉంచినప్పుడు కూడా ఫోన్లు వంగే అవకాశం ఉందంటూ వినియోగదారులు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ, యాపిల్ షేరు ఆ తర్వాత భారీగా పుంజుకుంది. 2011 ఆగస్టు నాటి ధర పరిధిలోని దిగువ స్థాయి నుంచి తాజా ముగింపు ధర 319.70 డాలర్లకు చేరే వరకు షేరు ఏకంగా 2,763 శాతం పెరిగింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ



రికార్డు స్థాయిలో 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎంసిరీస్ చిప్‌లతో కొత్త మలుపు2020 ప్రారంభం వరకు, కరోనా మహమ్మారి ప్రారంభానికి ముందు, యాపిల్ షేరు సుమారు 6070 డాలర్ల వద్ద ఉండేది. అదే సమయంలో కంపెనీ సొంతంగా అభివృద్ధి చేసిన ఎంసిరీస్ ప్రాసెసర్లను మార్కెట్లోకి తీసుకురావడం మరో కీలక మలుపుగా నిలిచింది. ఎం1 చిప్‌తో వచ్చిన మ్యాక్‌బుక్ ఎయిర్, మ్యాక్‌బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లు మార్కెట్లో సంచలనం సృష్టించాయి. ఎఆర్‌ఎం ఆర్కిటెక్చర్‌పై ఆధారపడిన ఈ ల్యాప్‌టాప్‌లు తేలికగా, పలుచగా ఉండటంతో పాటు అత్యుత్తమ బ్యాటరీ బ్యాకప్‌ను అందించాయి. దీంతో ఆయా విభాగాల్లో యాపిల్ ఆధిపత్యం మరింత బలపడింది. అదే సమయంలో మ్యాక్ కంప్యూటర్ల విషయంలో ఇంటెల్ చిప్‌లపై ఆధారపడటానికి కూడా కంపెనీ స్వస్తి పలికింది. 2021 ఆగస్టు నాటికి యాపిల్ షేరు 150 డాలర్ల స్థాయికి చేరింది. అంటే టిమ్ కుక్ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తొలి పదేళ్లలోనే షేరు ధర 13 రెట్లకు పైగా పెరిగింది. ఐఫోన్ తయారీదారు ఇతర ఉత్పత్తులపైనా దృష్టి సారించాడు.

వాణిజ్యం



# ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకున్నాం
### -కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**చికాగో,ఆగస్టు 30:** ద్రవ్యలోటు లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా చేరుకుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రుణాలు, అప్పుల స్థాయిపై వ్యక్తమవుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ ద్రవ్యలోటు స్థూల దేశీయోత్పత్తి లో 4.4 శాతంగా నమోదైంది. ఇది రూ.15.19 లక్షల కోట్లకు సమానం. ఫిబ్రవరిలో సవరించిన అంచనాల్లో నిర్దేశించిన మొత్తంలో ఇది 97.5 శాతంగా ఉంది. అమెరికా పర్యటనలో భాగంగా చికాగోలో భారతీయ ప్రవాసులతో మాట్లాడిన సీతారామన్ మాట్లాడుతూ ద్రవ్యలోటుపై మేము నిర్దేశించుకున్న ఆర్థిక క్రమశిక్షణ మార్గాన్ని పూర్తిచేశాం. సామాజిక సంక్షేమ పథకాలకు కేటాయించే నిధులను తగ్గించకుండా, మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ మూలధన వ్యయాన్ని తగ్గించకుండా ఈ లక్ష్యాన్ని సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి దేశ అప్పుజిడిపి నిష్పత్తిని 2030 నాటికి 50 శాతానికి తగ్గించడంపైనే ఉందని సీతారామన్ చెప్పారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ నిష్పత్తి 200 శాతానికి పైగా ఉన్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణపై ప్రపంచానికి ఉన్న విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతీయబోమని ఆమె అన్నారు. దీనివల్ల భారత్ క్రెడిట్ రేటింగ్‌లు కూడా మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం, టారిఫ్ వివాదాలు, హార్ముజ్ జలసంధిలో అడ్డంకులు వంటి ప్రపంచ సవాళ్లు ఎదురైనప్పటికీ భారత్ 7 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధిని కొనసాగించిందని సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ యూరియా ధరలు ఒక్కో బస్తాకు రూ.300 నుంచి రూ.3వేలు అంటే పది రెట్లు పెరిగాయని సీతారామన్ చెప్పారు. అదనపు భారాన్ని ప్రభుత్వం భరించి, ఒక్కో బస్తాకు రూ.2,700 సబ్సిడీ అందించిందని వివరించారు. ప్రపంచంలోని పలు అస్థిర సముద్ర మార్గాల్లో ప్రయాణించే నౌకలకు బీమా కవరేజీని అంతర్జాతీయ బీమా సంస్థలు ఉపసంహరించుకోవడంతో షిప్పింగ్ కంపెనీలకు బీమా ప్రీమియంలు భారీగా పెరిగాయని ఆమె చెప్పారు.

# టాప్10 సంస్థల్లో ఏడింటి మార్కెట్ విలువలు పతనం

**ముంబయి, ఆగస్టు 30:** దేశంలో అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఏడు సంస్థల సమిష్టి మార్కెట్ విలువ గత వారం రూ.1.13 లక్షల కోట్ల మేర క్షీణించింది. ప్రధానంగా భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువలో భారీ క్షీణత నమోదైంది. ఈక్విటీ మార్కెట్లలో కొనసాగిన బేరిష్ ట్రెండ్ ఇందుకు కారణమైంది. గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 276.32 పాయింట్లు లేదా 0.35 శాతం తగ్గగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 76.35 పాయింట్లు లేదా 0.31 శాతం క్షీణించింది. ప్రపంచ వడ్డీ రేట్లపై ఆందోళనలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ చుట్టూ నెలకొన్న అస్థిరత కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. దీంతో భారత ఈక్విటీ మార్కెట్లు అప్రమత్త ధోరణితో వారాన్ని ముగించాయి. ఇటీవల ప్రారంభమైన కరెక్షన్




దశ కూడా కొనసాగింది. అని రిలయన్స్ బ్రోకింగ్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చ్) అజిత్ మిశ్రా తెలిపారు. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.40,500.85 కోట్లు తగ్గి రూ.11,74,462.30 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.40,056.32 కోట్లు క్షీణించి రూ.17,38,119.27 కోట్లకు పడిపోయింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.11,558.35 కోట్లు తగ్గి రూ.11,09,600.70 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ రూ.10,086.05 కోట్లు తగ్గి రూ.6,70,535.57 కోట్లుగా నమోదైంది. ఎల్అండ్‌టీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,473.45 కోట్లు తగ్గి రూ.5,55,987.49 కోట్లకు చేరగా, ఎల్ఐసీ విలువ రూ.3,162.50 కోట్లు తగ్గి రూ.5,32,817.81 కోట్లకు పడిపోయింది. హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ స్వల్పంగా రూ.1,550.73 కోట్లు తగ్గి రూ.4,72,361.83 కోట్లకు చేరింది. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మార్కెట్ విలువను పెంచుకున్నాయి. టీసీఎస్ మార్కెట్ విలువ రూ.16,643.20 కోట్లు పెరిగి రూ.8,48,079.71 కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.4,475.28 కోట్లు పెరిగి రూ.10,22,805.73 కోట్లకు చేరగా, ఎస్‌బీఐ విలువ రూ.599.99 కోట్లు పెరిగి రూ.9,65,568.75 కోట్లుగా నమోదైంది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ వరుస స్థానాల్లో ఉన్నాయి.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం | సోమవారం 31 ఆగస్టు 2026 | I


## క్షుద్ర పూజల ఘటనలో పోలీసులు తీరుపై విమర్శలు !!!

**కాట్రేనికోన ఆగస్టు 30 (ప్రభాతవార్త)** డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రయానం సముద్ర తీరంలో ఈ నెల 25న రాత్రి జరిగిన క్షుద్ర పూజల కలకలం ఘటనలో పోలీసుల దర్యాప్తు తీరుపై స్థానిక ప్రజల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. క్షుద్ర పూజలు సంఘటనపై పోలీసు స్టేషన్లో చేపట్ట వలసిన విచారణ రాజకీయ నాయకుల ఒత్తిడితో రెండు రోజుల క్రితం ఒక ప్రముఖ నాయకుడు ఇంటి వద్ద ఆ గ్రామ పెద్దలకు, క్షుద్ర పూజల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు రాజీ సమావేశం జరిగిందనే ఆరోపణ ణలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిడితో పాటు కొంతమందికి ముడుపులు ముట్టడంతోపట్టుకున్న కారును వదిలేసి, మొక్కుబడిగా కేసు నమోదు చేసారనే విమర్శలు ఎక్కడికక్కడ ఊపందుకున్నాయి. పూజ కోసం వచ్చిన గుడాల అనురాధ అనే మహిళ చెప్పిన మాటలను చూస్తే ఆ రోజు అర్ధరాత్రి చిరయానంలో చేస్తున్నవి పూజలు క్షుద్ర పూజలే అని స్థానికులు అంటున్నారు. క్షుద్ర పూజల కోసం వచ్చిన వారు కొత్త ఎర్టీగా కారు ఎవరి పేరుతో ఉంది. పట్టుకున్న వారి ఫోన్ కాల్ డేటా సేకరించి, వారి సంభాషణ, పూజలు కోసం ఎక్కడినుంచి చిన్నారిని తెచ్చారనే గ్రామస్తుల ఆరోపణ ఎవరికోసం పూజలు చేసేందుకు వచ్చారు. చిన్నారి ప్రాణాలకు సంబంధించిన వంటి వివిధ ఆరోపణలుపై పోలీసులు స్పందించకపోతే సామాన్యులు రక్షణ కోసం ఎవరిని ఆశ్రయించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షుద్ర పూజలు చేసేందుకు వచ్చిన మహిళతో పాటు ఐదుగురు వ్యక్తులను పట్టుకుని ఎర్టీగా కొత్త కారుతో పాటు పూజా సామాగ్రితో వచ్చిన వారిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. రూ. 15 వేలు ఇస్తే పూజలు చేసేందుకు వచ్చానని సదరు మహిళ అడ్డుకున్న గ్రామస్తులకు చెప్పింది. క్షుద్ర పూజలు కోసం తెచ్చిన చిన్నారితో పాటు నలుగురు వ్యక్తులు తోటలో పారిపోయారని, కారులో కొబ్బరి కాయలు, పూజా సామాగ్రి ఉందని, కత్తి పట్టుకుని ఒక వ్యక్తి మోటారు సైకిల్ పై పారిపోయాడని స్థానికులు పోలీసులకు చెప్పారన్నారు. మర్నాడు స్థానికులు, పోలీసులు అక్కడకు వెళ్లగా భారీగా పూజా సామాగ్రి బయట పడింది. దట్టమైన తుమ్మ చెట్లు మధ్యలో క్షుద్ర పూజల కోసం తెచ్చిన కత్తి, రెండు పారలు, కొత్త బట్టలు, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరి కాయలు, పేలాలు, పేడ, తాళ్ళు, సంచులు తాటి కళ్ళు, కూల్ డ్రింక్, మంచి నీరు బాటిల్ ను గుర్తించారు. ఇంత తీవ్రమైన అంశంపై పోలీసుల ఉదాసీనత తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామమంతా భయం గుప్పెట్లో బ్రతుకుతున్నామని అంటున్నారు. దీనిపై ఎప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.







కాట్రేనికోన రెండోవ ఎస్సై సత్యనారాయణను వివరణ కోరగా" గూడాల అనురాధతో పాటు ఏడుగురుపై కేసు నమోదు చేసామని, పూజా సామాగ్రి దొరక లేదన్నారు. దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

# జాతీయ రహదారిపై 'దేవుడి' పార్కింగ్ దందా!

- **జాతీయ రహదారి216పై రుసుము వసూలుకు దేవాదాయ శాఖకు అధికారం ఉందా?**
- **జాతీయ రహదారి భూమి కేంద్ర ప్రభుత్వానిదే.. వేలం వేసే హక్కు ఎవరిది?**

**పిఠాపురం, ఆగస్టు 30 ( ప్రభాతవార్త )** పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో పార్కింగ్ రుసుము వసూలు వ్యవహారం ఇప్పుడు చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. కత్తిపూడి నుంచి గొల్లప్రోలు, పిఠాపురం, కాకినాడ మీదుగా కొనసాగుతున్న జాతీయ రహదారి-216పరిధిలో వాహనాలను నిలిపేందుకు దేవస్థానం అధికారులు వేలం నిర్వహించి ప్రైవేటు వ్యక్తులకు రుసుము వసూలు చేసే హక్కు ధారాధత్తం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలపడం వలన ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారు అన్న ప్రశ్న భక్తులలో తలెత్తుతోంది. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన కుక్కుటేశ్వర స్వామి, పూరుహూతిక అమ్మవారు(10వ శక్తిపీఠం )ని, దర్శించుకునేందుకు నిత్యం వేల సంఖ్యలో భక్తులు బస్సులు , కార్లలో వస్తున్నారు . ఈ నేపథ్యంలో జాతీయ రహదారి 216 సమీపంలోని దేవస్థానం ప్రహరీ గోడకు పెట్టిన బోర్డు ప్రకారం పార్కింగ్ రుసుములు వసూళ్లు చేస్తున్నారు. బస్సు కు, రూ 100, కారు రూ 30, ఆటో రూ 20, మోటార్ సైకిల్ రూ 10 చొప్పున ప్రతి నెల రూ. 3లక్షల నుంచి, రూ 4.లక్షలు వసూలు చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.




**జాతీయ రహదారి కేంద్ర ప్రభుత్వ పరిధి :**

ల్యాండ్ అండ్ ట్రాఫిక్ చట్టం 2002లోని సెక్షన్ 23 ప్రకారం కేంద్ర ప్రభుత్వం రహదారి కోసం సేకరించిన భూమి కేంద్ర ప్రభుత్వ ఆస్తిగా పరిగణించబడుతుందని ఈ సెక్షన్ స్పష్టం చేస్తోంది. అంతేకాకుండా జాతీయ రహదారి పరిధిలోని భూమిని 'హైవే ల్యాండ్'గా చట్టం చెబుతోంది. అదే చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం జాతీయ రహదారి భూమిని తాత్కాలిక వినియోగానికి లీజ్, లైసెన్స్ ఇవ్వగల అధికారం అధీకృత అధికారికి మాత్రమే ఉంది.

**దేవాదాయ చట్టం ఏం చెబుతోంది?**

మరోవైపు ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ యాక్ట్, 1987లోని సెక్షన్ 82 దేవస్థానానికి చెందిన ఆస్తుల లీజ్, లైసెన్స్ విషయంలో విధానాన్ని ప్రకటించింది. దేవస్థానానికిచెందిన ఆస్తి, దాని ప్రయోజనం కోసం ఇచ్చిన ఆస్తిపై లీజ్, లైసెన్స్ మంజూరు చేసే అధికారం, విధానం, కాలపరిమితి నిబంధనల ప్రకారమే ఉండాలని ఈ సెక్షన్ చెబుతోంది.

**జాతీయ రహదారిపై రుసుము వసూలు చేసే అధికారం ఎవరిది?**

జాతీయ రహదారుల చట్టం, 1956లోని సెక్షన్ 7 జాతీయ రహదారుల వినియోగానికి సంబంధించిన నిర్దిష్ట ఫీజుల విధింపును కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తుంది. ఆ సెక్షన్ కింద ఫీజుల విధింపు, వసూలు విధానం కేంద్ర ప్రభుత్వం రూపొందించే నిబంధనలకు లోబడి ఉంటుంది. సెక్షన్ 9 కేంద్ర ప్రభుత్వానికి సంబంధిత నిబంధనలు రూపొందించే అధికారాన్ని ఇస్తుంది. అందువల్ల జాతీయ రహదారిపై సాధారణంగా 'పార్కింగ్ ఫీజు' పేరుతో ఎవరైనా రుసుము వసూలు చేస్తున్నారంటే, ఆ రుసుముకు ఏ చట్టం ఆధారం? ఎవరు అనుమతి ఇచ్చారు? భూమి యాజమాన్యం ఎవరిది? హైవే అథారిటీ లైసెన్స్ ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు తప్పనిసరిగా ఉండాలి.



**'వేలం' చెల్లుతుందా?**

దేవస్థానం అధికారులు వేలం నిర్వహించారనే కారణంతోనే ఆ స్థలంపై వారికి యాజమాన్య హక్కు వచ్చేయదు. ముందుగా ఆ స్థలం దేవస్థాన ఆస్తిగా నమోదై ఉందని, అది జాతీయ రహదారి భూమిలో భాగం కాదని సంబంధిత రికార్డులతో నిర్ధారించాలి.

**రికార్డులు బయటపెట్టాల్సిందే :**

అందుకే పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం అధికారులు నిర్వహించిన పార్కింగ్ వేలానికి సంబంధించి స్థలానికి సంబంధించిన పట్టాదారు,అడంగల్, ఇతర హక్కు రికార్డులు, సర్వే నంబర్, హైవే భూసేకరణ రికార్డులు, జాతీయ రహదారి 216కు సంబంధించిన హద్దులు, జాతీయ రహదారుల శాఖఅనుమతి, వేలం నోటిఫికేషన్, లైసెన్స్ నిబంధనలు, వసూలు చేసిన మొత్తాల వివరాలు బహిర్గతం చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

## రూ.6.25 కోట్ల సీజీఎఫ్ నిధులతో నిర్మించిన నూతన వకుళమాత అన్నదాన భవనాన్ని
# ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి, భూపతిరాజు శ్రీనివాస వర్మ...

- **తిరుమల తరహాలో వాడపల్లి దివ్యక్షేత్రం అభివృద్ధి...**
- **ప్రసాద్ స్కీమ్ ద్వారా కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు కృషి: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ..**
- **టెంపుల్ సిటీగా వాడపల్లి అభివృద్ధికి ప్రణాళిక: ఎమ్మెల్యే బండారు.**

**ఆత్రేయపురం, ఆగస్టు 30,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపల్లి క్షేత్రాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రూ. 6. 25 కోట్ల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులతో నిర్మించిన నూతన వకుళమాత అన్నదాన భవనాన్ని ఆదివారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వాడపల్లి ఆలయం ఒక్క కోనసీమ ప్రాంతానికే పరిమితమైన క్షేత్రం కాదని, దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదానం అన్ని దానాలకంటే గొప్పదని, స్వామివారి దర్శనానికి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఇంత భారీ స్థాయిలో అన్నదాన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నూతన భవనంలో ఒకేసారి సుమారు 2,000 నుంచి 2,500 మంది భక్తులు భోజనం చేసే సౌకర్యం ఉందని తెలిపారు. ఆధునిక వంట పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసే సామర్థ్యం కల్పించారని పేర్కొన్నారు. వాడపల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని 'ప్రసాద్' (గ్రా=ూూూణ) స్కీమ్ ద్వారా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఈ విషయంపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వాడపల్లి ఆలయానికి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్, టీటీడీ నుంచి కూడా నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. దేవుడికి మనం దానం చేస్తున్నామనే భావన కాకుండా, మనకు లభించిన సంపదలో కొంత భాగాన్ని భగవంతుడికి సమర్పించుకునే అవకాశం కల్పించడం కూడా ఆయన అనుగ్రహమేనని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.



**పెరిగిన ఆలయ ఆదాయం..**

ప్రస్తుత పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగిందని కేంద్ర మంత్రి తెలిపారు. గతంలో శనివారం టికెట్ల ద్వారా సుమారు రూ.30 లక్షల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం అది సుమారు రూ.కోటికి చేరిందని చెప్పారు. అలాగే గతంలో నెలకు సుమారు రూ.కోటి ఉన్న హుండీ ఆదాయం ప్రస్తుతం రూ.2 కోట్లకు చేరిందని వెల్లడించారు. భక్తుల్లో ఆలయంపై పెరిగిన నమ్మకం, విశ్వాసమే ఆదాయం పెరగడానికి ప్రధాన కారణమన్నారు.

**టెంపుల్ సిటీగా వాడపల్లి...**

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ వాడపల్లి క్షేత్రం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. స్వామివారిని దర్శించుకుని సేవించిన భక్తుల కోరికలు నెరవేరుతున్నాయనే విశ్వాసంతో లక్షలాది మంది భక్తులు వాడపల్లికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తుల సంఖ్య దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, వాడపల్లిని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందుతున్నట్లు చెప్పారు.

**రూ.8 కోట్లతో ఏటిగట్టు రహదారి...**

వాడపల్లి అభివృద్ధిలో భాగంగా భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యవంతమైన రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరిన వెంటనే రూ.6 కోట్లను ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారని చెప్పారు. రావులపాలెం నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లి వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.6 కోట్లతో పాటు రుడా నిధులు రూ.1 కోటి, పుష్కర నిధులు రూ.1 కోటి కలిపి మొత్తం రూ.8 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు బండారు సత్యానందరావు వెల్లడించారు.

**అన్నదాన భవనానికి దాతల సహకారం...**

నూతన వకుళమాత అన్నదాన భవనంలో సుమారు రూ.1.5 కోట్లతో ఆధునిక కిచెన్, భక్తులు కూర్చుని భోజనం చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసిన పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సమంతపూడి శ్రీరామరాజు, ఆయన బృందాన్ని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరో రూ.50 లక్షల సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చినందుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు





తెలిపారు. వాడపల్లి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఆలయ పాలకమండలి సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి,దేవాదాయ శాఖ కమిషనర్, రామ చంద్రమోహన్, ఆర్ జె సి , వేంద్ర త్రినాధ రావు, ఆకుల రామకృష్ణ, కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, యాళ్ల దొరబాబు, తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, బారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.





# భక్తిశ్రద్ధలతో సత్య విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సత్య ప్రభ**
**ఆలయంలో భారీ అన్నదానం**

**శంకవరం ఆగస్టు 30 ప్రభాతవార్త** మండల కేంద్రమైన శంకవరంలో గల కృష్ణాలయం వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ సత్య విజయ దుర్గ భవాని ఆలయం భక్తిశ్రద్ధలతో ప్రారంభోత్సవం నిర్వహించారు. దుగ్గదురు గ్రామ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మంగళ వాయిద్యాలు మధ్య ఆలయ ధర్మకర్త కారుకొండ శ్రీను శ్రీమతి గంగాభవాని దంపతుల తో పాటు మరో పదిమంది దంపతుల చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు అభిషేకాలు, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి, దంపతులు చేత సామూహిక కుంకుమార్చనములు శాంతి హోమం, కళా హోమములు, నీరాజనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిపాదు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో అమ్మవారి ఆలయ నిర్మాణం ఎంతో సంతోషాన్నిస్తుందని, ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆమెకు అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పర్వత సురేష్ ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో సి బి ఎన్ ఆర్మీ నాయకులు ఏళ్ల జగదీష్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ బద్ది రామారావు రాజ్యలక్ష్మి భాస్కరరావు గొల్లపల్లి బుజ్జి సూరిబాబు బొమ్మిడి సత్తిబాబు బుర్ర వాసు తలపంటి బుజ్జి ఈగల దేవుళ్ళు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు





# సారు ఆపండి అన్నా వినలేదు...

**రోజు ఇదే పరిస్థితి - ఆర్టీసీ బస్ డ్రైవర్, కండక్టర్ తీరు**
**బస్ పాస్ ఉన్నా సర్వీస్ ఆటోలు దిక్కు - విద్యార్థుల ఆవేదన**

**ఎటపాక : ఆగస్టు 29 (ప్రభాత వార్త):** అప్పటికే ఆలస్యం అయింది. పాఠశాల సమయం ముగియడంతో విద్యార్థందరూ ఆర్టీసీ బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. బస్ వచ్చిన వెంటనే ఎక్కి ఇంటికి వెళ్ళాలని, ఆశగా ఎదురుచూస్తున్న వారికి నిరాశ ఎదురైంది. బస్ ఆగినప్పటికీ ఇద్దరు ముగ్గురు ఎక్కిన వెంటనే వెళ్ళడానికి డ్రైవర్ కదుపుతున్నాడు. దీంతో కింద ఉన్న విద్యార్థులందరూ గట్టిగా కేకలు పెడుతూ డ్రైవర్ సర్, కండక్టర్ సర్ వెనుక ఖాళీగా ఉంది కొంచం ఆపండి ఎక్కి వెనక్కి వెళ్తాం అంటూ గోడు వినిపించారు. తోటపల్లి బస్టాండ్ దగ్గర శనివారం జరిగిన ఈ ఘటన అందరినీ ఆవేదనకు గురి చేసింది. ఐనప్పటికీ కనీసం పిల్లల మీద కనికరం లేకుండా నిర్దాక్షిణ్యశీ గా బస్ కదిపి వెళ్ళారు. వెళ్తూ వెళ్తూ మీరు ఎవరికైనా చెప్పుకోండి అంటూ చిన్న పిల్లలపై కోపంగా మాట్లాడుతూ వెళ్లారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్తితి వల్ల బస్ లు తీసుకుని రోజు పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నమని, ప్రతి రోజూ ఇలాగే చేస్తున్నారని అన్నారు. ఇలా బస్ పాస్ ఉన్నా రోజు అదనపు నగదు వెచించి ఆటోలో వెళ్తున్నామని వాపోతున్నారు. అదే సమయానికి తోటపల్లి బస్టాండ్ వద్ద కు వచ్చిన తల్లిదండ్రులు ఆర్టీసీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బంది పద్ధతి సరిగా లేదని, ఇలా తరచూ జరుగుతుంటే సంబంధిత ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పాఠశాల ప్రారంభం, ముగింపు సమయానిక అదనపు బస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## వాకలపూడిలో ఓటర్ల జాబితా ప్రక్రియ పరిశీలన

**కాకినాడ రూరల్, ఆగస్టు 30(ప్రభాతవార్త):** ఎన్నికల ప్రక్రియలో భాగంగా వాకలపూడి గ్రామంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా వార్డుల వారీ విభజన, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల జాబితాల తయారీ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. దానవీర కార్యక్రమంలో భాగంగా మాసా ఏసుబాబు అందించిన కంప్యూటర్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్, డిప్యూటీ ఎండిఓ ఎం.శ్రీరామ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## కాకినాడ జిల్లాలో నీట్ పీజీ పరీక్షలకు పటిష్ట పోలీసు బందోబస్తు, పర్యవేక్షించిన అడిషనల్ ఎస్పీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ఆగస్టు 30 (ప్రభాతవార్త )** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో నీట్ పీజీ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది.



జిల్లాలోని మొత్తం ఐదు నీట్ పీజీ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పరీక్షల నిర్వహణకు సంబంధించిన భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ నియంత్రణ, పరీక్షార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్ వివిధ పరీక్షా కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో భద్రతా పరిస్థితులను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పరీక్షార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ ఎస్పీ ఆదేశించారు.

### న్యాయవాదులు చట్టాల పట్ల
## సమగ్ర అవగాహన కలిగి ఉండాలి...
### విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పశివశంకర్.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు30,ప్రభాతవార్త.** న్యాయవాదులు చట్టాల పట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పి.శివశంకర్ అన్నారు. "ఆస్తి చట్టాలు -- 2018 సం.లో సవరించబడిన స్పెసిఫిక్ రిలీఫ్ చట్టంపై ప్రత్యేక ప్రస్తావన" అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం స్థానిక కిమ్స్ మెడికల్ కాలేజ్ ప్రాగణంలోని సి. పద్మనాభ రెడ్డి సెమినార్ హాల్ లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి చట్టాలను పలు సుప్రీంకోర్టు హైకోర్టు జడ్జిమెంట్ లను ఉదహరిస్తూ వివరించారు. చట్ట సవరణలు తీర్పు లు పట్ల న్యాయవాదులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవడం ద్వారా కక్షి దారులకు న్యాయం అందచేయవచ్చుని వివరించారు. అనంతరం ఆయనకు దుశ్శాలువాతోనూ, పూలమాలలతోనూ ఘనంగా సన్మానించి మెమెంటో అందచేసారు.ఈ కార్యక్రమంలో ఐ.ఏ.ఎల్.జిల్లా అధ్యక్షుడు ఎండి.అజామ్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశి శేషారావు,బార్ కౌన్సిల్ సి.హెచ్.అజయ్ కుమార్, ముప్పాళ్ళ సుబ్బారావు, కూచిమంచి మళ్ళపరాజు, కె.శశిధర్ శ్రీరాం,అబ్బిరెడ్డి సురేష్,నల్లా ప్రభాకర్, నంబూరి మూర్తి,హమీద్ పాషా,బదుగు భాస్కర్ జోగేష్, మణి, లావణ్య,క్రాంతి,సాయి పాల్గొన్నారు.



## నర్సరీ సంఘం పీఠం.. బొరుసు సుబ్బారాయుడిదే!

**356 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం.. 81 శాతం పోలింగ్ నమోదు**

**కడియం, ఆగస్టు 30 ( ప్రభాతవార్త)** కడియం మండలం కడియపులంకలో ఆదివారం నిర్వహించిన సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ రైతుల సంఘం అధ్యక్ష ఎన్నికల్లో బొరుసు సుబ్బారాయుడు ఘన విజయం సాధించారు. మొత్తం 1,997 మంది ఓటర్లకు గాను 1,621 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 81 శాతం పోలింగ్ నమోదైంది. అధ్యక్ష పదవికి పోటీ చేసిన బొరుసు సుబ్బారాయుడికి 985 ఓట్లు, రత్నం అయ్యప్పకు 629 ఓట్లు లభించాయి. ఏడు ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. దీంతో సుబ్బారాయుడు 356 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సంఘంలో మొత్తం 11 వార్డులు ఉండగా, 3, 7వ వార్డులకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. 7వ వార్డు నుంచి పుల్లా శ్రీను, 3వ వార్డు నుంచి దూలం సత్యనారాయణ విజయం సాధించారు. మిగిలిన వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా డీఎస్పీ శివప్రియ, కడియం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, మహిళా ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న, ఏఎస్ఐ రమణ ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



## సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థానికులు సంస్కరించాలి... : ఎమ్మెల్యే దేవ...



సఖినేటిపల్లి ఆగస్టు 30, (ప్రభాత వార్త): అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది కర గ్రామపంచాయతీ పరిధిలో 132/33 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటు అయితే పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రానున్న 25 నుంచి 30 సంవత్సరాల వరకు విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ఈ సబ్‌స్టేషన్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన రహదారిని కూడా తగిన విధంగా వెడల్పు చేయాలని, అంతర్వేది కర గ్రామంలో ప్రధాన సమస్యలైన ముంపు, మంచినీరు, రహదారులు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దేవ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి పెదకాపు, ఎంపీటీసీలు నాగరాజు, బాబూరావు,రావూరి నాగు, మాజీ సర్పంచ్ కిషోర్, సత్తిబాబు, నాగు, స్వామి, వాసు, ఎమ్మార్వో సూర్యనారాయణ రాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపికి కార్యకర్తే వెన్నుముక..

**కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేత..**



అంబాజీపేట,ఆగస్టు 30, (ప్రభాతవార్త): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే వెన్నుముక, ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తుందని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు (పెదబాబు) అన్నారు. మండలంలోని మాచవరం గ్రామపంచాయతీ పరిధిలోని మెట్ల కాలనీకి చెందిన అడబాల సాయి గురుదత్త రావులపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 7న మృతి చెందారు.మృతుని గురు దత్తసాయి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ,పార్టీ సభ్యత్వం (రూ.100లు) పొందడంతో రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తించిందని టిడిపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు.పార్టీకి అందించిన సేవలను గుర్తుంచుకుని వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి బాధిత కుటుంబ సభ్యుని బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం నుండి మృతుని వివరాలతో పంపించిన పత్రమును కూటమి శ్రేణులు మృతుని తల్లిదండ్రులకు అందజేశారు. చేతికందివచ్చిన బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తమకు తెలుగుదేశం పార్టీ అండగా నిలిచిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, జనసేనాని,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక టిడిపి, జనసేన నాయకులకు మృతుని తల్లిదండ్రులు, సోదరుడు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గూడాల ఫణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు,క్లస్టర్ 007 ఇంచార్జి గణపతి వీర రాఘవులు, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయిక్రిష్ణ, రవణం రాము, జోగి కృష్ణ చైతన్య, దొమ్మేటి శ్యామ్,పులిదిండి సోమశేఖర్,కొప్పినీడి ఈశ్వరరావు,యగన రాము, దొమ్మేటి బాబు ప్రసాద్, గుబ్బల వెంకటరమణ, మట్టపర్తి శ్రీనివాసరావు, మానుపాటి గోవింద,యలమంచిలి బుచ్చిబాబు,అడబాల సుబ్బరాజు, వంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి,కార్మిక శాఖ మంత్రి లకు పాలాభిషేకాలు



కె గంగవరం,ఆగస్టు 30, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం తాళ్లపోలు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ లకు బీసీ వర్గానికి 24 నుండి 34 శాతానికి రిజర్వేషన్ పెంపొందించిన సందర్భంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రభుత్వం బీసీ వర్గానికి చేస్తున్న కృషిని గ్రామ ప్రజలు అభినందించారు. క్లస్టర్ కడలి వీర వెంకట సత్యనారాయణ కో కన్వీనర్ బూత్ కో ఇన్ఛార్జ్ కడలి చంద్రశేఖర్ మేడిశెట్టి రామారావు కోట పెంటయ్య లతోపాటు స్థానిక నాయకులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## యానాంలో ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ప్రీమియర్ లీగ్--2026

**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉత్సాహంగా హాకీ పోటీలు**





యానాం, ఆగస్టు 30: (ప్రభాతవార్త) జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని యానాంలో శనివారం మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ప్రీమియర్ లీగ్--2026 టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. యానాం రీజియన్ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో, హాకీ పుదుచ్చేరి అనుబంధంతో జీఎంసీ బాలయోగి గ్రౌండ్ లో జరిగిన ఈ పోటీల్లో మొత్తం ఐదు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. యానాం ప్రాంతంలో హాకీ క్రీడను ప్రోత్సహించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, స్థానిక ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కోచ్ అశ్విన్ ఆధ్వర్యంలో మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివాజీ మీనా, డి. సురేష్ బాబు, మల్లాడి సామిల్ తదితరులు హాజరై క్రీడాకారులను అభినందించారు. విజేత జట్టుకు ముఖ్య అతిథి శివాజీ మీనా చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మీనా మాట్లాడుతూ, యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులయ్యేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యానాం ప్రాంతంలో హాకీకి మరింత ఆదరణ కల్పించి, క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు అందించాలని ఆకాంక్షించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి అసోసియేషన్ సభ్యులు శేషసుమన్, సుంకర కార్తీక్, బొమ్మిడి కమేష్, ఆకుల జయదేవ్, ఎర్రబండి స్వామి, ఎస్. రఘురాం, పి. సంతోష్ తదితర స్వచ్ఛంద సేవకులు అందించిన సహకారం ఎంతో విలువైనదని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్ యానాంలో క్రీడా వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది.

# ప్లాస్టిక్‌తో పచ్చని బస్‌షెల్టర్లు!

- పిఠాపురంలో అప్సైకిల్డ్ ప్లాస్టిక్ జోన్ బస్‌షెల్టర్లకు రూ.10 లక్షల సీఎస్ఆర్ సాయం
- ఎన్విజన్ ఎనర్జీ ఇండియా ముందడుగు.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం





పిఠాపురం, ఆగస్టు 30 ( ప్రభాతవార్త ) పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ సుందరీకరణకు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) మరో అడుగు ముందుకు వేసింది. పట్టణంలో అప్సైకిల్డ్ ప్లాస్టిక్‌తో పర్యావరణహిత బస్‌షెల్టర్ల ఏర్పాటుకు ఎన్విజన్ ఎనర్జీ ఇండియా సంస్థ రూ. 10 లక్షల సీఎస్ఆర్ నిధులను అందించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు రూ. 10 లక్షల చెక్కును పాడా పీడీ ఎన్వీ శివరామ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్టీవీ రాజేశ్వరరావు, ఏపీడి వసంత మాధవి సమక్షంలో పాడా కార్యాలయంలో అందజేశారు.వ్యర్థమే.. బస్‌షెల్టర్‌కు ముడిసరుకు సీఎస్ఆర్ నిధులతోపర్యావరణ విభాగం కింద చేపడుతున్న ఈ కార్యక్రమంలో ల్యాండ్‌ఫిల్‌కు చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, వాటిని శాస్త్రీయంగా అప్సైకిల్ చేయనున్నారు. ఆ ప్లాస్టిక్ పదార్థాలను వినియోగించి పర్యావరణహిత బస్‌షెల్టర్లను నిర్మించనున్నారు. దీంతో ఒకవైపు ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు పరిష్కారం లభించడంతోపాటు మరోవైపు ప్రజలకు మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

**పాడాతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది**

పిఠాపురం ప్రాంతంలో సుస్థిర అభివృద్ధి, స్వచ్ఛమైన సాంకేతికత, పర్యావరణ పరిరక్షణకు పాడా ఇస్తున్న ప్రాధాన్యతతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని ఎన్విజన్ ఎనర్జీ ఇండియా ప్రతినిధులు తెలిపారు . ఎన్విజన్ ఎనర్జీ ఇండియా సంస్థ సి ఎస్ ఆర్ నిధులను పర్యావరణ పరిరక్షణ, ప్రజా సౌకర్యాల కల్పన వంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమని, పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ .వి శివరామ ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ తీర ప్రాంతాన్ని పర్యావరణపరంగా మరింత బలోపేతం చేసేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించిన గ్రీన్ వాల్ కార్యక్రమానికి కూడా ఎన్విజన్ ఎనర్జీ ఇండియా సంస్థ సహకారం తో కాకినాడ ప్రాంతంలో పదివేల మడ మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించడం శుభ పరిణామమని స్పష్టం చేశారు.

**స్వచ్ఛ సాంకేతికతలో ఎన్విజన్ సేవలు**

ఎన్విజన్ ఎనర్జీ ఇండియా సంస్థ స్మార్ట్ విండ్ టర్బైన్లు, గ్రిడ్‌కు అనుసంధానిత యుటిలిటీ స్థాయి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో సేవలందిస్తోంది. పర్యావరణహిత సాంకేతికతను ప్రోత్సహిస్తూ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పిఠాపురం ప్రాంతంలో చేపడుతోంది.

## 'దైవభక్తి పెంచాలి.. దుర్వ్యసనాలను పారదోలాలి'



గోపాలపురం, ఆగస్టు 30 (ప్రభాతవార్త): దైవభక్తితో, మంచి నైతిక విలువలతో జీవిస్తూ యువత గంజాయి, మాదక ద్రవ్యాలు వంటి దుర్వ్యసనాలను పూర్తిగా పారదోలాలని ఎస్సై సుబ్రహ్మణ్యం సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం దెబ్బతినడంతో పాటు భవిష్యత్తు నాశనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆదివారం పెద్దగూడెం, ఉప్పరగూడెం, గోపాలపురంలోని పలు చర్చిల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించిన ఎస్సై.. చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించినట్లు అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు వినియోగించే గంజాయి పరీక్షా కిట్ల గురించి వివరించారు. అనుమానితుల నమూనాలను పరీక్షించడం ద్వారా గంజాయి ఆనవాళ్లు కనబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సోషల్ మీడియాను బాధ్యతగా ఉపయోగించాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని సూచించారు. పిల్లల భద్రతకు సంబంధించిన పోక్సో చట్టంలోని నిబంధనలు, బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన చర్యల గురించి వివరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహాలు, సామాజిక మాధ్యమాల వినియోగంపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు. ప్రార్థన, దైవభక్తి, మంచి ఆలోచనలు, నైతిక విలువలతో యువత సన్మార్గంలో నడవాలని ఎస్సై సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు.

## రమణ కుమార్ మాస్టారు సేవలు ఆదర్శనీయం.



తాళ్లరేవు, ఆగస్టు 30 (ప్రభాతవార్త): సుమారు 40 సంవత్సరాలుగా విద్యాశాఖలో ఉపాధ్యాయ వృత్తి నిర్వహించి ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన మాధవరాయనిపేట ఏ. ఏ. స్కూల్ హెచ్‌ఎం శీలం వెంకటరమణ కుమార్ సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. రమణ కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా తాళ్లరేవు అంబేద్కర్ భవనంలో మాధవరాయనపేట గ్రామస్తులు, ఆ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రమణ కుమార్ మాస్టారుకు ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దున్న జనార్ధన రావు మాట్లాడారు. తల్లిదండ్రులు బిడ్డకు జన్మనిస్తే ఆ విద్యార్థికి ప్రపంచ జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులేనని అన్నారు. ప్రపంచానికి మానవ వనరులను అందిస్తున్న ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన రమణకుమార్ మాస్టారు సేవలను ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా రమణ కుమార్ మాస్టారును మాధవరాయణిపేట గ్రామస్తులతోపాటు, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు అధికారులు రాజకీయ ప్రముఖులు దుస్సాలువ పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు తాతారావు, విశ్రాంత ఎంఈఓ మందాల గంగ సూర్యనారాయణ, మాధవరాయని పేట స్కూల్ ఉపాధ్యాయ బృందం, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కానరాని విద్యుత్ స్థంభం..
## ఉద్యోగుల నిర్లక్ష్యం : ..స్థానికుల ఆవేదన



మామిడికుదురు.ఆగస్టు 30(ప్రభాతవార్త) మామిడికుదురు ముస్లిం వీధిలో ఉన్న కరెంటు స్తంభాన్ని అనంత లత తీగలు పూర్తిగా అల్లుకుపోయాయి. కరెంటు స్తంభం కింది భాగం నుంచి పై వరకు పెద్ద ఎత్తున తీగలు అల్లుకు పోయి స్థంభం కనిపించని విధంగా మూసేయడంతో తరచు పలు సమస్యలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత ఉద్యోగుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్తంభంతో పాటు కరెంటు తీగలను కమ్మేసిన అనంత లత తీగలను తక్షణం తొలగించి ఇక్కడ నెలకొన్న ప్రమాదకర పరిస్థితిని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థంబానికి బల్బు కూడా లేకపోవడంతో రాత్రి సమయంలో చాలా దారుణంగా ఉంటుందని బల్బు వేయడానికి కూడా స్థంభం ఎక్కలేని పరిస్థితి ఏర్పడంతో పంచాయతీ సిబ్బంది విద్యుత్ బుల్బు కూడా వేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రామవరం గ్రామంలో రెండేళ్ళ పాలనపై టిడిపి విస్తృత ప్రచారం



వి.ఆర్.పురం,ఆగస్టు 30,ప్రభాతవార్త మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ, రామవరం గ్రామంలో ఆదివారం తెలుగుదేశం నాయకులు రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనను పురస్కరించుకొని, తెలుగుదేశం నాయకులు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు గొర్రె.సీతారాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్.పి.టి.సి సభ్యులు, ఆ పార్టీ సీనియర్ నాయకులు వాళ్ళ.రంగారెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్ లు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి - సంక్షేమం,ఇంటింటి ప్రచారానికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభించిందన్నారు. ఇదే స్పూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అధ్యధిక మందిని గెలిపించుకునేందుకు ప్రతీ ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని రంగారెడ్డి, నరేష్ కుమార్ లు పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ వైద్య సేవ తదితర ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొనివస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాయం.రామారావు, యూనిట్ ఇన్చార్జులు బీరకా.సూర్య ప్రకాష్ రావు, బొర్రా.నరసింహారావు, ఐటిడిపి కన్వీనర్ ఆకోజు.భాగ్యలక్ష్మి,, కోట్ల.బాలయ్య, తెల్లం.అప్పారావు, రేవు.సింహాచలం, గొర్రె.కృష్ణ, మడకం.రాజు, గొర్రె.వెంకటేశ్వర్లు, మిడియం.వీరయ్య, ఆకోజు.రంగాచారి, బి.సురేష్, నారకొండ.బ్రహ్మయ్య, కూర.బ్రహ్మయ్య, ఎస్.శ్రీరాములు, గొర్రె.రాముడు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీపీ సునీత కుటుంబానికి మాజీ మంత్రి చిక్కాల పరామర్శ.



తాళ్లరేవు ఆగస్టు 30 (ప్రభాతవార్త): పతీ వియోగంతో బాధపడుతున్న తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత, కుటుంబ సభ్యులను మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆమె భర్త డాక్టర్ రాయుడు గంగాధర్ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి మంచి అడ్మినిస్ట్రేషన్ అందించారని కొనియాడారు. ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో గోవలంక మాజీ సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, స్థానికులు కొత్తూరు కాశీ ఈశ్వరుడు, దంగేటి అన్వేష్ తదితరులు ఉన్నారు.

## మరుగుదొడ్లకు తలుపులు లేవు..

**సురక్షిత త్రాగునీరు లేదు...రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి వెల్లడి..**





రాజవొమ్మంగి, అగస్టు 30, ప్రభాతవార్త గిరిజన సంక్షేమ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జిరెడ్డి ఆదివారం ప్రభాతవార్తకు తెలిపారు. రాజవొమ్మంగి మండలం అమినాబాద్ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశానని అన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవన్నారు. త్రాగునీటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదని తెలిపారు. బాత్ రూమ్ కు వద్ద అడవిలా గడ్డి పెరిగిపోయిందని అన్నారు. రికార్డులు నిర్వహణ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులు నాణ్యత లోపించిందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా అధికారులు దృష్టి ఈసమస్యలను గుర్తించలేదన్నారు. శిదిలావస్థ భవనాలను వినియోగిస్తున్నారని వెల్లడించారు. కొత్త భవనాల నిర్మాణం కోసం గోతులు తీసి వదిలి వేశారని తెలిపారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తానని వివరించారు. ఈకార్యక్రమంలో హెచ్. ఎం. విక్టోరియా ప్రమీలారాణి, లొసుల రాజబాబు, తాము సూరిబాబు, కుంజం సత్యనారాయణమ్మ, బాబూరావుదొర, భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి..

**36వ రోజు టీడీపీ డోర్ టు డోర్ ప్రోగ్రాం.**



అంబాజీపేట,ఆగస్టు 30, (ప్రభాతవార్త): సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు ( పెదబాబు) అన్నారు.క్లస్టర్ 007 ఇన్చార్జి గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలో 120 పోలింగ్ బూత్ లో "రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా 36వ రోజు తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమంను ఆదివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి రవణం రాము, బూత్ కన్వీనర్ బండారు దుర్గారావు,టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, నేదునూరి రాజ కుమార్, సత్తాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మిడివరం లో ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



ముమ్మిడివరం. ఆగస్టు 30 (ప్రభాత వార్త ) ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధి రాజుపాలెం లో జనసేన యూత్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు పవన్ పుట్టినరోజు వారోత్సవాలు లో భాగంగా పవన్ కళ్యాణ్ కటౌట్ ఆవిష్కరణ, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పృధ్వీరాజ్ భార్యకే కట్ చేశారు. ఈ వేడుకలలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, బద్రి రమాదేవి, బద్రి వీర వెంకట సత్యనారాయణ లతోపాటు అదిక సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు

## నకిలీ గిరిజనులుపై చర్యలు తీసుకోండి..

**రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ కు అర్జీ.. కలెక్టర్ కు పిర్యాదు ఇచ్చామని గిరిజనులు ఆవేదన**



రాజవొమ్మంగి, అగస్టు 30, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం చికిలింత పంచాయితీ కరుదేవపాలెం గ్రామంలో గిరిజనులు కాని వారు గిరిజన కొండరెడ్లుగా 25 కుటుంబాలు చెలామణి అవుతూ ప్రభుత్వం ద్వారా రేషన్, ప్రభుత్వ పథకంలో ఇల్లు, సోలార్ అని పథకాలు పొందుతున్నారని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జిరెడ్డికి శనివారం రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాయంలో జరిగిన కార్యక్రమం లిఖిత పూర్వక పిర్యాదు చేసామని జె. శ్రీలక్ష్మి, బి. రామకృష్ణ తెలిపారు. రంపచోడవరం ఐ. టి. డి. ఏ. గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్, జిల్లాజాయింట్ కలెక్టర్ కు రెండుసార్లు పిర్యాదు చేసామన్నారు. కనీసం రెవిన్యూ వారు విచారణ చేయలేదన్నారు. ఓటర్లు జాబితాలో పేర్లు కూడా మార్చుకొన్నారని పిర్యాదులో పలువురు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తానని బొజ్జిరెడ్డి అన్నారని ఆర్. శ్రీను తెలిపారు. చికిలింత పంచాయితీ కరుదేవపాలెం గ్రామంలో నకిలీ గిరిజన కులధ్రువపత్రాలతో ప్రభుత్వ పథకంలో ఇల్లు, రేషన్, సోలార్, అనేక రాయితీలు కొండరెడ్లు గా పొందుతున్నారని జిల్లా కలెక్టర్ కు రెండుసార్లు పిర్యాదులు ఇచ్చినా కనీసం విచారణ లేదని రెడ్డి శ్రీను, కొచ్చా భద్రయ్యలు ఎస్టీ కమీషన్ చైర్మన్ కు పిర్యాదు చేశారు.

### స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

**మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



సీతానగరం, ఆగస్టు 30, (ప్రభాతవార్త): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రాపురం, రఘుదేవపురం తదితర గ్రామాల్లో పార్టీ గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గ్రామస్థాయిలో పటిష్టమైన సంస్థాగత నిర్మాణం ఉంటేనే ఎన్నికల్లో సమర్థంగా పనిచేయగలమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాడాలని అన్నారు. ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### మహిళా కళాశాలకు సౌండ్ సిస్టం బహుకరణ



ముమ్మిడివరం ఆగస్టు 30 (ప్రభాతవార్త) ముమ్మిడివరం శ్రీ కృష్ణ దేవరాయ మహిళా కళాశాల, రావ్ బహుదూర్ రఘుపతి వెంకట రత్నం నాయుడు మహిళా కళాశాలలో సౌండ్ సిస్టమ్ సమకూర్చు కునేందుకు 25వేలు చెక్కును విశ్రాంతి తెలుగు ఉపాధ్యాయులు ఏనుగుల వెంకట రమణమూర్తి కళాశాల యాజమాన్యంకు అందజేశారు. ఈయన ప్రభుత్వ పాఠశాలలో పదవి విరమణ పొందిన అనంతరం. మహిళా కళాశాలలో 18 సంవత్సరాలపాటు ప్రిన్సిపల్ గా తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. నిన్న శనివారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఆయన కళాశాల కర్స్పాండెంట్ గణేశులు బ్రహ్మానందం, గంధం శ్రీరామ మూర్తి లకు చెక్కును అందజేశారు.

### అసాంఘిక కార్య కలపాలకు అడ్డాగా క్వారీ గోతులు

**కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబు**



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30, ప్రభాతవార్త, బొమ్మూరు కు చెందిన గడ్డం ధనలక్ష్మి అనే వివహితను పుట్టినరోజు వేడుక నెపంతో మట్టడి ప్రసాద్, అయ్యప్ప అను ఇద్దరు అన్నదమ్ములు గాడాల శివారులలో ఆమెపై హత్యాయత్నం కు పాల్పడ్డారనీ, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు ధనలక్ష్మి తలపై సుత్తితో తీవ్రంగా గాయపడిందని ఆమె చనిపోయిందని భావించి క్వారీగోతుల్లో పడేసారన్నారు. తర్వాత రోజు పారిశుద్ధ్య సిబ్బందికి ఆమె మూలుగును వినిపించడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమెను ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్చారన్నారు. తాను ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లడంతో నిందితుల మీద చర్యలు తీసుకొని హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. 2011 లో క్వారీ గోతులను పూడ్చలని హైకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, మైన్స్, ఆర్ అండ్ బి శాఖలకు విజ్ఞప్తి చేసా మన్నారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

## ఒంటరి మహిళపై హత్యాయత్నం..

**బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండ**

**మహిళకు న్యాయం జరిగే వరకు పోరాడతాం: గిరజాల బాబు**



కడియం, ఆగస్టు 30( ప్రభాతవార్త) హత్యాయత్నానికి గురై రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒంటరి మహిళ గెడ్డం ధనలక్ష్మిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆదివారం పరామర్శించారు. బాధితురాలి కుటుంబ సభ్యులను కలిసి సంఘటన వివరాలను అడిగి తెలుసుకుని, ఘటనను తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా గిరజాల బాబు మాట్లాడుతూ.. బాధితురాలు, ఆమె కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే పార్టీ జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్తామని ఆయన తెలిపారు. బాధితురాలికి ప్రస్తుతం వయసు పైబడిన తండ్రి, అక్క, తమ్ముడు ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నారని, వారికి బెదిరింపులు వస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. ఆసుపత్రిలో ఉన్న బాధితురాలికి, కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ కల్పించాలని ఆయన పోలీస్ శాఖను కోరారు . ధవళేశ్వరంలోని ఎర్రకొండలో నివసిస్తున్న బాధిత కుటుంబానికి, ఆమె ఇద్దరు పిల్లలకు కూడా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరజాల బాబు డిమాండ్ చేశారు. మహిళలపై వరుసగా జరుగుతున్న దారుణాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్ర హోంమంత్రి స్వయంగా ఈ ఘటనను పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిలుకూరి రామకృష్ణ, బత్తిన శ్రీధర్, సిరిగినీడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### దుళ్ల ఎర్రకాలనీలో పట్టపగలే భారీ చోరీ

**రూ.3.50 లక్షల నగదు.. 10 కాసుల బంగారం, వెండి వస్తువులు అపహరణ**



కడియం ,ఆగస్టు 30 ( ప్రభాతవార్త) దుళ్ల ఎర్రకాలనీలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం వేములపల్లి గ్రామంలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లగా, తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తుతెలియని దుండగుడు లక్ష్యంగా చేసుకున్నాడు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఇంట్లోకి చొరబడి రూ. 3.50 లక్షల నగదు, సుమారు 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించినట్లు బాధితుడు మానేం సత్యనారాయణ తెలిపారు. ఇంటికి తిరిగి వచ్చిన సత్యనారాయణ చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శివప్రియ, ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఫోరెన్సిక్ సిబ్బంది ఇంట్లో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వద్దిపర్రు లో "పల్లె నిద్ర"





ఆత్రేయపురం, ఆగస్టు 30,(ప్రభాత వార్త) వద్దిపర్రు గ్రామంలో ఆదివారంరాత్రి "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని ఆత్రేయపురం ఎస్సై ఎస్ రాము, సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సబ్-ఇన్స్పెక్టర్ ఎస్ రాము వారి సిబ్బంది స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, పోక్సో యాక్ట్, సోషల్ మీడియా పోస్టులు తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేగాక ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల తీరుతెన్నుల గురించి వాటి బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించవలసిన తీరును గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు గ్రామ పెద్దలు, యువకులు, పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో



## భారత రాజ్యాంగ విలువలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

**బామ్ సెప్ సమావేశంలో డాక్టర్ పి పద్మావతి పిలుపు**

**రాజమహేంద్రవరం అర్బన్,ఆగస్టు 30, ప్రభాతవార్త,** ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమైన వ్యక్తిగత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ కాపాడుతున్న భారత రాజ్యాంగ విలువల గొప్పతనాన్ని ప్రజల్లోనూ నేటి యువతలోను చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర నిర్మాత డాక్టరు పి పద్మావతి పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం గొప్పతనాన్ని తెలిపే విధంగా క్లస్టర్ సమావేశం ఆదివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జరిగింది. బామ్ సెప్ డిఇసి సభ్యులు జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ, నేటి పాలకులు భారత రాజ్యాంగాన్ని విస్మరించి, సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దాంతో సమాజంలో 90 శాతం ప్రజలు హక్కులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగ కాపాడు కోవడంలో బహుజనులను బహుజనుల్లో ఐక్యతను తీసుకురావాలన్నారు. ఈ దిశగా దేశవ్యాప్తంగా బామ్ సెప్ దేశవ్యాప్తంగా చేస్తున్న కృషిని అభినందించారు. బామ్ సెప్ ఎన్ ఇ సి సభ్యులు ఎన్ గంగాధర్ మాట్లాడుతూ, దేశంలో గత దశాబ్ద కాలంగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం వ్యవస్థలు అణిచివేతకు గురవడం ఆందోళన కలిగించే పరిణామన్నారు. భిన్న వర్గాలతో కూడిన భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడంలో అంబేద్కర్ రాజ్యాంగమే మూలమని, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులకు ఉందన్నారు. భారత రాజ్యాంగపు విలువలను గ్రామస్థాయికి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జాతీయకరణ ఆవశ్యకత, ప్రైవేటీకరణ నిలుపుదల పై జరిగిన సెమినార్లో జి శ్రీనివాసరావు కథ మాట్లాడుతూ, మారిన ప్రస్తుత దేశకాల పరిస్థితిలో ప్రైవేటీకరణ వైపు పాలకవర్గాలు మొగ్గు చూపుతున్నాయని, అయితే దేశ ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దిశ గా బి ఎస్ 4 దేశవ్యాప్త మహాజన చైతన్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండవ సెమినార్లో మూల్ నివాసి సంఘాల ఐక్యత, ప్రాథమిక సూత్రాలు, కార్యాచరణ అనే అంశంపై పలువురు వక్తలు మాట్లాడుతూ , దేశంలోని మూల్ నివాసి బహుజన సంఘాలన్నిటిని ఐక్యం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందుకు పూలే అంబేద్కర్ సిద్ధాంతాలను విశ్వసించి బ్రాహ్మణవాదాన్ని నిర్మూలించడానికి సామాజిక ఐక్యత మిషన్ ను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. తొలుత బామ్ సెప్ సాంస్కృతిక బృందం ఆలపించిన చైతన్య పూరిత గీతాలు ఆహుతలను ఆకట్టుకున్నాయి. ముందు గా స్థానిక కంబాల చెరువు నుంచి గోకవరం బస్టాండు ఆనం కళా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బామ్ సెప్ ప్రతి నిధులు మేగేంద్ర, ఎం చంటి బాబు, ఎస్ గన్నయ్య (ఎల్ఐసి), సుభాన్, వేణుగోపాల్, కే శివప్రసాద్, కే గంగాధర్, కె.తిలక్ కుమార్ నారాయణ, జి షిఖర్, బి హేమంత్, ఖండవల్లి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు,

## చేబ్రోలులో వైభవంగా శ్రీకృష్ణ విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం

**రూ.10,116 విరాళం అందించిన బీసీవై పార్టీ ఇంచార్జ్ శీరం శ్రీను**



**గొల్లప్రోలు, ఆగస్టు 30,(ప్రభాత వార్త)** గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని పాత నంది సెంటర్లో నూతనముగా ప్రారంభించిన శ్రీకృష్ణ భగవానుడి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఆదివారం జరిగిన ఈ విశేష మహోత్సవంలో పిఠాపురం నియోజకవర్గ బీసీవై పార్టీ ఇంచార్జ్ శీరం శ్రీను విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ కమిటీ సభ్యులకు రూ. 10,116 రూపాయల నగదు విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీకృష్ణ భగవానుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.భక్తుల గోవింద నామస్మరణలతో పాత నంది సెంటర్ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బీసీవై పార్టీ ప్రముఖ నాయకులు,చేబ్రోలు గ్రామ యాదవ సంఘం పెద్దలు,గ్రామ ప్రముఖులు,యువకులు,భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రామచంద్రపురం మున్సిపల్ పీఠంపై పోరు!

**కూటమి--వైసీపీ వ్యూహాలు**

**ఏకగ్రీవాలపై వైసీపీ 'నో '**



**రామచంద్రపురం,ఆగస్టు 30 (ప్రభాతవార్త):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామచంద్రపురంలో రాజకీయ వేడి పెరుగుతోంది.ఎన్నికల షెడ్యూల్, వార్డుల పునర్విభజన,రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉన్నా.. ప్రధాన పార్టీల్లో మాత్రం ముందస్తు కసరత్తు ఊపందుకుంది. ప్రస్తుతం 28 వార్డులు ఉండగా 32కు పెరగనున్న నేపథ్యంలో కొత్త రాజకీయ లెక్కలపై ఆసక్తి నెలకొంది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ,జనసేన, బీజేపీ కూటమిలో వార్డుల సర్దుబాటు కీలకంగా మారనుంది.ఏ పార్టీకి ఎన్ని స్థానాలు దక్కుతాయి? ఎవరిని బరిలోకి దింపుతారన్నదానిపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. వైసీపీ కూడా వార్డులవారీగా బలమైన అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాల ఆధారంగా పార్టీల వ్యూహాలు మారే అవకాశం ఉంది.

**ఏకగ్రీవాలకు చెక్!**

మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలకు తావివ్వకుండా ప్రత్యక్ష పోరుకు కేడర్‌ను సిద్ధం చేయాలని వైసీపీ అధినేత,మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోఆర్డినేటర్లకు సూచించినట్లు సమాచారం. ఏకగ్రీవం జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవన్న సంకేతాలతో రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌పై బాధ్యత మరింత పెరిగింది.ప్రతి వార్డులో బలమైన అభ్యర్థులను నిలబెట్టి కేడర్‌ను సమన్వయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే గత ఎన్నికల్లో వైసీపీకి 10 వార్డులు ఏకగ్రీవమైన నేపథ్యంలో ఈసారి ప్రత్యక్ష పోరు ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక,కూటమి సీట్ల సర్దుబాటు, సామాజిక సమీకరణాలే మున్సిపల్ పీఠంపై తుది లెక్క తేల్చనున్నాయి.

## వారం రోజుల్లో పోరపేట రోడ్డుపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి



**కాట్రేనికోన, ఆగస్టు 30 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలం గెద్దనపల్లి పంచాయతీ పరిధిలోని పోరపేట రోడ్డుకు సంబంధించి అధికారులు, ప్రజా ప్రతినిధులు వారం రోజుల్లో స్పష్టమైన హామీ ఇవ్వాలని మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ తనయుడు జీవి సుందర్ డిమాండ్ చేశారు. పోరపేట గ్రామాన్ని ఆదివారం సందర్శించిన ఆయన అక్కడి సమస్యలపై స్థానికులతో చర్చించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పోరపేటకు రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని సుందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఏళ్ల కాలంగా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టూ ఉన్న ఆక్వా చెరువుల కారణంగా అక్కడకు వచ్చే లోడు వాహనాలతో రోడ్డు పాడయిందన్నారు. పంట కాలువలు, బోదెలు కలుషితం అయ్యాయని తెలిపారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత రెండు దశాబ్దాలుగా రోడ్డు కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులతో కలిసి రహదారిని పరిశీలించారు.ఎస్సీ గ్రామాలు ఉన్నాయనే ఆలోచన లేకుండా నిర్లక్ష్య ధోరణితో ప్రజల కనీస అవసరమైన రహదారి సౌకర్యాన్ని కల్పించకపోవడం దారుణమన్నారు. ఎస్సీ లపై వారి చిత్తశుద్ధి కి ఇది నిదర్శనమన్నారు. పోరపేట రహదారి నిర్మాణంపై జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వారం రోజుల్లోగా స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని జీవి సుందర్ అల్టిమేటం జారీ చేశారు. రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు, అవసరమైతే పోరపేట గ్రామంలోనే బస చేస్తానని ప్రకటించారు.ఈ ఏడాది డిసెంబర్లోగా పోరపేట గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టకపోతే ఆక్వా చెరువులకు వెళ్లే లారీలు, ఇతర వాహనాలను అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు నాయకుడు వడ్డీశ్యాంప్రసాద్, మొండి కృష్ణబాబు, నందిక శ్రీనివాస్, బుసి రాంబాబు, పలువురు యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెరిగిన నిత్యావసర ధరలపై రైతు కూలీ సంఘం ఆగ్రహం

**ధరలు తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు : కర్నాకుల వీరాంజనేయులు**




**గోకవరం ఆగస్టు 30: ప్రభాత వార్త** నిత్యావసర, అత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. పెంచిన బియ్యం, వంటనూనె, పప్పులు తదితర నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండలం రంప యర్రంపాలెంగ్రామంలోఆదివారం రసన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ.. కూలి పనులు సక్రమంగా లభించక ఇప్పటికే ప్రజలు ఆర్థిక ఇబ్బందులతోసతమతమవుతున్న సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం సామాన్యులపై మరింత భారాన్ని మోపుతోందని విమర్శించారు. ధరల పెరుగుదల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాల కుటుంబబడ్జెట్లు తారుమార వుతున్నాయని, అనేకకుటుంబాలు ఒక పూట తిని మరో పూట ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతున్నా ప్రభుత్వాలు ధరల నియంత్రణపై తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మరోవైపు వర్షాభావ పరిస్థితులు, పంటల దిగుబడులు తగ్గడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని వీరాంజనేయులు తెలిపారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు, కూలీలు, సామాన్య ప్రజల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.నిత్యావసర, అత్యవసర వస్తువుల ధరలను ఇదే విధంగా కొనసాగిస్తే ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగి కరువు పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ధరలను తగ్గించాలని కోరారు. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతంచేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే. సతీష్, గోలి ముసలయ్య, చింతపల్లి ముసలయ్య, నరసమ్మ, వీర రాఘవ, లక్ష్మి, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## నిరుపేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ



**కడియం, ఆగస్టు 30 ( ప్రభాతవార్త)** కడియం మండలం దుళ్లగ్రామంలో డితోకల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేసారు. లోక్ సత్తా నాయకులు, సామాజిక వేత్త దివంగత తోకల వీర వెంకట్రావు సంవత్సరీకాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు డితోకల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాధురి దుర్గారావు తెలిపారు.. ఇప్పటికే గ్రామంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని గ్రామస్తులు, పెద్దలు సహకారంతో భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు మాధురీ దుర్గారావు తెలిపారు..అలాగే శ్రీ విద్యా సంస్థ అధినేత కామిరెడ్డి గాంధీ, స్థానిక నాయకులు గుర్రపు కొండయ్య మాస్టారు, సూరపురెడ్డి భరత్, చిట్టూరి వెంకన్న చౌదరి, ఈదర నందబ్బు తదితరులు మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను కొనియాడారు.. బెంగుళూరు లో స్థిర పడినప్పటికీ పుట్టిన గ్రామం పై అభిమానం తో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్ట్ నిర్వాహకులు తోకల విశాలాక్ష్మి, తోకల దుర్గారావు, మాధురి దంపతులను, కురసా కుమారి లను అభినందించారు.సేవా కార్యక్రమాలు ద్వారా ఎందరికో స్ఫూర్తి గా నిలుస్తున్న ఈ ట్రస్ట్ భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని , అందులో తమను భాగస్వాములను చేయాలని కోరారు.. అనంతరం సుమారు వంద మంది నిరుపేదలకు ముఖ్యంగా మహిళలకు చీరలు, పురుషుల కు దుస్తులు , పండ్లు పంపిణీ చేసారు.. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు తోకల వీర రాంబాబు, కామిరెడ్డి రాజా, నాయకులు కామిరెడ్డి నాయుడు, తోకల అర్జున్ , కంటిపూడి రాము, గోపి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి సేవలు చిరస్మరణీయం

**శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల**



**కడియం ఆగస్టు 30 ( ప్రభాతవార్త)** వెనుకబడిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండలం మాధవరాయుడిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని గుబ్బలవారిపాలెంలో నెలకొల్పిన శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. బీసీలకు రిజర్వేషన్ల శాతం పెంచడంతో పాటు చట్టసభల్లో వారికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా పెద్దఎత్తున కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే హామీ నెరవేరుతుందని తెలిపారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ శెట్టిబలిజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. గుబ్బలవారిపాలెం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఈబీసీ కల్యాణ మండపం వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్‌కిరణ్, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మాజీ సర్పంచ్ అన్నందేవుల చంటి, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, సిహెచ్ శ్రీనివాస్,పాలకి శ్రీను,పితాని శివరామకృష్ణ, సానబోయిన వినోద్, గుత్తుల గోవిందు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్తపేట మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**కొత్తపేట, ఆగస్టు30, (ప్రభాతవార్త)** కొత్తపేట మండల పరిధిలో కొన్ని గ్రామాలలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొత్తపేట ఎక్జిక్యూటివ్ ఇంజనీరు కొత్తపల్లి రాంబాబు తెలిపారు సబ్ స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్ పనులు చేపడుతున్నందున కొత్తపేట మండల పరిధిలో కొత్తపేట వాడపాలెం పలివెల గంటి ఆవిడి కొత్తపాలెం కండ్రిగ గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈ ఈ రాంబాబు తెలిపారు సమయంలో వినియోగదారులు అసౌకర్యాన్ని అర్థం చేసుకుని విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించవలసిందిగా కోరుచున్నట్లు ఈ ఈ రాంబాబు తెలిపారు

# జాతీయ రహదారిలో ఇవేం పనులు..?

**హైవే నుంచి గ్రామానికి వెళ్లే చోట ట్రాఫిక్ ఐలాండ్..**

**25 గ్రామాలకు వెళ్లే చోట హైవేకు దూరంగా స్పీడ్ బ్రేకర్లు**



ఫోటో.. 29 రాజవొమ్మంగి
బిక గ్రామానికి వెళ్లే చోట పర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్



**రాజవొమ్మంగి, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాజవొమ్మంగి మండలంలో జాతీయ రహదారి--516 పనులపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా, ప్రజల భద్రతను పట్టించుకోకుండా పనులు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

అల్లూరి జంక్షన్‌లో అసంపూర్తి పనులు

రాజవొమ్మంగి మండల కేంద్రంలోని అల్లూరి జంక్షన్ వద్ద డ్రైనేజీ పనులు పూర్తికాలేదు. ప్రమాదకర మలుపు ఉన్న ఈ ప్రాంతంలో కనీసం ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ జంక్షన్ మీదుగా శాంతినగర్, వయ్యాడ, బొరుగుపల్లి, శ్రీరామ్‌నగర్ తదితర గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ జంక్షన్ ఉన్నట్లు సూచించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని అంటున్నారు.

**ఒక గ్రామానికి శ్రద్ధ.. 25 గ్రామాలకు నిర్లక్ష్యం**

దూసరపాము--కింద్ర జంక్షన్ వద్ద పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం నుంచి సుమారు 25 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. అయితే జాతీయ రహదారిని కలిసే రహదారికి దూరంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారని, సరైన ట్రాఫిక్ ఐలాండ్, ఫ్లడ్‌లైట్లు లేకపోవడంతో ప్రమాదాలకు అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జడ్డంగి జంక్షన్లలోనూ ఇదే పరిస్థితి**

జడ్డంగి నుంచి 25 గ్రామాలకు వెళ్లే జంక్షన్, మరో 12 గ్రామాలకు వెళ్లే జంక్షన్ వద్ద కూడా ఇదే తరహాలో పనులు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చెరుకుంపాలెం వద్ద భద్రతా ఏర్పాట్లు కరవు**

చెరుకుంపాలెం సచివాలయం సమీపంలోని జాతీయ రహదారి జంక్షన్ వద్ద కూడా కాకినాడ జిల్లా వైపు వెళ్లే రహదారికి అనుసంధానంగా తగిన భద్రతా చర్యలు చేపట్టలేదని ప్రజలు చెబుతున్నారు.

**ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాలి**

జాతీయ రహదారి పనులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా లేదా అన్నది తేల్చాలని గిరిజనులు కోరుతున్నారు. కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూరేలా పనులు జరిగాయన్న ఆరోపణలపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి, లోపాలను సరిచేసి ప్రజల ప్రాణభద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

## కోతులగుట్ట ఏపీఆర్ జే సి గిరిజన విద్యార్థికి వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ మృతి

- సకాలంలో వైద్యం అందని వైనం
- పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమంటున్న గ్రామస్తులు
- విద్యార్థిని మృతి పట్ల గ్రామస్తులు రోడ్డుపై బైఠాయింపు
- హుటాహుటిన సంఘటన స్థలాన్ని సందర్శించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్
- బాలిక మృతి పై త్రిసభ్య కమిటీలో విచారణ
- బాలిక కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేసియో, ఒకరికి ఉద్యోగం, రూ. 30 వేలు తక్షణ సహాయం

**కూనవరం, ఆగస్టు 30, ప్రభాతవార్త :** ం కూనవరం మండలం కోతులగుట్ట వద్ద నున్న ఏ పి టి డబ్ల్యూ వి ఆర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తెల్లం జాహ్నవి (12) కడుపునొప్పి, వాంతులతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటన తీవ్ర ఆందోళన కల్గిస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. మండలంలోని పల్లూరు గ్రామానికి చెందిన తెల్లం జాహ్నవి కోతులగుట్ట గురుకుల సంక్షేమ పాఠశాలలో చదువుతుంది. శనివారం రోజున తరచూ తలనొప్పి, వాంతులుగా ఉన్నాయని తెలపడంతో సిబ్బంది సమీపంలోని కోతులగుట్ట ఆసుపత్రికి తీసుకువెళ్లడం జరిగింది. అక్కడ కొంత ప్రథమ చికిత్స చేసిన తర్వాత హాస్టల్ కు పంపడం జరిగింది. రాత్రి కడుపునొప్పి, వాంతులు రావడంతో బాలిక ఆరోగ్యం మరింతగా క్షీణించింది. అక్కడి నుండి హాస్పిటల్ కి తీసుకుని వెళ్లగా భద్రాచలం ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగింది. అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలిస్తుండగా మార్గం మధ్యలోనే బాలిక మృతి చెందింది. బాలిక మృతి చెందిన సంఘటనలో గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి, ఆసుపత్రిలో సరైన వైద్యం అందక పోవడంతో బాలిక మృతి చెందినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెల్లం కుమారి, రమేష్, బంధువులు ఆందోళన చెందారు. పల్లూరు గ్రామంలో అంబులెన్స్ లో ఉన్న బాలిక మృతదేహాన్ని ఉంచి గ్రామస్తులు, బంధువులు, బాలిక మృతి పట్ల సమగ్ర విచారణ జరపాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేపట్టారు. సుమారు 2 గంటలు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గిరిజన సంఘాలు, గ్రామస్తులు, బంధువులు, పాల్గొన్నారు.ఈ సంఘటన వివరాలు తెలుసుకున్న చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్ పల్లూరులో సంఘటన స్థలానికి చేరుకున్నారు. జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడంతో పాటు భాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆందోళనను విరమించాలని కోరుతూ బాలిక మృతి పట్ల త్రిసభ్య కమిటీతో విచారణ జరిపించడం జరుగుతుందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బాలిక కుటుంబానికి రూ. 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేసియో ఇప్పించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వటం కూడా జరుగుతుందని తెలిపారు. ఏది ఏమైనా జరిగిన సంఘటన చాలా విచారకరమని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆహార విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రులందు సిబ్బంది కొరతను నివారించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నోక్వాల్ వెంట ఏపీఓ రామ తులసి, ఎటపాక సీఐ కృష్ణ, స్థానిక ఎస్సై రామకృష్ణ, తహసిల్దార్ ధర్మేంద్ర ఉన్నారు.









Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps